అరుణతార

90 - 91

జూన్-జూలై 1987



CI

ఈ సంచికలో...

	సంపాదకీయం	1	చలసాని ప్రసాద్
కవితలు :	అటవికం	5	కె. వి. ఆర్.
	వంతెన	6	పరధాను
	గాయమింకా అలాగే ఉంది	7	ఉదయమిత్ర
	మహాకవీ....చిరంజీవి మానవుడా....	10	కె.వి.యస్. వర్మ
	చేజారిన సిరెంజికోసం ...	11	—
	తుపాకి నాది	13	కిమ్
	నడిచే కాలం (మ్)	14	సూర్యం
	ఆహార్యం	16	మల్యాస్వీ
కథలు :	అడవిలో వెన్నెల-2	19	బి. ఎస్. రాములు
	నీల	52	అల్లం రాజయ్య
పుస్తక సమీక్ష :	'తులసిదళం'కాదు గంజాయి దమ్ము	47	రా
సమీక్షా వ్యాసం :	'పోరాట నవల' అంటే ఏమిటి?	77	ఎన్. వేణుగోపాల్
	విరసం విశేషాలు	91	

సవరణ :

16 పేజీలో కవి పేరు మల్యాస్వీ గాను, **19** పేజీలో కథ పేరు అడవిలో వెన్నెల-**2** గానూ చదువుకోవలసిందిగా కోరుతున్నాం.

సంపాదకీయం :

సామాజిక విలువలు

ఈ లోకంలో ఒకే వ్యక్తి ఉన్నట్టయితే నీతి, న్యాయం, ధర్మం, స్వేచ్ఛ, స్నేహం, ప్రేమ అనేవి ఉండవు. కనీసం ఇద్దరు వ్యక్తులయినా ఉన్నప్పుడే ఈ పదాలకు అర్థం వుంటుంది. అప్పుడే వారి మధ్య ఎలాంటి సంబంధ బాంధవ్యాలు ఉండాలనే అంశం ముందుకు వస్తుంది. వాటినే మనం మానవ సంబంధాలు అంటున్నాం.

మహోన్నతమైన మానవతా విలువలు నెలకొల్పడానికి మహనీయులు, ప్రవక్తలు, తత్వవేత్తలు ఎంతో తపించారు. ఎన్నెన్నో సూక్తులు, ధర్మాలు వల్లించారు. ఇవేవీ మనిషిని మార్చలేకపోయాయి,

మనుషుల మధ్య సంబంధాలెలా ఏర్పడుతున్నాయి? అవి దైవాధీనాలా? మత నిర్ణితాలా? ప్రభు సమ్మరాలా? పెద్దల అనుమాజ్ఞలా? ఇవేవీ కాకపోతే ఎవరికి వారు

"నవ్వి పోదురుగాక / నాకేటి సిగ్గు? / నా ఇచ్ఛయే గాక/నాకేటి వెరపు" అనుకోవచ్చా?

మనిషి ఏకాకికాదు. జీవితంలో దగాపడ్డ వ్యక్తి తాను ఏకాకి ననుకోవచ్చు. అనుకున్నవి నెరవేరక నీరుకారిపోవచ్చు. మానవ సంబంధాలు వికటించి నందువల్ల ఆ వ్యక్తి విరక్తి చెందవచ్చు. 'జాలితలచి కన్నీరు తుడిచేవారు' లేక ఆత్మహత్యకు పూనుకోవచ్చు. అందుకే ప్రతి ఆత్మహత్య వెనకాల ఒక [illegible]హసం వుంటుందన్నాడు విక్టర్ హ్యూగో.

సమాజంలో మనుషుల మధ్య సంబంధాలు వుంటాయి - వుండాలి. అవి ఎలా వుంటాయి? ఎలా వుంటే బాగుంటుంది? ఎందుకు బాగుండడంలేదు? బాగుండాలంటే ఏం చేయాలి?

"మనిషిని మనిషిగా చూస్తేచాలు. అదే మానవతా దృక్పథం. అప్పుడు అన్ని సమస్యలు వాటంతటవే పరిష్కారమై పోతాయి" అంటారు కొందరు. ఇది చాలా పెద్ద తప్పిదం. మనిషిని మనిషిగా చూడ్డం అసాధ్యం. ఎందుకంటే ఆ మనిషి ఏదో ఒక తరగతికి చెందివుంటాడు. నిరుపేద, నిరుద్యోగి, చిరుద్యోగి,

కూలి, రైతు; భాగ్యశాలి, ఉద్యోగస్థుడు, పెద్ద ఉద్యోగస్థుడు, సంపన్నుడు, వ్యాపారవేత్త, పారిశ్రామికవేత్త. అందాకా అక్కర్లా. ఒక వ్యక్తితో మనకు చుట్టరికమో, స్నేహమో వుండవచ్చు. అంతేగాని ఎవరయినా 'కేవలం' మనిషే ఎలా అవుతారు ? అంటే పుట్టుకతోటో, పెరిగిన పరిసరాలవల్లో, పనిపాటల ద్వారానో ఒక వ్యక్తికి ఇంకో వ్యక్తితో తప్పనిసరిగా సంబంధ బాంధవ్యాలు ఏర్పడతాయి. వ్యక్తుల సమూహమే సంఘం అయినప్పుడు, వ్యక్తిగత సంబంధాల సముదాయమే ఈ సమాజం.

ప్రతి వ్యక్తి సంఘజీవే. సమాజంలో భాగంగానే జీవిక కొనసాగుతుంది. జీవితపు నడక సమాజపు భౌతిక పునాదిమీద ఆధారపడుతుంది. ఉత్పత్తి విధానమే దాని కీలకం.

ఉత్పత్తిలేని మానవ సమాజం అంటూ వుండదు. ఏ వ్యవస్థలో నయినా ఉత్పత్తి అనేది ఉమ్మడిగానే జరుగుతుంది. దానికి ఎంతో కొంత సామాజిక స్వభావం వుంటుంది. ఉత్పత్తి జరగాలంటే పనిముట్లుండాలి. వాటితో పనిచేసే ప్రజలుండాలి. ప్రజలు, పనిముట్లు కలిస్తేనే ఉత్పత్తి శక్తులవుతాయి. ఈ శ్రమశక్తే ఏ సమాజానికయినా పునాది. భౌతికాభివృద్ధి సాధించందే ఉత్పత్తి సాధనాలు మెరుగుపడవు. ఉత్పత్తి శక్తులతోపాటే వాటి సంబంధాలూ రంగం మీదకు వచ్చాయి. వీటినే ఆస్తి సంబంధాలు అంటున్నాం. దీనినిబట్టే పంపిణీ విధానం అమలులోవుంది. ఇదే మానవ సంబంధాలను నిర్ణయిస్తుంది. ఉత్పత్తి శక్తులలో వుండే సామాజిక స్వభావం ఉత్పత్తి సంబంధాలలో లేదు. ఇదే స్వంత ఆస్తికి దారితీసి మానవ సంబంధాలను కలుషితం చేసింది. వైషమ్యం, స్వార్థపరత్వం, కౌటిల్యం, ఈర్ష్య, ద్వేషాలు స్వైర విహారం చేశాయి.

మానవ సమాజం ధనస్వామ్యంలో ప్రవేశించింది. స్వంత ఆస్తి అనే పడగనీడలో మనం మనుగడ సాగిస్తున్నాం. దీనివల్లనే సమాజం రెండు శత్రు శిబిరాలుగా చీలిపోయింది. పనిచేసే వర్గాలు, పెత్తనం చేసేవర్గాలు ఎదురెదురుగా మొహరించి వున్నాయి. సమానత్వం లేనిచోట సామరస్యం వుండదు. ఎప్పుడో కంచికచెర్ల, మొన్నటి పదిరికుప్పం, నిన్నటి కారంచేడు, నేటి నీరుకొండ ఈమాటే చాటి చెబుతున్నాయి. వర్గ సంఘర్షణ, దోపిడీల మీద ఆధారపడిన వ్యవస్థలో శాంతి, సామరస్యాలనేవి గగన కుసుమాలు. ఈ ధన స్వామ్యమే పీడితులను అధోగతికి దిగజార్చింది. వారి జీవితాలతో చెలగాటమాడింది. గుక్కెడు మంచి

KLVA106m/101

నీళ్ళకు, పట్టెడన్నానికి, కట్టుగుడ్డకి, పూరిగుడిసెకి కూడా నోచుకోని నిరుపేద జనం మీద స్వారీ చేస్తున్నారీ ధనస్వాములు.

ఇంకోవైపు సామాజిక విలువలను తలక్రిందులు చేసింది ధనస్వామ్యం. ఇవాళ దీనిదే పెత్తనం. వ్యాపార సంస్కృతిదే పైచేయి. ఇవి రెండూ కుమ్మక్కై మనలని పరిపాలిస్తున్నాయి. సామాజిక విలువలకి మానవత్వానికి ఇవి బద్ధ శత్రువులు.

మనిషి మనిషితో చేరాలి. మాట చేతగా మారాలి. మానవత్వం వికసించాలి. సామాజిక విలువలు పరిమళించాలి.

ఇవి జరగాలంటే ఇంకా మనం చాలా దూరం ప్రయాణం చేయాలి. ధనస్వామ్యం, వ్యాపార సంస్కృతి పోతపోసిన ప్లాస్టిక్కు పువ్వులు. ఇవి వాడిపోవు. వీటిని పీకివేయాలి. మరిగించి కరిగించాలి. ఈ ప్లాస్టిక్కు పువ్వులని పూర్తిగా బూడిద చేయగలిగినప్పుడే సామాజిక విలువలు, మానవత్వం అనే సజీవ పుష్పాలు వికసిస్తాయి.

- చలసాని ప్రసాద్,

18-7-1987.

ప్రభుత్వపు సరికొత్త కుట్రను ఖండించండి !

హైదరాబాద్ కుట్రకేసు, మద్రాసు కుట్రకేసు, పార్వతీపురం కుట్రకేసు చిత్తూరు కుట్రకేసులలో ఉన్న ప్రధాన ఆరోపణలన్నిటినీ కోర్టులు కొట్టివేసినా, సికింద్రాబాద్ కుట్రకేసు, పదమూడు సంవత్సరాలుగా ఎటూ తేలకుండా నడుస్తూ ఉన్నా, మళ్ళీ సరికొత్తగా మరొక కుట్రను రచించింది రాష్ట్ర ప్రభుత్వం. 1986 మే మొదటి వారంలో హైదరాబాదు రాంనగర్‌లో భారత కమ్యూనిస్టుపార్టీ (మా-లె) పీపుల్స్‌వార్ రాష్ట్రకమిటీ కార్యదర్శితో సహా ఏడుగురు కార్యకర్తల అరెస్టు తర్వాత 36 మంది నిందితులపై 'రాంనగర్ కుట్రకేసు' మోపారు. ఈ కుట్రకు 3[illegible]9 మంది సాక్షులు! వీరిలో 120 మంది పేర్లు రహస్యంగా ఉంచారంటే విచారణ సహజన్యాయానికి విరుద్ధంగా రహస్యంగా జరపనున్నారని తెలుస్తున్నది. ఈ కేసులో విప్లవోద్యమ కార్యకర్తలతోపాటు రైతుకూలీ సంఘం, రాడికల్ విద్యార్థి యువజన సంఘాల నాయకులతోపాటు కామ్రేడ్ కె. వి. రమణారెడ్డి, వరవరరావు, బాలగోపాల్, గద్దర్, బి. ఎస్. రాములు, టంకశాల అశోక్‌లను ఇరికించారు. ఐ.పి.సి. సెక్షన్ 121, 121ఎ, 122, టెర్రరిస్టు కార్యకలాపాల నిరోధక

చట్టం సెక్షన్ 3, 4, పేలుడు పదార్థాల చట్టం సెక్షన్ 3, 5, ఆయుధాల చట్టం సెక్షన్ 25, 27 ల కింద ఈ కేసు బనాయించారు. ఈ కుట్రకేసుల ఆధారంగా విప్లవోద్యమ, విప్లవ సాహిత్యోద్యమ కార్యకర్తలను శిక్షించలేమని, వారి మనోస్థయిర్యాన్ని దెబ్బతీయలేమని తెలిసినా, కేవలం సంవత్సరాల తరబడి వేధించేందుకే ప్రభుత్వం ఈ దుర్మార్గానికి తలపడింది. ఈ కుటిల ప్రయత్నాన్ని ఖండించవలసిందిగా ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

- చలసాని ప్రసాద్,

జూలై 1, 87 కార్యదర్శి, విరసం.

[92 పేజీ తరువాయి]

పాల్గొన్నారు. మార్చ్ 23న మార్క్సిస్టు అధ్యయన వేదిక ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ సంస్మరణ సభలో (గుడివాడ), మార్చ్ 29న అందాల పోటీ వ్యతిరేక కమిటీ ఏర్పాటు చేసిన నిరసన ప్రదర్శన, బహిరంగ సభలలో (విజయవాడ). ఏప్రిల్ 5న ఎ పి సి ఎల్ సి ఏర్పాటు చేసిన పోస్టల్ బిల్‌పై సదస్సులో (విజయవాడ), మే 3న అమరుల స్థూపావిష్కరణ కమిటీ ఏర్పాటు చేసిన బహిరంగసభ (జొన్నపాడు)లో, రాడికల్ యువజన సంఘం. మే 4న శివాపురంలో, మే 15న గణపవరంలో, మే 16న కల్వపూడిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలలో, మే 11న గుడివాడ మార్క్సిస్టు అధ్యయన వేదిక ఏర్పాటు చేసిన సమావేశంలో, జూన్ 1న ఎ పి సి ఎల్ సి ఏర్పాటు చేసిన రాజ్యాంగం - తెలుసుకునే హక్కు సదస్సులో, (విజయవాడ), జూన్ 10న అమరవీరుల గ్రంథాలయ కమిటీ ఏర్పాటు చేసిన దాసరి రమణ స్మారక సభలో (విజయవాడ), భగత్‌సింగ్ యువజన సంఘం జూన్ 11న అవనిగడ్డలో, జూన్ 12న కోడూరులో ఏర్పాటు చేసిన నిర్బంధ వ్యతిరేక సభలలో కామ్రేడ్స్ ఉషా ఎస్. డానీ, అనురాధ, ప్రసాద్, దాసు, భుజంగరావు, వేణుగోపాల్ మాట్లాడారు. మార్చ్ 29 అందాలపోటీ వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా అరెస్టయిన వారిలో విరసం సభ్యులు కూడ ఉన్నారు.

గుంటూరు జిల్లా

గుంటూరు జిల్లా గణపవరంలో సాహిత్యాభిమానులు ఏర్పాటు చేసిన శ్రీశ్రీ-చెర సంస్మరణ సభలో కా॥ సి ఎస్ ఆర్ ప్రసాద్ మాట్లాడాడు. శ్రీమతి వాణీరంగారావు అధ్యక్షత వహించిన ఈ సభలో శ్రీ పాపినేని శివశంకర్ తదితరులు మాట్లాడారు.

ఆటవికం

కె వి ఆర్

అంతటి చింతమానే కొయ్యబారింది గదా
మరి, ఇప్పపూత చప్పబడక ఏంచేస్తుంది?
వణకలేనంతటి బెదుపుతో నిలుచుంది వెదురుపొద
పొగతో వుక్కిరి బిక్కిరైంది కదల్లేని గాలి.

అణచడానికేగాని ఆదుకుందామని రాలేదు వాడు
అగ్గి పెట్టడానికేగాని చల్లార్చడానికి కాదు
తగులబెట్టింది గుడిసెల గూడాల్నే గాని భవనాల పేటని కాదు
మిగిల్చింది బుగ్గినే గాని శాంతి భద్రతల్ని కాదు.

మసికొట్టుకుని వెల్లికిలా విరిగిపడింది ఆకాశం
తెల్లబోయిన చందమామ తప్పుకుంటూ జారుతున్నాడు
బొక్కల్లో దూరుతున్న చుక్కల్లో ఒక్కటీ పైకిరాదు
విరబోసుకున్న తలను వాల్చేసుకుంది అడివి.

కాలిన గూడేల వుసురు తగలకుండానే పోదు
బూడిదలో ఎక్కడో ఒక్క నిప్పురవ్వయినా రగుల్తుంది
తాత్కాలిక అశక్తత పిరికి తనానికి పర్యాయపదం కాదు
దౌర్జన్యం ప్రతీకారాన్ని రెట్టింపుగా ప్రేరేపిస్తుంది.

★

వంతెన

పరధాను

బీదవాళ్ళే బీడీలు తాగుతారు
బీదవాళ్ళే బీడీలు చేస్తారు
తాగే పెదవులకు అందించే చేతులకు మధ్యన
కాంట్రాక్టు కత్తుల వంతెన వుంది
దానిమీద డబ్బు ప్రవహిస్తుంది

చట్టం ప్రవహిస్తుంది
జులుం ప్రవహిస్తుంది
దానికింద చెమట ప్రవహిస్తుంది
బాధ ప్రవహిస్తుంది
రక్తం ప్రవహిస్తుంది

అడవిలో వేసవికాలం
కాళ్ళల్లో వేళ్ళల్లో ముళ్ళు గుచ్చుకొని
ఒళ్ళంతా మండే ఎండ గుచ్చుకొని
కళ్ళల్లో కల్లేదార్ల అవమానపు చూపులు గుచ్చుకొని
చెవుల్లో బూతులు గుచ్చుకొని
మనసంతా జల్లెడ కాగా వాళ్ళు అక్కడ ఆకు ఏరుతారు
నొప్పి మరచి పోవడానికి
మాపటి గూర్చి రేపటి గూర్చి
కలల అలల మాలలు గుచ్చుకుంటారు

శ్రమకు తగిన ఫలం పోసి
కూటికి సరిపోయే కూలిడబ్బులు కూడ గిట్టనప్పుడు
పాట ఎవరు పాడినా
అది బతుకు బాట కాదు
బతుకు వేలం పాట

దళారీలేని సంతోషమేమున్నది
సర్కారే పెద్ద దలాల్ అయినపుడు
వాళ్ళ కన్నీటి మడుగుల్లో చేపలకోసం
కొంగ జపాలుచేసే తెల్లబట్టల కాంట్రాక్టర్లయినా
అన్నలొచ్చారని గూడాలమీద వాలి
తినబోయే అన్నాన్ని రొట్టెని "ఎన్‌కౌంటర్" చేసే కావలాదార్లయినా
సంతెన కత్తులందే
పైన వాహనాల్లో దాడి ప్రవేశిస్తుంది

కింద బతుకు పోదలో శ్వాస కష్టమవుతుంది

2

అడవి మనుషులు ఆకులలములు తిని
విషముష్టికాయలు తిని
ఆకలి తీర్చుకున్న చచ్చిన రోజులు పోయినవి
ఆకు కళ్ళాలు తగులబెట్టి
ఆకలి మంటలు లోకానికి ప్రకటించే రోజులు
విషాన్ని దహించే రోజులు వచ్చినవి
అది అరాచకమైతే

రెచ్చగొట్టిన ఆకలిని అరెస్టుచేయాలి
ఏమైనా వెనుకటిలా లేవు రోజులు
వంతెన కింద మంది కూడ బలుకొన్నాని

మంది పాతళ్ళవలె మసలుతున్నారు
వంతెన కింద ఇంకా రక్తమే ప్రవహిస్తున్నది
కానీ ఎదురు తిరిగి ప్రవహిస్తున్నది
హృదయం నుంచి
మళ్ళా హృదయానికి ప్రవహిస్తున్నది

వంతెన కింది జనంనాడి
ప్రవాహంలో కలిసిపోయిన
హతదేహాల
హృదయ స్పందనలు వినిపిస్తున్నది

★

గాయమింకా అలాగే ఉంది

ఉదయమిత్ర

ఈ ఒక్కరోజేకాదు
ఇంకెన్నిరోజుల మీదుగానో

ఎన్నెన్నో వసంతాలు నడిచి వెళ్ళాయి
ఎన్నెన్నో కోయిలలు కూసి వెళ్ళాయి
నదులు ప్రవహించాయి
కళలు వికసించాయి
కళల కిరీటాల కలికితురాయిలు భువన విజయాలు
కలవారి కొలువులో కాకలు తీరాయి
భూమి పులకరించి
సంపదల్ని దోసిలెత్తుతోనే ఉంది
మారుతున్న జెండాలకింద
వాగ్దానాలు శివమెత్తుతూనే ఉన్నాయ్
కాని
గాయమింకా అలాగే ఉంది
గాయమింకా రగుల్తూనే ఉంది
ఉదయాన మార్దవంగా పలుకరించే సూర్యుడు
సాయంత్రానికి సజలనయనాలతో వెళ్ళడం చూస్తూనే ఉన్నాను
శతాబ్దాలుగా
ఉరితీయబడ్డ శిరస్సుకళ్ళలో వేదనాక్రోధాలు
యుద్ధంలో తెగిపడ్డ అవయవాల చివరికదలికలు
సంకెళ్ళబరువుకింద శిథిలమయిన జీవనకావ్యాలు
చరిత్ర దివిటీలకందని చెప్పలేని ఘోరాలు
కాలం గుండెల్లో
మైక్రోఫిల్ములకింద భద్రపర్చబడి
నాగరికతా శిరస్సును
తలదించడానికి సిద్ధంగానే ఉన్నాయ్
రాక్షస హస్తాలమధ్య
పసివాడని పువ్వుల ఆర్తనాదం
మిగిల్చిన తల్లిశోకం
ఈ లోకంమీద శాపమైరాజుతూనే ఉంది

లోతుగాయంమీద కాల్చిన సీసంలాగ
వల్లచట్టాలు పదునుకోరల్ని పెంచుతూనే ఉన్నాయ్
అడవిలో వెన్నెల రక్తాన్ని స్రవిస్తోంది
ఆకు ఆకుమీద సమరకావ్యాన్ని రచిస్తోంది
ఏ పూవు తాకినా
ఏ కిరణం సోకినా
ఏ సౌందర్యలహరులు వీచినా
ఏదో "ఆర్తగీతి" నేపథ్యగానం వినిపిస్తోనే ఉంది
ఇంకెక్కడుంది గాయం?
అది జీవితమైపోయింది
మనిషిగా జీవించడం ఒక సవాలైపోయింది
తెగిన ఊపిర్ల మధ్యన
గుండెనిండా గాలిపీల్చడం ఒక గగనమైపోయింది
ఔను
ఇప్పుడీగాలి ప్రశ్నల్ని మోసుకొస్తోంది
బాధామయగాథల్ని తోడితెస్తోంది
గడప గడపనూతట్టి
మనిషి అస్తిత్వాన్నే ప్రశ్నిస్తోంది
ప్రజలు
గాయాల్ని పోగొట్టుకోవడం కోసం
గాయాల్ని గరళంగా, ఆభరణంగా
చరిత్ర పాఠంగా స్వీకరించి
నిప్పులమీద నడకను
ఒక శాస్త్రంగా, శస్త్రంగా మల్చుకొంటున్నారు
వాళ్ళు
రాత్రి గుండెల్ని చీల్చి

ఉదయవేదిక మీద
రేపటి సూర్యుణ్ణి ఆవిష్కరిస్తారు

★

మహాకవీ…చిరంజీవి మానవుడా…

కె. వి. యస్ వర్మ

నిపురు కప్పితే
నిప్పు లేవన్నట్టేనా
చీకటి ముంచుకొస్తే
వెలుగు రావన్నట్టేనా
నువ్వు కనిపించకపోతే
నువ్వు లేవన్నట్టేనా….

మీటనొక్కితే వినిపించే
నీ ఉద్రేకపు గొంతు
పుట తెరిస్తే కనిపించే
నీ ఉత్తేజపుటక్షరం
నీ ఉద్రేకపు గొంతుతో
గొంతు కలిపే లక్షలాది గొంతులు
నీ ఉత్తేజపుటక్షరాల వెంట
పరిగెత్తే కోట్లాది అక్షరాలు—

నువ్వు సముద్రం
నువ్వు నక్షత్రం
నువ్వు సైన్సు
నువ్వు సెన్సు….

అంతేనంటాను
మేమంతా నువ్వేనంటాను—

పసిపాప నవ్వితే నువ్వు
కన్నీళ్ళు చిప్పిల్లితే నువ్వు
పిడికిళ్ళు బిగించితే నువ్వు
ఆర్తి నువ్వు, ఆవేశం నువ్వు
ఆకలి నువ్వు, ఆయుధం నువ్వు....
కుంకుమపువ్వు నీ సంకేతం
కదలికలోని ప్రతినువ్వూ శాశ్వతం.

★

చేజారిన సిరెంజి కోపం...

పేరుకుపోయిన సందిగ్ధం కరిగిపోతూ
మనసును గాయపరిచే వాస్తవం మిగులుతోంది
"సిరెంజి" చేతిలోంచి జారిపోయింది!
అది పగిలిందా? తెలియదు
పగిలిన శబ్దమూ లేదు
చిందిన నెత్తుటి పేడీ తెలియదు
నమ్మక తప్పని నిజం ఒక్కటి
"సూది"లా మిగిలి
బాధని "ఇంజక్ట్" చేస్తోంది
డాక్టర్‌గారూ!
గోదావరిపైనుంచి గాలి వీచి
తూర్పు కనుమల్లో సుళ్ళు తిరుగుతుంటే
చెయ్యి పట్టి చూసి
"అంతా బహిరంగమేనా?" అని
రోగ నిర్ధారణ చేశారు
"సర్జన్" వచ్చి శస్త్రచికిత్స చేశాక
కళ్ళు తెరిచి చూస్తే
మీ చెవిలోని "స్టెతస్కోపు"

అడవి ఉద్యమగుండె చప్పుళ్ళని
రీడింగ్ చేస్తోంది—
అడవి పువ్వుల వన్నె వాడిపోకుండా
వైద్యం చేశారు మీరు—
మీ చేతుల్లో వెలిగిన "జ్యోతి"
మన్నెం చీకట్లలో ఆరిపోయి
మన కన్నుల్లో మంకెన పువ్వుల్ని పూయించినపుడు
జనానికి కాదు జీవితానికి వైద్యం చేయాలని
"కిట్ బ్యాగ్" సర్దేశారు మీరు—
"స్టెరిలైజ్ చెయ్యని సూది ఇంజక్షన్‌కి పనికిరాదని"
మా ఆరోగ్యాన్ని గురించిన
"చేదైన టానిక్"లాంటి మీ చిరుకోపాన్ని
చిరునవ్వుతోనే తీసుకున్నాం మేం—
ఈరోజు "రెక్టిఫికేషన్ హీట్"లో
మిమ్మల్ని మేం "స్టెరిలైజ్" చేసుకుంటున్నాం—
డాక్టర్‌గారూ!
తుమ్మలావలో నిరుపేదలైన
అమ్మల కన్నుల్లో మేం
వెలుగుపీ చూశాం—
వర్షాన్నీ చూశాం
మీ కన్నతల్లి కన్నీటి తడి
వసంతుడికి వినోదంగానే ఉంది
కాని అది మాగుండెల్ని తడుపుతోంది
కసాయి గుండెల్ని సైతం కన్నీరు పెట్టించే
కమ్యూనిస్టు చావుని
ప్రేమతో దువ్వుతోంది ప్రభుత్వం
చావు ఎవరికైనా వాస్తవమే—

ప్రభుత్వాన్ని చంపి ప్రజల్ని బ్రతికించడానికి
మేం "ఆపరేషన్ థియేటర్"ని సిద్ధం చేస్తున్నాం

[డాక్టర్ సూర్యదేవర మల్లికార్జునప్రసాద్ "అదృశ్యం"పై సి పి ఐ (ఎం ఎల్) పీపుల్స్ వార్, కోస్తా రీజినల్ కమిటీ ప్రచురించిన కరపత్రంలోని ఈ కవిత కవి ఎవరో తెలియదు. కవిత విలువ దృష్ట్యా ప్రచురిస్తున్నాం]

★

తుపాకి నాది

కిమ్

కదం తొక్కుతూ
పదం పాడుతూ
గళాలు కలిపే
కలాలు నావి!
పడుతూ లేస్తూ
పొగిలీ కదిలే
జనాల పదాల
ఘట్టన నాది!
ఒంగి ఒదిగి
బతికి పగిలే
నెత్తుటి నెగడుల
ఆశలు నావి!
కండలు కరిగి
చెమటలు కక్కే
గుండెల మంటల
కాంతులు నావి!
న్యాయం కోసం
తుపాకి నెత్తిన

నెత్తుటి పిడికిట
శక్తులు నావి!
కలాలు నావి
తుపాకి నాది
చెంగే పదాల
దారులు నావి!

★

నడిచే కాలం (వ్యం)

సూర్యం

తెగిపడ్డ ముళ్ళతీగలు
అవకాశాల ఆకాశాలకోసం ఎగజూస్తాయి—
తమ కంటక హస్తాల్లో
వలిగిపోతున్న ఎర్రగులాబీల అందాన్ని
ఎగిరిపోతున్న 'లాకప్పు భాగ్యాల' రాగాల్ని
దోసిలిపట్టి 'హక్కులు'
లోకం కళ్ళపై వెలుగుచుక్కల్లా విరజిమ్ముతున్నందుకు!

*　　*　　*

ముళ్ళ బాధతో మూలిగే సమూహాలు
నిజం
క్షణం మరుగైతే హక్కులు ప్రస్తావిస్తాయి
కోర్టు పక్షి ఈకలపై
వ్యాపార ప(పు)త్రికల రెక్కలపై
రెపరెపలాడే అవగింజంత అవకాశాన్ని
తల్లి కడుపులో
గర్భస్థశిశువులా మెదడులో మెదిలే
వేం

ఆందోళనా తరంగాలతో కలిపి
చిక్కటి అగ్నివర్షాన్ని
ముళ్ళ తీగల నన్నెత్తిపై
ముళ్ళ తీగలు పెంచి, పోషించే విషప్పురుగు వీపుపై
కసిగా విసురుతాయి

*   *   *

చక్రం మామూలుగానే తిరుగుతుంది
ఎగిరే ఆకాశమొకటి
బలంగా చేయిచాస్తే విషప్పురుగు
గోటికి తగలకుండా తగిలింది
అంతే....

అవి అల్లరిమూకలనీ
మూకల మాతులన్నీ వంకరనీ
ఆ 'నిజాల నిర్ధారణల' న్నీ మూకల గతమనీ
విషప్పురుగు మొరుగుతుంది
ఊపిరంతా ఊదేస్తూ
'హక్కుల' గృహాల చుట్టూతా సైడుకాలవల్ని తవ్వేస్తుంది
నిజం వచ్చి
నిజం చెప్పినా సరే మొరాయిస్తుంది

*   *   *

హక్కులు మాత్రం పూరుకోవు
నిజాలు మాత్రం నిద్రించవు
సమూహాలు—
అవే రణ సమూహాలు—
రణం పెంచిన జన సమూహాలు—
విషం రహస్యాల్ని విప్పిచెపుతూ
నడుస్తుంటాయి ....

చీకటి తెరలపై తిరగబడ్డ దివిటీల్లా!
మృగాలపై
విసరబడ్డ మొనదేలిన బరిసెల్లా!!

★

[పౌరహక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ 'అదృశ్య' వివాదంపై]

ఆహార్యం

మల్యాశ్రీ

పంజాబ్ ఢిల్లీ యువిలను చూసి పరవశించడానికి
ఇది 1857 కాదు
ఇవి వలసపాలన కుట్రగా ఆరోపించిన
లాహోర్ మీరట్ విప్లవ చర్యలూ కావు

ఇపుడు నిజంగానే ఢిల్లీ సింహాసనాన్ని కాపాడుకోడానికి
పంజాబ్ ఢిల్లీ మీరట్‌లలో కుట్రజరిగింది

మంచుకొండలు కరిగి
జీవనదులు మతకలహాలశవాలై ప్రవహిస్తున్నాయి

బీభత్స అమృత సరస్సులో రాజహంస
మతంనీరు వేరుచేస్తున్నది
పంచుతున్నది పాలో విషమో
పంజాబ్ ప్రజలకే తెలియాలి

ఉద్రేకమో ఉద్దేశ్యపూర్వకమో
అన్నంతినే కడుపుచీల్చిన
గాలిపీల్చే గుండెపేల్చిన
దాహమడిగే గొంతుకోసిన
మతం ఏదైతేనేం దానిపేరు మృత్యువు

ఏ ప్రార్థనా స్థలంలో ఏ మైకం కమ్మినాచాలు
ఏ మత ఊరేగింపులో ఏ నీలివార్త విసిరినాచాలు
మనుషులు మతాలుగా చీలిపోయి
రక్తనదిలో శవాలుగా తేలిపోయి
కర్ఫ్యూ శాంతిలో సమాధి అవుతారు
మనుషులుగా పుట్టి
మతస్తులుగా పిలవబడినందుకు
ఖాకీమత వైతరణిలో
అమాయక స్వప్నాలు శవాలవుతాయి

మిగిలిన వారికి
శాంతిభద్రతల చీకట్లో
తలుపు సందుల్లోంచి
నక్షత్రాలు కాదు
ఒంటికన్ను రాక్షసుల్లా
శవాల్ని శవప్రాయుల్ని మోసే నీలిదీపాలు
అనుమానించే ఎర్రదీపాలు తిరుగుతూ కనిపిస్తాయి
మెరుస్తున్న బాయినెట్ల పహరా కనిపిస్తుంది
నిర్మానుష్యవీధుల్లో పోలీసు వాహనాల వెంట
మొరుగుతూ పరుగెత్తే కుక్కల అరుపులు
సాయుధ సైనిక కవాతులు వినిపిస్తాయి

అభయమిచ్చే ప్రభుత్వ చర్యల్లో
భయమొక్కటే బెదిరిపోయిన మనుషుల్ని ఏకంచేసే చీకటి
కర్ఫ్యూ సడలించిన వేళల్లో అవసరమొక్కటే
చెదిరిపోయిన మనుషుల్ని ఏకంచేసే వేకువ

బతికిపోయిన మనుషుల్ని
ఓటర్లుగా విడగొట్టడానికి

మళ్ళీ పార్టీలొస్తాయి
ఇక్కడ ప్రతిశవమూ సరుకే
ఎన్నికల మార్కెట్లో ఇవ్వాళ హర్యానాకావచ్చు
రేపు దేశమంతటా కావచ్చు
మతశవాలకు మంచి గిరాకి వున్నది

పోయినవాళ్ళకు పోగొట్టుకున్నవాళ్ళకు
ఎన్నికల వెలకట్టి
ఏలినవారయితే వాగ్దానాలు చేస్తారు
అదనుకై ఎదురు చూసేవాళ్ళయితే ఎగసన తోస్తారు

కులాలుగా మతాలుగా ఓటర్లుగా వేరుపడి
కలతలతో కలహాభయంతో
అనుమానంతో ద్వేషంతో
పాలకుల పావులుగా బతుకు లీడ్వాలి తప్ప
ప్రజల్ని ప్రజలుగా బతకనివ్వని
ప్రజాస్వామ్యం ఇది

మనిషి శ్రమనేకాదు
కులాన్ని మతాన్ని వయసును
సరుకుగా
కొల్లగొట్టుక తినే వ్యవస్థ ఇది

పరిస్థితి అదుపులో వుంచేతప్ప
ప్రశాంతంగా వుండని
"సంక్షేమ" రాజ్యం ఇది

★

కథ :

అడవిలో వెన్నెల

బి. ఎస్. రాములు

ఒకటి : రూపులమ్మ చేతుల్లో సూరీడు వోడిపోయాడు

[1985. అది మన్యం అడవి. అందులో ఒక గూడెం. ఆ గూడెం పేరు షోలాబు. అది కాకరపాడుకు దగ్గరలో వుంటుంది. కాకి మార్గాన విశాఖకీ రాజమండ్రికి దాదాపు సమాన దూరంలో వుంది షోలాబు. ఈ రెండు జిల్లాల అడవిని మన్యం అంటారు.]

ఆ అడవిలో వేసవి వెన్నెల గుంకి చాలాసేపయి పోయింది. ఆకాశం నిర్మలంగా వుంది. వెన్నెల వున్నంతసేపు మసగ్గావున్న చుక్కలు ఆ చీకటిలో మిలమిలా మెరుస్తున్నాయి. గూడెం నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. కొంచెం మసక మసగ్గా వుంది. ఎక్కన్నుంచో పెద్దపెట్టున కలకలం వినిపించింది. తల్లులు ఒక్కసారిగా భయంతో లేచి కూర్చున్నారు. పాలుతాగేపిల్లలు కెవ్వుమని ఏడుపందుకున్నారు.

గంపలోకి పిల్లి చొచ్చినట్టుగా కోళ్ళు బెదిరి కెక్కెర కెక్కెరమంటున్నాయి. మందమీద తోడేలు పడ్డట్టుగా మేకలు అరుస్తూ చంగలిస్తున్నాయి.

ఈ అల్లరికి ఒక్కపెట్టున పల్లెంతా లేచింది. గూడెం మీదికి పులి వచ్చినంత తొక్కిసలాటగా వుంది. అరుపులు, కేకలు, నిద్రమొహాలతోనే గుడిసెల్లోంచి బయటకు పరుగుదీశారు. పిల్లలు బెదిరిపోయి తల్లులకు కరుచుకుపోయారు. ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు. కొందరు భయంతో అడవికేసి పరుగుదీశారు.

ఒక్కసారిగా యిరుపక్కలా ఎవరో మీదపడ్డట్టయి గజ్జీన భయపడి లేచింది రూపులమ్మ. క్షణంలో నిద్రమత్తు దిగిపోయింది. కళ్ళు నులుముకుని చూసింది. పెద్దాడు అప్పడు ఒకవేపూ, చిన్నది బాలవ్వ ఒకవేపూ తల్లిని వాటేసుకుని బిక్కచచ్చిపోయి చూస్తున్నారు.

పక్కనున్న పెనిమిటి మంచంకేసి చూసింది రూపులమ్మ. పెనిమిటి

మల్లుదొరకి యిదేమీ పట్టినట్టులేదు. బుడ్డగోచి మినహా నగ్నంగా పక్కగోలుగా పడుకొన్నాడు. మగతలోనే మూలుగుతున్నాడు.

"లెగు, లెగు" అంటూ చెయ్యేసి పిలిచింది రూపులమ్మ. వెదురు సిల్లలు సిలిసే ఎండలోని కత్తిని పట్టుకున్నట్టుగా చెయ్యి చురుక్కుమంది. అతను ఉలకలేదు. పలకలేదు. జ్వరంతో నిద్రలోనే వణికిపోతున్నాడు. అతనీ లోకంలో లేడు.

భయంతో బిగుసుకు పోయింది రూపులమ్మ. అవతల అరుపులు, కేకలు. ఏం చేయాలో పాలుపోలేదు. పిల్లలు తల్లికేసీ, తండ్రికేసీ పిల్లి కూనల్లా బిక్కు బిక్కుగా చూస్తున్నారు.

రూపులమ్మ మనస్సు పరిపరి విధాల పోతోంది. కాకీ బట్టలు- కరుకు బూట్లు- లాఠీ తుపాకి మడమల్తో బాదడం - పార్వతి ఒక్కదాన్ని లాక్కుపోయి పదిహేనుమంది తోడేళ్ళలాగా చీకకు తినడం - రక్కడం - కొరకడం - అందరి ముందే బట్టలూడదీయడం- ముట్టుకోసం పెట్టుకున్న పాతగుడ్డ పీకేయడం - ఒకరి తర్వాత ఒకరు దాన్ని పాడుజేయడం - ఆ దెబ్బనించి గూడెం నెలదాకా కోలుకోక పోవడం- అన్నీ ఒక్కసారిగా కళ్ళముందు కదలాడాయి.

అవి గుర్తొచ్చి మరింత వణికిపోయింది రూపులమ్మ. భర్తని ఎంత పిలిచినా పలకడంలేదు. అలా వున్నవాణ్ణి ఎలా వదిలేయడం? వదిలేసి ఎక్కడికని ఉరకడం? ఉరికితే వెంటపడరని మాత్రం ఏముంది? తమకి రక్షణకి చోటంటూ ఏదైనా వుంటే అది ఈ గుడిసే, గూడెమే. దానిగతే యిలా వుంటే యింకెక్కడికని వురకడం? ఎక్కడైనా తమ బతుకంతా వాళ్ళ చేతుల్లో అగమాగమే.

చావు సమీపించిన దాన్లా అలాగే వుండిపోయింది రూపులమ్మ. అంతా అయిపోయింతర్వాత జరిగిందేమిటో ఎవరికీ అర్థం కాలేదు. వాళ్ళు భయపడ్డట్టుగా కాకీబట్టలు కరుకుబూట్లు కన్పించలేదు. ఏమీ లేకుండా మరి ఆ పల్లెంతా అలా ఎందుకు వులికిపడ్డట్టు?

ఈరోజు తెల్లవారుజామున రాజులబాబు గుడిసెలో తొర్ర అలికిడైంది. అటకమీంచి అడ్డాకుల కట్ట మంచంలో పడుకున్న అతని భార్య పార్వతిమీద

పడింది. ఆమె ఆనాటి షాక్‌నించి యింకా తేరుకోనేలేదు. భయంతో లేచి అరచి కేకలు పెట్టింది. నిమిషంలో ఈ అల్లకంతా జరిగింది.

ఈ సంగతంతా తెలిసేసరికి సూరీడు తూరుపు కొండమీద సగం సగం ముహంతో వెక్కిరింతగా యికిలించాడు. ఒకరినొకరు దెప్పుతున్నారు. నవ్వుకున్నారు.

రూపులమ్మ నీళ్ళకుండ తీసుకుని గెడ్డ (ఏరు)కేసి వడివడిగా నడిచింది. టకటకా బూట్ల చప్పుడు ఎక్కడినించో విన్పిస్తోంది. ఒంటరిగా నడుస్తుంటే మళ్ళీ పార్వతి మనస్సులో మెదిలి ఒళ్ళు జలదరిస్తోంది. చెట్టుచాటుకు తప్పుకుంది. ఆ శబ్దం వచ్చే వైపు చూసింది. సూరీని లేత కిరణాలు పచ్చటి చెట్లమీద దోబూచు లాడడం తప్ప ఏమీ కన్పించలేదు.

పొద్దున్నే మళ్ళీ వేట మొదలైందా ఏమి? గుండె చిక్కబట్టుకొని అడుగులో అడుగు వేసికొంటూ అటుకేసి నడిచింది. ఎవరివో పిల్లల నవ్వులు వినిపించాయి.

చెట్టు చాటునించి పొద చాటుకి నక్కింది. పొద చాటునించి కొంచెం ధైర్యంచేసి అటుకేసి చూసింది. బాలవ్వతోపాటు మరో యిద్దరు పిల్లలు ఎక్కడో దొరికిన పాత బూటుని గుండు రాయికేసి బాదుతున్నారు.

"అకులంకే బయ్యం పడ్డారు ఎడ్డి నాయాల్లు. అనలోల్లచ్చినా అల్లని యిట్లనే బండకేసి బాదకపోతే సూడు" ఓ కుర్రాడు బీరాలు పలుకుతూ నవ్వుతూ కసిగా బూటుని బాదుతున్నాడు. పిల్లలు కిలకిలా నవ్వారు. బాలవ్వ నవ్వు చూసి రూపులమ్మ మురిసిపోయింది. తల్లి పేగు ఆప్యాయతతో కదిలింది. మనస్సు కుదుట పడింది.

"హమ్మయ్య! పోలీసోల్లు కాదన్నమాట!"

వాళ్ళనేదో చిరుకోపంతో మందలించబోయింది. అంతలోనే ఏదో గుర్తొచ్చింది. తేలికపడిన మనస్సుతో గెడ్డకేసి తిరిగింది.

అప్పటికే చాలామంది స్నానాలై పోయినట్టున్నాయి. నలుగురైదుగురు

ఆడవాళ్ళు మాత్రం తీరిపారి స్నానం చేస్తున్నారు. పిల్లలు ఆ కొద్ది నీళ్ళధారలో అటూ యిటూ చేపలు పడ్తున్నవాళ్ళలా ఆడుకుంటున్నారు.

అలా చీరమీదే రూపులమ్మ నీళ్ల పోసుకుంది. ఒళ్ళంతా రుద్దుకుంది. ఎండకి నల్లబడ్డా బక్క పలచని శరీరం నునుపుదేరి మెఱుస్తోంది. పొడిచీర చుట్టుకుని కొంగు నడుముకు చుట్టుకుని కుండనిండా నీళ్ళతో బరువుగా మళ్ళీ పర్లైసేసి నడిచింది.

అప్పటికి పొయ్యిలోని కట్టెలు మండి పూరకున్నాయి. కొన్ని నిప్పులు మిగిలాయి. చోడి అంబలి యింకా తుక తుక మంటోంది. మూతతీసి కలిపి చూసి దింపింది. నీళ్ళకుండ పొయ్యిమీద పెట్టింది. రెండ్రోజుల క్రితం సంతలో తెచ్చు కున్న వంకాయల్ని తరుగుతూ కూర్చుంది. పెనిమిటికేసి చూసింది.

అంత పొద్దయినా అలాగే అయాసంగా ఒరిగాడు పల్లుదొర. ఎందుకో మూలుగుతున్నాడు. అకస్మాత్తుగా ఎండుచేపలు దాచిన ఉట్టిమీదికి దృష్టి మళ్ళింది.

ఎర్ర గండుచీమలు వెదురునార మందంగా ఉట్టికి ధారపడ్డాయి. గబ గబా ఉట్టి విడిచి వాకిట్లో దులిపింది. అప్పటికే ఎండుచేపలు సగం బుర్రలై పోయాయి. అయ్యో అంటూ మనస్సు విలవిల లాడింది. చేపలంటే ఎంతప్రేమో అంత నోటికి రాకుండా అయిపోయింది.

ప్చ్....!

ఒక చేపముక్క విరిచి నోట్లో వేసికొంది. చప్పరిస్తూ ఎవరేనా చూస్తు న్నారేమోనని అటు యిటు చూసింది. మరో రెండు గుటుక్కున నోట్లో వేసుకుంది ఉట్టిని వేరొక వాసానికి వేలాడదీసింది.

వంకాయలు తరిగి బియ్యం కడగడానికి తడకవద్ద కొచ్చింది. ఏదో జ్ఞప్తికి వచ్చినట్టుంది. ఏదో గొణుక్కుంది. కోపంగా అరిచింది.

"గుంటా! బేగి యిటురాయే!"

రూపులమ్మ గొంతు రాసిలక గొంతులా వుంటుంది. ఆ కోపంతోమైనా గొంతులా కీచుమంది. ఆ కేకతో పరుగు పరుగున వచ్చింది బాలవ్వ. వచ్చి దించిన అంబలి కుండకేసి ఆశగా చూస్తోంది.

"మీనాయిన్నను లేపు. ఉడుకునీల్లు వోసుకోమను!"

నీళ్ళకుండ దించి బియ్యం గిన్నె పొయ్యిమీద వుంచింది తల్లి. బాలవ్వకు ఆ మాట విన్పించినట్టులేదు. ఏదో వాసనొస్తున్న తల్లి నోటికేసే చూస్తోంది. చాపల పుట్టికేసి చూసింది. అది స్థలం మారడం గమనించింది.

"ఊఁ! ఊఁ!" గారాబం పోయింది కూతురు.

"ఊఁ! పట్టు." అని విరిచి వో చిన్న చేపముక్క చేతిలో పెట్టింది, తల్లి.

నీళ్ళకుండ తడికవద్దకు తీసుకపోయింది రూపులమ్మ. పెనిమిటి వస్తాడేమోనని అక్కడే నిలబడింది. కాని వస్తున్న అలికిడేమీలేదు. అక్కడినించే కేకవేసింది.

"కూడు పాడవుద్ది. బేగిరా, తావంబోత్త."

ఆ మాటకి చీమకుట్టినట్టయినాలేదు మగనికి, విసుగ్గా గొణుక్కుంటూ మగడి మంచం సమీపించింది. మల్లుదొర రెక్కపుచ్చుకుంది. ఆ ఒళ్ళంతా చలి జ్వరంతో సలసల కాగుతోంది.

"బేగిలే"

అంటూ తడికవేపు నడిపించింది రూపులమ్మ. రాయిమీద కూర్చోబెట్టి నీళ్ళుపోసి వళ్ళు రుద్దింది. కిందబెట్టిన కూడు జ్ఞాపకం వచ్చింది.

"గుంటా! కూడు సూడే. కుక్కగిన ముట్టగలదు."

మల్లుదొర ఒళ్ళు తుడుచుకుని బుడ్డగోచి కట్టుకున్నాడు. అప్పటికి ఒళ్ళు బరువు కొంచెం తగ్గినట్టుంది. మెల్లిగా నడిచి మంచంమీద కూర్చున్నాడు.

వంకాయపోపు వేస్తోంది రూపులమ్మ. ఆకలి అంటూ కొడుకు అప్పడు పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఉదయంనించి గొడ్లని మందవేసి అడవికి వెళ్ళడానికి సద్దికోసం వచ్చినట్టున్నాడు. కమ్మటి పోపు వాసనకి ముక్కు ఎగబీల్చాడువాడు.

అల్యూమినియం గిన్నెల్లో తలాయింత అంబలి పోసింది తల్లి. అంబలి లోకి అన్నం కావాలన్నట్టుగా కొడుకు అన్నంగిన్నెకేసి ఆశగా చూస్తూ తల్లి వేపు చూశాడు.

"అది యిప్పుడుగాదు. అప్పటికి, సద్దికి."

తల్లి కళ్లు పెద్దవిచేసి కొడుకుని మందలించింది.

ఉడుకుగంజి తాగాక పోయిన బలం వచ్చేసినట్టుంది మల్లుదొరకి. నోటి నిండా త్రేవ్‌మన్నాడు. మూలకున్న గొడ్డలి తీసుకుని పదును చూశాడు. ఫర్లేదు బాగానే వుందన్నట్టుగా తల వూపుకున్నాడు.

అప్పటికే ఎండ వూపందుకొంది.

అందరికన్నా ఆలస్యంగా తయారై పనికివెళ్తున్న పార్వతి "అత్తారేటి?" అంటూ గుడిసెలోకి తొంగి చూసింది. అక్కడే అగిన భార్యవి గమనించకుండా రాజులబాబు వడివడిగా ముందుకు నడుస్తున్నాడు. పెవిమిటి దూరం కావడం చూసి వెంట పరిగెత్తింది పార్వతి. "నే ఎల్తా. బేగిరా!" అని రూపులమ్మని కేకేసింది. మొన్నే సంతలో వేయించుకున్న పార్వతి గాజులు గల్లు గల్లు మంటున్నాయి.

ఉదయం జరిగిన గొడవవల్ల ఈరోజు పనికెళ్ళడం అందరికీ ఆలస్యమై పోయింది. అప్పటికి అందరూ వెళ్ళిపోయారు. పిల్లలు గుడిసెల ముందు ఆటల్లో పడ్డారు.

రూపులమ్మ తొందర పడుతోంది. ఉడికీ ఉడకని వంకాయ వేసేసి సద్ది కట్టేసింది. కొడుకు చేతికర్రని భుజంమీద వేలాడేసుకున్నాడు. దానికి సద్ది తగిలించు కుని హుషారుగా మందకేసి పరుగుదీశాడు.

స్నానం చేసిన మల్లుదొర వళ్ళు నల్లగా మెరుస్తోంది.

పాత తువ్వాలు తీసుకుని ఎడంభుజం మీదేసుకున్నాడు. గొడ్డల్ని కుడి భుజాన వేసికొని బయట నిలబడి అటూ యిటూ చూశాడు. పెద్ద వాళ్ళెవ్వరూ కన్పించలేదు.

"ఊఁ. పద" అన్నట్టుగా భార్యకేసి చూశాడు.

రూపులమ్మ సద్ది కట్టడం పూర్తియినట్టుంది. వంటగిన్నెల్ని వుట్టిలో పెడ్తోంది. నాకన్నం అన్నట్టుగా తల్లికేసి చూస్తోంది బాలవ్వ. తల్లి కసురుకుంది.

"ఇంటికాడే వుంటావుగద! జాంపొద్దెక్కాంతర్వాత తిందువులే."

మల్లుదొర తోవసాగాడు. చేతులు కడుక్కొని తన కత్తి గొడ్డలీ తీసుకుని ఆ వెనకే గబగబా నడిచింది రూపులమ్మ. పదడుగులు వేసిందో లేదో "గుంటా! యిల్లు జాగర్త" అంటూ వెనక్కి తిరిగి కేకేసింది.

మల్లుదొర కానెగడ్డిలో అటూ యిటూ తోవపాపుకుంటూ వడి వడిగా నడుస్తున్నాడు. ఆ వెనుకే గల్లు గల్లుమని రూపులమ్మ గాజుల సవ్వడి వినిపిస్తోంది.

ఆ కానెగడ్డి రెండు నిలువులఎత్తుదాకా పెరిగింది. ఆ గడ్డిలో వాళ్ళ అలికిడికి ఏదో సరసర పరిగెడుతోంది. తోవపాపుతున్నగడ్డి సర్రు సర్రుమని అదో రకమైన సవ్వడి చేస్తోంది. నడుస్తున్నంత వేగంగా రూపులమ్మ ఆలోచనలు సాగుతున్నాయి.

గాలి బాగా వీస్తున్నట్టుంది. గాలి వీచిన దిక్కల్లా గడ్డిసోలుపుగా వయ్యారంగా వంగిపోతోంది. సిరిమానులు జువుకు జువుకున ఉయ్యాల లూగుతున్నాయి. ఎక్కడో ఏదో జంతువు బాక్ బాక్మంటూ అరుస్తోంది.

అవన్నీ వాళ్ళకి అలవాటే. అందుకే వాటి గురించి ఆ అలికిడి గురించి రూపులమ్మ ఆలోచించడంలేదు. అలస్యం గూర్చి ఆలోచిస్తోంది. పొద్దున జరిగింది తలపుకొచ్చి నవ్వుకుంటోంది. ఉత్తపుణ్యానికి తాను ఎంత భయపడి పోయింది. తాను పుట్టి బుద్దెరిగిన్నుండి యింతగా ఎన్నడూ భయపడలేదు. పెనిమిటి జ్వరంతో మూలుగుతుండడమూ, ఆ పార్వతిని అగంఅగం చేసిన పైనమూ, పోలీసోల్లంటేనే భయంతో వెన్నుపూస వణకడమూ-అన్నీకలసి అంతపనిచేశాయి. ఈయనకి జ్వరం వల్ల బయల్దేరడం మరింత అలస్యమైపోయింది. ఈ వారం కూలి గిడుతుందోలేదో! మొన్న రెండుపూటలు పని చేస్తూ చేస్తూనే స్పృహ తప్పి పడిపోయాడు పెనిమిటి. అలా రెండుపూటల పనిపోయింది. ఈ పూట ఎలా వుంటాడో. ఆ జ్వరం ఏం చేస్తుందో తెలియదు. అన్నలు రాక చాలా రోజులై పోయింది. అన్నలొచ్చి మందులిచ్చే దాకా తమకి పల్లెలో మందులిచ్చే వాళ్ళెవరున్నారని? సూపర్వైజరు రెండు బిళ్ళలు యిచ్చాడు గాని తగ్గలేదు. ఈ జ్వరం మహచెడ్డ జ్వరం. ఇది ఎవరికీ లొంగదు. ఇది తన చెల్లితోపాటు ఎంత మందిని తీసుకు పోయిందో లెక్కలేదు. అన్నలొచ్చాక ఈ జ్వరం భయపడడం మొదలైంది.

అందుకే అన్నలు యిట్లా బిళ్ళలు యివ్వగానే అట్లా తగ్గిపోతుంది. అన్నలు ఎపుడొస్తారో ఏమో! అంతదాకా ఈయన ఎంత తిప్పలు పడుతున్నాడో పాపం.

దొంగలొద్ది యింకా కూతవేటు దూరంలో వుంది. ఆ కాస్త నడకకే అలసిపోయాడు మల్లుదొర. సిందుగు చెట్టు నీడకన్పడ్డంతో ఆయాసంతో ఒగుర్తుస్తూ అక్కడే నిలబడిపోయాడు.

ఆ వెనకే వస్తున్న రూపులమ్మ యింతలోఏమైందని ఆశ్చర్యపోయింది. అతను అందనంత పెద్ద పెద్ద అంగలేసేవాడు. అమడదూరం అవలీలగా నడిచే వాడు. ఇంకా సగం దూరమైనా చేరలేదు.

వాళ్ళు వెదురు నరకడానికి వెళ్ళేకూపు ఆమడదూరాన వుంటుంది. వాళ్ళ గూడెం దరిదాపుల్లో రెండు కూపులున్నాయి. కాని ఆ గూడెం వాళ్ళంతా ఈ ఆమడ దూరానికే నడిచి వెళ్ళి వస్తుంటారు. ఆ కూపు సూపర్‌వైజర్ కొంచెం మంచివాడు. అడగ్గానే వందైనా అడ్వాన్సుగా యిచ్చేస్తాడు. దూరం నించి వస్తున్నారని కూలికి తోడు తలా రోజుకొక రూపాయి ఎక్కువిస్తారుకూడా. ఆ రూపాయికోసం యిటు వాళ్ళు ఆటూ, అటువాళ్ళు యిటూ కూపుల్లోకి వెళ్తుంటారు. అంతదూరం వొద్దని జాలవ్వ పసిపిల్లగా వున్నపుడు శతపోరింది రూపులమ్మ. ససేమిరా అన్నాడు మల్లుదొర. ఇపుడు మల్లుదొర వంతయింది.

ఎండకు నొసటి నుండి కారుతున్న చెమటను చేత్తో విదిలించి నొసలు చిట్లించింది రూపులమ్మ. గాజుల సవ్వడికి ఉలిక్కిపడ్డ ఆ సిందుగు చెట్టు మీదిమైనా రివ్వున ఎగిరిపోయింది.

రూపులమ్మ భావాలేమీ గమనించదలుచుకోలేదు మల్లుదొర మళ్ళీ జ్వరం పోటెక్కుతున్నట్టుగా వుంది. చెయ్యి నడుంకిఆన్చి అక్కడే ఆగిపోయే వానిలాగా నిలబడి అటుకేసి చూశాడు.

ఆ మైనా ఆ ఎండ భరించలేనట్టుగా తెల్లమద్ది చెట్టుకేసి పరుగుదీసింది. తెల్లమద్ది మీదినుండి ఏదోపిట్ట ఎగిరి గానుగ చెట్టుకేసి పారిపోయింది.

ఆ వైపంతా మంచం నులక కోసం, గుడెసె కప్పుల కోసం కానె గడ్డి కోసేసారు. అంతా బయలు బయలైపోయింది. అక్కడికి తెల్లమద్ది బెరడు

(తోడుక్క) ఎండిపోయి రూపులమ్మ కంటె బొక్క (ఏముక) ల్లా పైకి తేలి కనిపిస్తోంది.

ఆ బెరడు ఎంత బావుంది! అటు చూడమన్నట్టుగా భార్యకేసి చూశాడు మల్లుదొర. ఎందుకు చూడమంటున్నాడో తెలుస్తూనేవుంది రూపులమ్మకి. ఆ బెరడు టీ పొడుంలా వాడుకోవచ్చుని ఆశ. కాని ఇప్పటికే ఆలశ్యమైంది.

"ఆ బెరడు టీ సేసుకుని తాగుతే జొరం తగ్గుద్దా? ఆ సూపరొయిజరు బాబుగోర్నె మల్లా అడిగయినా సీటి రాయిచ్చుకొమ్మంటె ఉహు అంటివి. సీటి తెత్తె అప్పుడు 'కాకరపాడె'ల్లి బిల్లలు కొనుక్కొచ్చే ఓడుగదా."

గాలికూడా వేడెక్కుతోంది. రివ్వున వీస్తొంది. ఆ తెల్లమద్ది పక్కనే వున్న ఉేకు చెట్టుమీంచి కొంజు పిట్ట రయ్యిన ఎగిరిపోయింది. తమకలా చెరో రెండు రెక్కలుంటే ఎంతబావుండు నను కొంది రూపులమ్మ. ఈ సరికి అక్కడ రెండు పొదలు నరికి కుప్పేసేవాళ్లు.

పాలకొడిసె చెట్టుమీంచి ఎగిరినేల వాలిన నెమలిలా వయ్యారంగా రెండడుగులు ముందుకేసింది రూపులమ్మ.

"అల్లిచ్చే పందుల్తోటి తగ్గుద్దేటి? డబ్బు దండగ....ప్చ్... ఆ అన్న లొత్తే ఎంతబావుండేది. ఆ అన్నలత్తే యిట్టే సనంలో తగ్గిపోద్దిజొరం. ఎపుడొత్తారో ఏటో. ఆకాశంకేసి అదోవిధంగా చూశాడు మల్లుదొర.

పని ఆలస్యమవుతుంది. ఆచెండెన్సు రిజిష్టరు మూసేత్తారేమోని తొందరగా వుంది రూపులమ్మకి కోపంగా అంది.

"ఈ సెట్టు సెక్కలై సిప్పయాద్దెల్లి సముద్రం సేరినాక అత్తారు. అల్లొచ్చేదాక యిల్లాగే పూరకుంటే ఈ పని ఎలా అవుద్దేటి?"

"అల గంటావేటే? అన్నలు అంత కనికరం లేనోల్లుకాదే. ఈ పాటికి నాను అల్ల కలలో కొచ్చే వుంతాను. రేపో మాపో అచ్చేత్తారు. నాకు నమ్మకం ఉందే."

"పొద్దెక్కిపోనాది, మత్తరు పోతాది, లెగు" - విసుగ్గా తల గోక్కొని గబగబా ముందుకు సాగింది రూపులమ్మ.

"మనం మాత్తరం మడుసులం కావేంటి ? అడు మూణ్ణోజులు తేలు కొట్టిందని యింట్లో తొంగోలేదా !"

ఆ మాటన్నా ఫలితం లేకపోయింది. అప్పటికే స్పీడందుకుంది రూపులమ్మ. ఉస్సూరంటూ అనుసరించాడు మల్లుదొర.

ఎండ మరింత దంచుతోంది.

అడవి చిక్కబడుతోంది. రూపులమ్మ ఆలోచనలు మరింత చిక్కబడుతున్నాయి. ఈ అన్నలొచ్చిన్నించి ఎన్ని కొత్త సంగతులు తెలిశాయి ! దాంతో పాటు కొత్త కష్టాలూ మొదలయ్యాయి. కూలి పెరిగిందన్న మాటేగాని కంటిమీద కునుకు లేకుండైపోయింది. ఎప్పుడు ఎవరొచ్చి తంతారో తెలియదు. తను ముందే పిరికిది. ఇంత ఎండకాలంలోనూ గుడిసెదాటి వాకిట్లో పడుకోదు. ఈయన చూడబోతే యిలా. పెద్దోడు ఎవతినన్న వేలుపట్టుకొని తీసుకొస్తే ఎంతబావుండు. వాడు తన వడుంకన్నా ఎత్తైతిగాడు. ఎంత చెప్పినా వానికి తోచదు. ఎవతినన్నా పెద్దదాన్ని తీసుకొస్తే తమతోపాటు అది కూడా బొంగు నరికితే ఎంత అసరా ! ప్చ్ !

అప్పుడికి పన్నెండేళ్ళుంటాయి. అప్పుడే రూపులమ్మకి ఎన్ని ఆశలో మొన్నటి సంతలో గాజులుకొని ఎవరికన్నా యియ్యారా అంటే వాడు బొంబాయి మిఠాయి కొనుక్కు తిన్నాడు. వాడికి ఎపుడు బుద్ధొస్తుందో. సంతంటే గుర్తొచ్చింది ఈసారి బట్వాడాతో మళ్ళీ బియ్యం కొనుక్కోవాలి. గుంటడికి అంగీ, నెక్కరు కుట్టించాలి. తానొక జత రోల్డుగోల్డు చెవి కమ్మలు కొనుక్కోవాలి. పెనిమిటికి మందులు కొనాలి. అన్నలొస్తే చేయడానికి యింట్లో టీ పొడి లేనేలేదు. వాళ్ల కోసమన్నా కొనుక్కరావాలి. అన్నలంటే గుర్తొచ్చింది. వాళ్ళెక్కడున్నారో. ఎలా వున్నారో పాపం. ఈ అన్నలు ఎంత మంచోల్లు. వీల్లు రావడం మొదలయ్యాక తమకు మందుల ఖర్చేలేకుండా పోయింది. అంతకుముందు సగం డబ్బు వాటికే ఖర్చయ్యేది, అన్నలు వచ్చాకే లాట్ల కూలీ డ్రాగింగ్‌కూలీ పెరిగింది. ఓసాలు నెలా ఓసాలు రెన్నెల్లు సమ్మెలు జేశారు తాము. పేపరు మిల్లోడు దిగిరాలేదు పోలీసుల్ని పంపాడు. గూడాలన్నీ బెగ్గంపాడు చేశారు వాళ్ళు. దాంతో వాడి లారీలు కాలి కూలాయి. అన్నల భయంతోనే యిపుడు సూపరువైజరు మర్యాదగా మాట్లాడు

తున్నాడు. ఫారెస్టోళ్లు కూడా వాళ్ళ దగ్గర పెట్టుకుంటున్నారు. అంతకుముందు అయిదెకరాల మెట్టకే రెండొందలు లాగేవాళ్ళు. మేకపుల్లరి అయిదు. కొత్త గుడిసెవేస్తే ఒకకోడి, యాభయి రూపాయలూ మెక్కేవాళ్ళు. అన్నీ తిని ఫారెస్టు కొట్టారని, ఫారెస్టు భూమి దున్నారని కేసుల్లో యిరికించేవాళ్లు, దండగలు పిండే వాళ్లు, అన్నలు రావడంతో ఎంత మారిపోయిందో.

ఆలోచనల్తోపాటు వేగంగా నడుస్తొంది రూపులమ్మ. వాళ్ళు దొంగలొద్ది దాటారు. చెమటలు కక్కుతున్నారు. తలలొంచి ఉప్పు చెమట కంట్లోకి కారుతోంది. అయినా అది తుడుచుకునే ఓపికలేదు. మల్లుదొర కళ్ళు మంటెత్తి పోతున్నాయి. గొడ్డలి బరువైనట్టయి భుజం మార్చుకున్నాడు. ఎండ దంచికొడుతోంది. కానె గడ్డికి అది వెన్నెలాగుందేమో, వేడిగాలే పిల్లగాలై కన్నెపిల్లలా వంగిపోతోంది. తలుపుచాటు నవ్వులా నవ్వడి చేస్తుంది.

ఎన్నడూలేంది అరిపాదాలు నొప్పెడుతున్నాయి మల్లుదొరకి.

అతనికి అంగి తొడుక్కోనడం ఏం తెలియదు. జీవితంలో చెప్పులు తొడిగి ఎరగడు. పగుళ్ళు బారినెర్రెలిచ్చి. దుమ్ము నిండిన మడిమలు సలుపుతున్నాయి. గడ్డి సూదుల్లా గుచ్చుకుంటున్న బాధ. కాలుదీసి కాలు వేయడానికి ప్రాణం విలవిలలాడుతోంది. వొళ్ళు సలసల కాగుతోంది. వేడి భరించరాకుండా వుంది.

కాని రూపులమ్మ వెనక్కి తిరిగిచూస్తే ఎక్కడ ఆగిపోతాడోనని భయం పట్టుకుంది. మరింత వేగంగా పెద్ద పెద్ద అంగలేస్తొంది. నెర్రెలిచ్చిన కర్ర చెక్కల్లావున్నాయి రూపులమ్మ కాళ్లు, ఆ కానెగడ్డి కోసుకుపోవడం మాటలిటుంచి ఆ అదురుకి కిచు కిచుమని అరుస్తొంది. అరవకః అని మట్టెలు మొట్టికాయలేస్తున్నాయి.

ఏదో గిరుకుపోయి నెత్తి గిరుకున్నాడు మల్లుదొర. తల వెంట్రుకలు వేడెక్కి పెనంలా తగిలాయి. కాళ్ళతో ఆసరా తగ్గిపోయింది. కూలబడదామని చూశాడు. రూపులమ్మ కేకవేసినా అందనంత ముందుకెళ్ళి పోయింది.

"దొంగముండ, యీపల నా పానం తీస్తోంది."

దూరం దగ్గరవుతున్నకొద్దీ ఆలోచనలు కట్టిపెట్టేసింది రూపులమ్మ.

వెళ్ళాల్సిన కూపుకేసే చెవి ఒగ్గి నడుస్తోంది. పర్రు పర్రున వెదురు బొంగులు విరిగిపడుతున్న శబ్దం నాగస్వరంలా విన్పిస్తోంది. లోవకిరువైపులా వున్న వెదురు పొదలు ఆ సంగీతానికి నాట్యంచేస్తూ ఊలలు వేస్తున్నాయి. అలసట తగ్గి రూపులమ్మలో ఉత్సాహం పుట్టుకొచ్చింది. దళంలోని అక్క నేర్పిన ఏదో పాట నాలిక మీద చప్పరిస్తూ తోవమలుపులు తిరుగుతోంది.

ఎండకి ఆయాసానికి తాళలేక మల్లుదొర పనసచెట్టు నీడన కూలబడి పోయాడు. బాగా దాహంగా వుంది. శరీరంలోంచి వేడి వేడి ఆవిర్లొస్తున్నాయి. తల గిర్రున తిరుగుతున్నట్టుగా వుంది. బాధగా మూలిగాడు. డొక్కనొప్పి లేచి కడుపు పట్టుకొని అటూ ఇటూ పొర్లాడు. అతని పక్కనేవున్న గువ్వలజంట భయంగా గువగునా కొండచీపురు పొదల్లోకి దూరిపోయింది. గుమ్మడి చెట్టుకింద వూసులాడుతున్న వుడుతల జంట చటుక్కున పనస చెట్టెక్కింది.

రూపులమ్మ వెనక్కి తిరిగి చూసింది. మల్లుదొర అలికిడేలేదు. మళ్ళీ విసుక్కుంది. ఈరోజు నడక మరీ యద్దెం అయిపోయింది. ఈరోజు బయల్దేరిన యాల్లకైనా సరిగ్గా నడిస్తే ఈపాటికి రెండు పొదలైనా తెగిపడేవి. ప్చ్! ముసులాడు సోయిదప్పి ఎక్కడైనా పడిపోలేదు గందా! ప్చ్! ఈ సీజనులోనే ఏ కొద్ది అయినా సంపాయించుకోవాలి. ఇంకొద్ది రోజులుపోతే వర్షాకాలం వచ్చేస్తుంది. ఈ ఎండకు మరణగాలం రాను. ఏం ఎండ, ప్చ్, వర్షాకాలం వస్తే ఇక మళ్ళీ తిండికి తిప్పలే. మూడు పూటలూ అంబలే తాగాలి. ఈసారి ఖర్చులన్నీపోగా రెండొంద లేనా కూడబెట్టుకోకపోతే యల్లా అప్పులకోసం ఉరకాల. యాభయి రూపాయలు! ముద్దకు ముద్ద! వాల్ల సావుగాను, ఎత్తుకుపోనారు, మల్లా ఏ నాటికి కూడాల అంత డబ్బు, ప్చ్!

ఆగకుండానే సిందుగులొద్దిలో ప్రవేశించింది రూపులమ్మ.

ఊడిగ కంపలోకి ఏదో పురుగు గబగబా వరిగెడుతోంది. తన అలికిడి వింటేనే అన్నిటికి అంత హడలు. కానీ ఈ సూవరొజరు గాడున్నాడే! అవి కల్లు కొట్నంలో బెట్ట. అలా సూత్తాడేటి. ఓనాడు పెయ్యంత నొప్పుల్తోటి ఏడుత్తన్న పార్వతిని చెయ్యిపట్టు కున్నాడు. ఈ సారి అలా జరగనీ, అన్నలకి చెప్పి వాన్ని తన్నించకపోతే తనేవతి. మొన్నటిసారి అయిదు రూపాలు తక్కొయిచ్చినాడు.

లెక్క తెలీదనుకున్నాడో దొంగనంజా కొడుకు. ఇప్పుడు అన్నలొచ్చాక అణిగారు గానీ ఇంతకు ముందు ఎంత సేసేవోరు అమ్మో. ఈ ల్లకి నిజంగా అన్నలే మిండలు. ఈపూట మస్తరెయ్యనంటే అన్నలొచ్చాక చెప్తానా! యింకేమైనా చేయిత్తానా! ఏటనుకుంటున్నాడో. మస్తరు ఏయకపోడం అది బాబు అక్కొటి? చేసినంతేగా వాడిచ్చే కూలి. మరి ఎందుకెయ్యడంటా మస్తరు. అప్పుడు ఎదగనీ. అదు తుపాకి పట్టడం నేర్చుకుంటాడుగా. అప్పుడు గందా పిల్ల సంగతి.

బొంగులు నరుకుతున్న శబ్దం రెండువైపులా మరీ దగ్గరగా వివి పిస్తోంది. నెత్తిమీద పడ్డ దుమ్ము దులుపుకుంటూ — ముహంమీది చెమటలు తుడుచుకుంటూ — బొడ్లో కత్తి తన ఒంటి వేడిలో కలసిపోయింది. వుందోలేదో సరి చూసుకుంది. గొడ్డలిని భుజం మార్చుకుంది.

రూపులమ్మ పనిచేసే ఏరియా దగ్గర పడింది. గబగబా కొండ ఎక్కుతోంది. ఎండిపోయిన - వరికి పడేసిన కంక చిన్న పొదల్ని దాటుకుంటూ ఎక్కుతోంది. కాళ్ళు ఆ పొదల్లో చీరుకుపోతున్నాయి. రాళ్ళు ఒరుసుకు పోతున్నాయి. అయినా అలవాటుగా కొండ ఎక్కుతోంది. చెవుల కిరువైపులా పొదరద్దినట్టుగా వుప్పుతేలి తెల్లగా మెరుస్తుంది రూపులమ్మ. నూనెలా జిడ్డుగా చెమటలు కారుతున్నాయి.

ఎడం పక్కన బొంగు నరుకుతున్న వాళ్ళకేసి చూసింది. అది పార్వతి వాళ్ళు పనిచేస్తున్న పొద. వాళ్ళు తమకన్నా పావుగంట ముందుగా బయల్దేరారో లేదో అంతే. అప్పుడే రెండుపొదల వెదురు నరికి కుప్పేశారు. పార్వతి కత్తితో వెదురు బొంగుల పిల్లలని (చిన్న పొరకల్ని) సిలపడం చేస్తోంది. రాజులబాబు రెండు దెబ్బలకో బొంగు పడగొట్టేస్తున్నాడు.

కొండపైదాకా ఎక్కివచ్చి వెనక్కి తిరిగి చూసింది రూపులమ్మ. మల్లుదొర కన్పించలేదు. వస్తుంటాడులే అని వడివడిగా ముకద్దం ఉన్న వేపు నడిచింది. మస్తరు వేయించుకొని తమ పని స్థలంవేపు తిరిగింది. ఇంకా మల్లుదొర జాడలేదు.

నిన్న మిగిలిపోయిన బొంగుల్ని సిలపడం మొదలెట్టింది.

మెల్లిగా చేరవచ్చాడు మల్లుదొర. అతని చూపుల్లో కోపం వుంది. ముండా - నాను చచ్చినా నీకు కనికరం వుండదే. నిన్ను డబ్బు పిశాచం పట్టుకున్నదే. గొడ్డలి కిందపడేసి ఆయాసంగా ఒగరుస్తూ కూర్చున్నాడు మల్లుదొర. తువ్వాలుతో ఒళ్ళంతా తుడుచుకున్నాడు.

రూపులమ్మ తక్కువ తినలేదు. తానూ అలాగే గుడ్లురిమి చూసింది. "ఊఁ పటు" అంటూ గొడ్డలి చేతికందించింది. ఉస్సురంటూ లేచాడు మల్లుదొర. రెండు దెబ్బల్లో కసిగా లొలి బొంగుని పడగొట్టాడు. రూపులమ్మ మెచ్చుకోలుగా నవ్వుతూ భర్తకేసి చూసింది. మల్లుదొరలో కొంచెం వుత్సాహం తొంగి చూసింది.

చలి జ్వరానికి మల్లుదొర వొంట్లో వుంటంవల్ల ఏమీ సుఖంలేదు. మనిషిని తిప్పలు పెడదామనుకుని వచ్చిన జ్వరం తానే తిప్పలు పడుతోంది. ఇంకెంత తిప్పలు పడాలో అ భయంతో జ్వరం పారిపోయినట్టుంది.

వెదురు విరుగుతున్న శబ్దాల్తో గాలి వేడిగా సంగీత సాధన చేస్తోంది.

మల్లుదొర బొంగుల్ని నరకడంలో లీనమైపోయాడు. ఒక్కొక్క వెదురు పొదకి ఆరేడు బొంగులు వెళ్తున్నాయి. పొదకి మూడు బొంగులు అట్టే పెడుతున్నాడు. అ మూడు బొంగులు మూడేళ్ళల్లో మళ్ళీ నిండు పొదగా గుబురు కొస్తుంది.

రూపులమ్మ బొంగుల్ని కత్తితో సిలపడం చేస్తుంది. అయిదడుగుల సైజుకి కట్ చేస్తుంది. ఒక్కో బొంగులో రెండు సైజులు వెళ్తున్నాయి. మిగిలిన పై సన్నని కొనముక్కని అలాగే పారవేస్తుంది. అది లాటుల్లో వేయడానికి ఒప్పుకోరు. వెదురునార చీరి ఎనిమిది తొమ్మిది బొంగులకొక కట్ట కడుతోంది. మూడు రోజుల్నించి చేస్తున్నపని ఈ రోజుకి ఒక 'లాటు' కావాలని రూపులమ్మ తపన. లాటంటే అయిదు సి. యం. టి. అంటే భూమి నుండి రెండున్నర అడుగుల ఎత్తు అయిదు అడుగుల పొడువు, మూడడుగుల వెడల్పు.

లాటు పాసైతే గానీ డబ్బు చేతికి రాదు. 'పాస్' అంటే వెరిఫై చేసి సర్టిఫై చేయడం. ఈ రోజుకి లాటు పాసవుతుంది. ఫర్లేదు. బొంగులు కొట్టిన

కాడికి సరిపోతాయి అని నమ్మకంగా ఊపిరి పీల్చింది రూపులమ్మ. అప్పుడు మగనికి ఆకలు గురించి గుర్తు చేసింది సద్ది విప్పింది.

మల్లుదొర ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ప్రాణం సొలుగుతోంది, కడుపు లోతుకుపోయింది. అది దమ్ముతో వేగంగా కొట్టుకుంటోంది. అలసటగా అలా నీడలో ఒరిగాడు. వెన్నుకు ఏదో పొరక కుచ్చుకుంది. అయినా మళ్ళీ లేచే ఓపికలేదు. అలాగే వుండిపోయాడు. కొంచెంసేపు రెస్టు తీసుకున్నాడు. ఆనకతిని అలా చుట్ట ముట్టించాడు. అంతేలే రూపులమ్మ కేక వేసింది.

"కొండకిందకి బొంగులు డ్రాగింగ్ సేద్దాం. రావేమి ?"

విసుక్కున్నాడు మల్లుదొర. దొంగనంజ నన్ను చూసి ఓర్వదు. ఇలా ఒరిగానోలేదో పిలుపు. ఎట్టకేలకు లేవక తప్పలేదు.

బొంగు కట్టలు ఆ కొండమీంచి కిందకు ఈడ్వాలి. రెండొందల గజాల దూరం ఈడ్వాలి, అక్కడ ఆ కొండ కింద లాటు పేర్చాలి గబగబా పైకి కిందకీ నడిచింది రూపులమ్మ. లాటు పేర్చారు, లాటుకి యింకో రెండు కట్టలు తక్కువై నాయి. మళ్ళీ మగన్ని లేవదీసింది, ఆ ఆత్రం చూసి సూపర్‌వైజర్ నవ్వాడు.

"ఈ రోజుకి లాటు సేసేద్దామనేటి?"

"ఈ జొరం రాకపోతే నిన్నటికే అయ్యేదండి బోబుగోరూ"

"చెయ్యండి, చెయ్యండి!"

అక్కడున్న లాట్లని కొలుస్తున్నాడు సూపర్‌వైజర్. ఎవరి వర్కు వాళ్ళకి నోటు చేస్తున్నాడు, పాసింగ్ చేయడం పూర్తయ్యాక పార్వతి ముహంలో సంతోషం విప్పారింది. సూపర్‌వైజర్ ముహం అటు తిప్పుకున్నాడు. ఆమెని చూసినపుడల్లా తనకు జరిగిన అవమానం గుర్తొస్తుందతనికి. మరో లాటు కొలతలు తీస్తున్నాడు. ముకద్దం (గుమాస్తా) అతనికి సాయం చేస్తున్నాడు. ముకద్దం ఏది ఎవరి లాటో వివరం చెప్తున్నాడు. బాగా పొద్దుపోయింది. ఎట్టకేలకు రూపులమ్మ కూడా తమ లాటు 'పాసింగ్' చేయించుకుంది. అప్పటికి అందరు యింటికేసి ముఖం పట్టారు.

కొంతదిగాక మల్లుదొర పూర్తిగా అలసిపోయాడు. ఒళ్ళంతా శవంలా బిరుసెక్కింది. పని చేస్తున్నంతసేపు భయపడ్డట్టు నటించిన జ్వరం మళ్ళీ తన ప్రతాపం ప్రదర్శిస్తుంది, కాళ్ళు చేతులు వణుకుతున్నాయి. చెట్టునీడకు కూలబడి పోయాడు.

ఎపుడేం మాట్లాడాలో రూపులమ్మకు బాగా తెలుసులావుంది. చిలిపిగా కళ్ళతో వెక్కిరించింది. నల్లగా సొగసుగా నవ్వింది.

"అన్నలొచ్చేత్తారన్నావు. అలా తొంగొని పోయేవేటి?"

రూపులమ్మ హుషారివ్వడంతో ఈరోజు అన్నలు ఎలాగైనా వస్తారని నమ్మకం కుదిరింది మల్లుదొరకి. తొందరగా ఇల్లు చేరాలి. ఇప్పటికే అందరు చాలా ముందెళ్ళిపోయారు. ఒంటరిగా వెళ్ళడం అంటే తనకూ భయమే. కడుపు నొప్పికి మందుగా తువ్వాలని కడుపుకి బిగదీసికట్టుకుని గొడ్డలి తీసుకుని లేచాడు.

అదేపనిగా అరిచే పక్షులరొద అపుడపుడే మందగిస్తోంది. ఈ సమయం కోసమే ఎదిరి చూస్తున్న ఎలుగుబంట్లు, అడవి పందులు ఏటికేసి సాగుతున్నాయి, రూపులమ్మతో నేనెక్కడ పోటీ పడగలనని సూరీడు పంతం మానేసాడు. ఓడి పోయిన ముఖంతో చల్లగా కొంత వెనక్కి జారుకుంటున్నాడు. చెట్ల చీకటిక్రై నీడలు ముసురుతున్నాయి. చిరుతగండు వేటకు బయల్దేరి నట్టుంది. పిల్ల జంతువులు పరిగెడుతున్నాయి. ఎండిన ఆకులు పరపర పగులుతున్న ధ్వని వినిపిస్తోంది. ఏదో ఒంటరి మనుషుల వాసనవేసి ఆగిపోయింది చిరుత. ఒక్కసారిగా ఆకుల పరపర ధ్వని ఆగిపోయింది. నెత్తిమీద ఏదో టపేమని పడింది. ఏదో కాయ రాలింది. గుర్రుమంది చిరుత. తమ దరిదాపుల్లోనే ఆ శబ్దం వినిపించి అలసటమరిచి భయంతో పరుగులాంటి నడకందుకుంది రూపులమ్మ.

రెండు : రూపులమ్మ చేతుల్లో చీకటి వోడిపోయింది

అలసి సొలసిన అడవి విశ్రాంతి తీసికొంటోంది. చిమ్మెట్లరొద హెచ్చింది. అడవిలో వెన్నెల ఆకుల సందుల్లోంచి పీలుచూసుకొని అడవంతా పరుచుకుంటోంది.

అప్పటికే అప్పడు ఇంటికి చేరవచ్చాడు. విల్లమ్ములతో ఆడుకొంటు న్నాడు. బాణంగురి తప్పడంలేదు. ప్రతిదీ ఎదురుగావున్న చెట్టుకి గుచ్చుకుంటోంది బాలవ్వ ఆనందంగా చప్పట్లు కొడుతోంది. తాను నేర్చుకొంటానని వాడి చేతిలోంచి లాక్కో బోతోంది, వాడివ్వడంలేదు.

అలసిపోయిన మల్లుదొర మంచంలో ఒరిగాడు. గెడ్డకెళ్ళి నీళ్లు తెచ్చింది రూపులమ్మ. నీళ్ళు పొయ్యిమీదపెట్టి ఊఫ్ ఊఫ్మని ఊదుతోంది. అంతలో బాణంలా దూసుకొచ్చింది బాలవ్వ. అన్నలొచ్చారంది. అంత అలసటా జ్వరం ఎటుపోయిందో మల్లుదొర మంచంలోంచి ఒక్క ఉదుటున లేచాడు.

"ఒక్కసనం. ఉడుకునీల్లు తానంబోత్త" ఆప్యాయంగా అంది రూపు లమ్మ. కాని ఆమాట తనవద్దే మిగిలిపోయింది. అప్పటికే మల్లుదొర బయటకు వెళ్ళిపోయాడు. వెచ్చ వెచ్చగా వేన్నీళ్ళతో తానే స్నానం చేసింది రూపులమ్మ. ఒళ్ళంతా చెమటలుపట్టి ఉప్పుదేలింది. బాగా చేత్తో రుద్దుకొంది. పొద్దున ఉతికిన చీర చుట్టుకుంది. ఈలోగా వుడికిన అంబలి దించి అన్నలున్న ఇంటికేసి నడిచింది.

అప్పటికి వాళ్ళొచ్చి చాలాసేపే అయింది. ఎవరో టీ చేసి యిచ్చినట్టు న్నారు. మంచంమీద కూర్చున్న అన్నలు మధ్య మధ్య మాట్లాడుతూ టీ తాగు తున్నారు. వాళ్ళకి పిడికిలి బిగించి సెల్యూట్ చేసింది రూపులమ్మ.

"బాగుంతిరా అన్నా?" అని పలకరించి పార్వతి పక్కన కూర్చుంది.

"బాగున్నారా అక్కా! ఏం విశేషాలు?" ప్రసన్నంగా పలకరించాడు సుధాకర్. అప్పటికే పెనిమిటి అన్నీ చెప్పే వుంటాడులే అన్నట్టు భర్తని చూసి నవ్వింది రూపులమ్మ.

"పోలీసులు మళ్ళీ వచ్చి ఏమైనా అల్లరి చేశారా? ఎవరైనా పట్టు కెళ్ళారా?" అందరికేసి కలయజూస్తూ అడిగాడు సుధాకర్.

అన్నలు యింతకు క్రితం వచ్చి వెళ్ళిన్నుంచి జరిగిన విశేషాలన్నీ వివరించాడు రాజులబాబు. ఇవి మర్చిపోయావంటూ పార్వతి కొన్ని అందించింది.

"నా కోడి ఎత్తుకెల్లింది సెప్పలే" గుర్తుచేసింది రూపులమ్మ.

ఈ రోజు ఉదయం జరిగింది చెప్పుకొని అందరు మరోసారి ఫెడీ

ఫెడీన నవ్వుతున్నారు. ఆ విశేషాలన్నీ అయిపోయాక అందరికేసి కలయ చూశాడు సుధాకర్. ఎన్నో విషయాలు చెప్పుకొచ్చాడు.

“మనలాగే అక్కడ బస్తర్లో-అటు గఢ్చిరోలి, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలో మనవాళ్ళు పేదోళ్ళ రాజ్యంకోసం పోరాడుతున్నారు, ఎనిమిదేండ్లుగా పోరాడుతున్నారు. ఇక్కడి లాగే అక్కడకూడా పోలీసులు తిరుగుతున్నారు, కొడుతున్నారు, పట్టుకపోతున్నారు, ఆడవాళ్ళను అగమాగం చేస్తున్నారు, యిల్లు పీకేస్తున్నారు, మనుషులను చంపేస్తున్నారు. అయినా ఈ యేడు ఎండాకాలంలో తునికాకు కూలీ పెంచుకోవడానికి సమ్మెలు జేశారు. పోలీసోల్లు అన్నల రానిస్తే మీ గతి యింతే అని యింకా రోజురోజుకు ఎక్కువ జేస్తున్నారు.

అంతా నిశ్శబ్దం. మరైతే అన్నలు రాకుంటే ఎలా? అన్నలు ఎక్కడికి పోతారు? తమ మంచిచెడ్డ చూసే దిక్కెవరు? వంటి ఎన్నో ప్రశ్నలు వాళ్ళని చుట్టుముట్టాయి, రూపులమ్మ ఆ వూహే భరించలేకపోతోంది, ఉదయం అన్నలనో సారి తిట్టింది అన్నలకు తెల్సిపోయిందో ఏమో? ఔను. అన్నలకు అన్నీ తెలుస్తాయి. పశ్చాత్తాపంతో, బాధతో కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఏంమాటాడాలో తోచక పార్వతి బేలగా చూస్తోంది. అందరి స్థితి అలాగేవుంది. ఎవరినోటా మాట పెకలలేదు. ఒకరిద్దరు చుట్టలు ముట్టించారు.

ఎవరో పాలుతాగుతున్న పిల్లవాడు తల్లి రొమ్ము కొరికినట్టుంది. ఆ తల్లి వాడి వీపుమీద ఒక్క చరుపు చరిచింది. పిల్లవాడు ఏడుపందుకున్నాడు. తల్లి యింకో రొమ్ము నోట్లోకుక్కింది, ఏడ్పు ఆగిపోయింది. అప్పుడు అన్నల తుపాకి నిమిరిచూస్తున్నాడు.

అన్నల్లో మల్లిబాబువచ్చి ఆ పిల్లవాన్ని తీసుకున్నాడు. ఎత్తుకుని ముద్దాడాడు, కితకితలు పెట్టాడు, పిల్లవాడు నడుంకున్న తూటాల ‘పోచీ’ కావాలన్నాడు.

సుధాకర్ మల్లిబాబుని పిలిచి సెంట్రీకి మారమన్నాడు. మల్లిబాబు ఆ పిల్లవాన్ని వెంకటరమణ కిచ్చాడు. పిల్లవాడు రమణ అంగి జేబుల్లో చేతులు పెట్టాడు.

ముసలితాత సుట్టను నిప్పువేవు నోట్లో పెట్టుకున్నాడు. తాపీగా పొగ

పిలుస్తున్నాడు. సుధాకర్ చిరునవ్వు నవ్వాడు. లేచి చట్టితీసి నిప్పు బయటకు పెట్టి తాగుమన్నాడు.

"మరి అన్నలు లేకుంటే మల్లి ఫారెస్టోల్లు, సావుకార్లు సంకపు తినరా?"

"అన్నలు మనవెంట వున్నరుగనుకే కూలి పెంచింది ప్రభుత్వం. అన్నలులేక ముందు పెంచిందా? మరి అన్నలు రాకపోతే పెంచింది యిత్తరా? అదికూడ యియ్యరు. అన్నలే తమ బలం అని తెలుసుకున్నారు. ఈసారికి గిరిజనులు ఇంటికి కొంత వసూలుచేసి యిస్తున్నారు అన్నలకు."

"ఎందుకేటి?" ఆశ్చర్యంగా అడిగింది రూపులమ్మ.

"ఎందుకంటావేటి? అన్నలు మనకి మందులియ్యాలా? అటికి డబ్బు కావాలా? అల్లకి మందుగుండుకావాలా? మరి తుపాకులు లేకపోతే పోలీసోల్లు అన్నల బతకనిత్తారా?" అన్నాడు రాజులబాబు.

మందుల పేరు వినగానే మల్లుదొర "ఔను కావాలి కావాలి. ఇపుదు నాను మందుల్లేక ఎలా అయినానో సూడు" అన్నాడు రూపులమ్మకేసి, అన్నలకేసి చూస్తూ కొన్ని టాబ్లెట్లిచ్చాడు సూర్యారావు.

"ఇంతకూ అల్లు అన్నల గురించి ఏటన్నారేటి?"

"మేం ఏమైనాసరే అన్నల విడువం అన్నారు." అన్నాడు సుధాకర్.

"అల-అలా గుండాలె సంగం అంటె." ముసలితాత మెచ్చుకొన్నాడు. అలా అదీయిదీ చర్చ నడిచింది. అంతలో బుట్టతో అన్నిళ్ళు తిరిగి అన్నం వసూలుచేశాడు రాజులబాబు. అప్పుడు కూర, చారు గంజిగిన్నెల్ని రాజులబాబు వెంట పట్టుకుని తిరిగాడు. గిన్నెలన్నీ నిండిపోయాయి.

"ఎపుడు తిన్నారో. ఏమో, బేగి తినండి." అంటూ చర్చ ఆపుతూ ఆప్యాయంగా అవి ముందుంచారు గిరిజనులు. సుధాకర్ ముందు గంజిగిన్నె తీసుకున్నాడు. అన్ని రకాల గంజి కలిసి భలే రుచిగా వుంది. కొంత తాగి వెంకట రమణకిచ్చాడు. రమణ కొంత తాగి సూర్యారావు కిచ్చాడు. సూర్యారావు కొంత తాగి తన పక్కనున్న సత్యంకిచ్చాడు.

మొత్తం అన్నం తినేసరికి భుక్తాయాసంగా వుంది. సత్యం చెవిలో సుధాకర్ ఏదో చెప్పాడు. సత్యంతోపాటు మల్లిబాబు అందరితో సెలవు తీసికొన్నాడు ఆ యిద్దరు అడవికేసి నడిచారు.

దళంలో ఆరోజు ముగ్గురే మిగిలిపోయారు అక్కడ. మామూలుగానైతే తొమ్మిది పదిమంది వుండే దళం అది. సాధారణంగా గూడేల్లో రాత్రుళ్ళు పడుకోవడం మానేసి చాలాకాలమైంది. మరీ ముగ్గురే. అయినా సుధాకర్ అడవిలోకి వెళ్ళడానికే మొగ్గు చూపాడు. సూర్యారావు అనుమానం వెలిబుచ్చాడు. "అంత మంచిది కాదేమో. అడవి జంతువులొచ్చినా, ఆ వెధవలొచ్చినా చాలా కష్టం"

"అయితే ఏం చేద్దామంటావు?"

"ఇక్కడే లొంగొండి. మేం సెంట్రీసేత్తాం. ఎవుడత్తాడో సూత్తాం" ధైర్యంగా అన్నాడు రాజులబాబు. రూపులమ్మ మళ్ళీ ఉదయపు ముచ్చట గుర్తు చేసింది. అందరూ మరోసారి నవ్వుతున్నారు. ఈసారి సీరియస్‌గా ముహంపెట్టి అన్నాడు రాజులబాబు. అవునా అన్నట్టు మల్లుదొరకేసి చూశాడు టాబ్లెట్లు వేసు కున్న ధైర్యంతో సంతోషంగా తల ఎగరేశాడు.

"నానూ సేత్తానే"

అప్పడు కూడా ముందు కొచ్చాడు. అలా అయిదారుగురు ఉండిపోయారు. రాత్రి బాగా కావడంతో అందరు యిళ్ళల్లోకి వెళ్ళిపోయారు.

రూపులమ్మ బాలవ్వని పక్కలో వేసుకొని పడుకొంది. పొద్దంతా పని చేసిన అలసటతో వొళ్ళంతా నొప్పులుగావుంది. ఈరోజు దాదాపు యిద్దరు చేసేంత పని చేసింది.

అటూ యిటూ పొర్లింది. లేచి ఉట్టిమించి ఓ ఎండుచాప తీసుకుంది. దీపం ఆర్పేసి మంచంలో ఒరిగింది.

తిరిగి తిరిగి వచ్చిన సుధాకర్‌కి వొళ్ళంతా నలతగా వుంది. ఇటీవల తిరగబెట్టిన ఆరోగ్యం యింకా కుదుట పడలేదు. మంచంలోంచి లేచి కూర్చుండిపోయాడు. అటూ యిటూ చూశాడు.

గూడెం నిశ్శబ్దంగా వుంది. ఆడివంతా అలజడి తగ్గి భయ గంభీరంగా

వుంది. ఏదో కుక్క యింకా రోకాడిస్తోంది. ఎక్కడివాళ్ళక్కడ గాఢ నిద్రలో మునిగిపోయారు. ఆయుధం సరిచూసుకున్నాడు సుధాకర్, అది పొజిషన్‌లోనే వుంది. అడవి, అడవిలో పల్లె, ఆ పల్లెలో తానొక్కడే సెంట్రీ. సుధాకర్ మనస్సులో కొన్ని గమ్మత్తయిన వూహలు చెలరేగాయి. ఆ పల్లె విముక్తి ప్రాంత మైనట్టూ దానికి తాను కమాండరై సెంట్రీ చేస్తున్నట్టూ....ఇలా యింకెన్నో.

ఏదో చప్పుడైంది. పెద్ద బావురుపిల్లి ఒకటి పరిగెత్తింది. రోకాడిస్తున్న కుక్క దాన్ని వెంటాడింది. కోళ్ళ సంగతి దేముడెఱుగు, ముందు ప్రాణం అనుకొంది అది, అడవిలోకి చెంగున గెంతి మాయమైంది.

లేచి నిటారుగా నిలబడ్డాడు సుధాకర్. సెంట్రి చేస్తానన్న మల్లుదొరకేసి చూశాడు, అతను గుర్రు కొడుతున్నాడు. సూర్యారావు అతనికి ఒళ్ళునొప్పులకు కూడా టాబ్లెట్లు యిచ్చినట్లున్నాడు, దాంతో జ్వరం తగ్గి హాయిగా నిద్రపోతున్నాడు సెంట్రీ చేస్తానని ఉబలాటపడ్డ అప్పుడు మట్టిలో కూర్చుని మంచం కోడుకు తల ఆన్చాడు. అలసటగా అలాగే కునుకు తీస్తున్నాడు. రాజులబాబు నిద్రలో యుద్ధం చేస్తున్నాడు.

ఇంటి వెనక చెట్టుమీద ఏవో పిట్టలు కొట్లాడుకుంటున్నట్టున్నాయి, కిచ కిచ మని వినిపిస్తోంది. ఎండిన ఆకుల్లోంచి ఏదో పాకుతూ వెళ్తోంది. స్....స్.... మని శబ్దం వినిపిస్తోంది. ఇందాక పరిగెత్తిన కుక్క తడిక వద్ద నున్న కుండలోని నీళ్ళని గటుకుతున్న శబ్దం వినిపిస్తోంది.

గాలి వీస్తుంది, చెట్లు ఊగుతున్నాయి. హొయిమని విన్పిస్తుంది. ఆకులు గల గల రాలుతున్నాయి. గాలికి కొట్టుకొచ్చిన ఓ ఆకు రాజులబాబు మొహం మీద పడింది, ఉలిక్కిపడి లేచాడు, ఎదురుగా సుధాకర్. సెంట్రీ చేస్తానన్న అందరికేసి చూశాడు రాజులబాబు. అందరూ గుర్రు కొడుతున్నారు. కళ్ళు నులుము కొని ఆకాశంకేసి చూశాడు రాజులబాబు. అపుడే స్నానంచేసి అలసటగా నిద్ర పోతున్న పార్వతి శరీరంలా నిర్మలంగా నిశ్శబ్దంగా వుంది. చుక్కలు పార్వతి కళ్ళలా మెరుస్తున్నాయి.

"సానా రాత్రయిపోనాది, లొంగో అన్నా. మేం సెంట్రీ సేత్తాంగా".

సుధాకర్ కళ్ళు మూతలు పడుతున్నాయి. మూడు రోజుల్నించి నిద్ర లేదు. పోలీసులు వెంటపడ్డంతో శివరాత్రి జాగరణై పోయింది. రాజులబాబు మాట సుధాకర్ వొంటికి పిల్లగాలిగా చల్లగా తగిలింది.

అయినా రెండడుగులు అటూ యిటూ పచార్లు చేశాడు. కాళ్ళు కదలనంటున్నాయి. కళ్లు చూడనంటున్నాయి. అయిదు నిమిషాలు అలా ఒరిగితేనరి.... మళ్ళీ బలం వొస్తుంది అనుకుని టైం చూసుకున్నాడు. మంచంలో ఒరిగాడు. అందు కోనమే ఎదిరి చూస్తున్నట్టుగా అర నిమిషంలో కన్నంటుకుంది.

కోళ్లు బెదిరిన అలికిడి చటుక్కున లేచింది రూపులమ్మ. దీపం ముట్టించింది. బావురుపిల్లి గోడచూరు సందులోంచి పారిపోయింది. బాపల ఉట్టి కోళ్ళ గంపమీద పడింది. కోళ్ళు కెక్కెరమంటున్నాయి. దాన్నితీసి యధాస్థానంలో ఉంచి బయటికి నడిచి తడకచాటుకు కూర్చుంది. లేచి తన మొగడు ఎంతబాగా సెంట్రీ చేస్తున్నాడో చూద్దామని అటుకేసి చూసింది. ఎక్కడివాళ్ళక్కడ హాయిగా నిద్రపోతున్నారు. వెన్నెల గుంకింది. అంతా చీకటిగావుంది.

మనసు ఏదో కీడు శంకించింది. ఏదైనా జరిగితే.... అన్న ఆలోచనతో ఒళ్ళు భయంతో గగుర్పొడించింది. ఎవరినేనా లేపుదామనుకుంది. భయంతో అడుగు ముందుకు పడలేదు. అసలు చీకటంటే ముందే భయం - అందుకు తోడు ఎక్కడి వాళ్ళక్కడ నిద్రపోతున్నారు. అటూ యిటూ పరకాయించి చూసింది. పల్లెవెనక పక్కన ఏదో శబ్దం విన్పిస్తోంది.... చెవులు రిక్కించింది.

సందేహంలేదు అది బూట్ల చప్పుడే .. అడుగులో అడుగు వేస్తున్నట్టున్నాయి. శబ్దం అగి అగి విన్పిస్తోంది. రూపులమ్మ గుండె వేగంగా కొట్టుకుంది. ఏం చేయాలో పాలుపోక అరక్షణం మెదడు మొద్దుబారి పోయింది.

ఏవో ఆకారాలు రాజులబాబు పడుకున్న గుడిసె చూరుపక్కన కదిలినట్టయ్యాయి

ఎట్లా వచ్చిందో ధైర్యం.... మగడు పడుకున్న మంచంకేసి నడిచింది.

"లేగి.... లేగి.... లెగు.... దొంగలు.... దొంగలు"

ఒక్క ఉదుటున లేచాడు మల్లుదొర.... లేచి రాజులబాబుని లేపాడు. రాజులబాబు సూర్యారావుని లేపాడు.

"యెయ్య్ యెప్" అన్న శబ్దంతోపాటు ఎవరో డొక్కలో పొడిచి నట్టయి ఉన్నఫళంగా నిద్రలేచి ఆయుధం పొజిషన్‌లో పట్టుకున్నాడు.

అరక్షణం ఆలస్యం అయితే ఎంతపని జరిగేది.

పల్లెలంతా అలజడిగా వుంది. కర్రల చప్పుడు, విల్లమ్ముల నాదం విన్పిస్తూంది. ఎవరో గొడ్డళ్ళ దెబ్బల్ని గాలికి విసురుతున్నారు.

"యెయ్.... యెయ్...." అన్న గొంతులు మూడు పక్కల్నించి విన్పిస్తున్నాయి.

పోలీసులు ఒకరౌండు పేల్చినట్టున్నారు, కంయ్యిమని శబ్దంచేస్తూ సుధాకర్ మెడ పక్కనించి గుళ్ళు దూసుకుపోయాయి,

"అన్నలు.... అన్నలు" ఆతృతగా అందరు అటూ యిటూ పరుగెడుతున్నారు. మంచాలు ఖాళీగా వున్నాయి. పోలీసులు పట్టుకున్నారా ? ఎక్కడ.... ఎటు వెళ్ళారు? ఆతృత.... ఒకటే ఆతృత....

సూర్యారావుకి, వెంకటరమణకి సైగ చేసి గుడిసె పక్క సందులోకి పాకాడు సుధాకర్. సుధాకర్‌ని అనుసరించారు వాళ్ళు.

ఇపుడు పోలీసులకీ, తమకీ గోడమూల చాటుగావుంది. ఎవడో పోలీసు ముందుకు కదిలినట్టయింది. వాళ్ళు పదిహేను యిరవై మంది దాకా వున్నట్టున్నారు.

డిఫెన్సు పొజిషను చూసుకొని ఒకరౌండు పేల్చినట్టున్నాడు సుధాకర్. 'ఢాం' అన్న పెద్ద ధ్వనితో పల్లెదిరి పోయింది.

పోలీసులు డిఫెన్సు పొజిషన్ కోసం వెనక్కి తగ్గినట్టున్నారు. కొందరు లేయింగ్‌లో వున్నట్టున్నారు. యెయ్ ... యెయ్.... అన్న అరుపులు మరింత ఎక్కువయ్యాయి.

గుడిసె చాటు నుండి వెనక్కి తప్పుకున్నట్టున్నారు ముగ్గురు.... అలా అయిదు గుడిసెలు చుట్టి పోలీసులు పల్లె చుట్టు ముట్టిన దారి వెంట వెనకకి వడిచి

చెట్టు చాటు నుండి పల్లెకేసి చూశాడు సూర్యారావు. సాభిప్రాయంగా సుధాకర్ కేసి తిరిగాడు.

అక్కణ్ణించి కనక కాల్చితే అయిదుగురు పోలీసులు తమ రేంజిలో కొస్తారు. అయినా వద్దని సైగ చేశాడు సుధాకర్. వాళ్ళని చంపడం ముఖ్యంకాదు. తాము తప్పు కోవడమే ముఖ్యం.

పోలీసులు రెండు రౌండ్లు అగుడిసెకేసి కాల్చినట్టున్నారు. "యెయ్.... యెయ్' అన్న అరుపులు మధ్య మధ్యలో 'అన్నలు - అన్నలు - ఎక్కడ' అన్న అరుపులు.

అక్కణ్ణించి కుడివేపు తిరిగారు. ఆ దాపు పొదపక్కనే యింకో టీం మాటు వేసినట్టుంది. ఏదో అలికిడయ్యింది.

వడి వడిగా నడిచారు ముగ్గురు.

తమ వెనక అంతకంతకు బూట్ల టకటకలు పెరుగుతున్నాయి. చింతల కొండకేసి తిరిగారు. ఈ పొదచాటునా ఆ పొదచాటునా నక్కుతూ వుండిపోయారు.

మళ్ళీ పోలీసులు రెండు రౌండ్లు కాల్చినట్టున్నారు. కంయ్యిమని అడవి మోత పెడ్తోంది. ఎక్కడో పడుకున్న జంతువులు అదర బాదరగా పరిగెడు తున్నట్టున్నాయి.

ఎడంపక్కనించి వాళ్లు వస్తున్న శబ్దం విన్పిస్తోంది. ఏదో లొద్దిలావుంది కుడిపక్కకి అడుగులు వేశారు. ఏదో శ్వాస విన్పిస్తోంది. అటుకేసి చూశారు. అయిదు గజాల దూరంలో ఎలుగుబంటు నల్లగా చీకటిలో కలిసిపోయి యిటుకేసే చూస్తోంది.

వడివడిగా తప్పుకున్నారు. అలా అలా అడవిలో కలసిపోయారు. బూట్ల శబ్దం దూరమై పోయింది.

అటూ యిటూ వెతికేవ పోలీసుల ఎదురుగా ఎలుగుబంటి. చకచకా తప్పుకుని ముందుకు సాగారు. ఏమీ కన్పించడంలేదు. ఏమీ విన్పించడంలేదు. చేతికి చిక్కినట్టే చిక్కి మాయమైపోయారు. అడవి సన్నాసి వెధవలకి ఎంత

ధైర్యం వచ్చింది... వాళ్ళని తప్పించేశారు.... ఎక్కడదాచారో.... వడివడిగా మళ్ళీ పల్లె వేపు నడిచారు.

అప్పటికీ కుక్కలు మొరుగుతూనే వున్నాయి. పల్లెఅంతా సందడిగా వుంది. అన్నలు తప్పుకున్నారో... పట్టుబడ్డారో సందిగ్ధంగా వుంది.

ఆకాశం నిర్మలంగా వుంది. వెన్నెల ఉన్నంతసేపు మసగ్గావున్న చుక్కలు ఆ చీకటిలో మిల మిలా మెరుస్తున్నాయి. ఆ గూడెంలో మళ్ళీ కలకలం లేచింది.

ఒక్క ఉదుటున యిరవై మంది పోలీసులు పల్లెమీద పడ్డారు. కసిగా బాదుతున్నారు. మళ్ళీ ఏం జరుగుతోందో అర్థం అయ్యేసరికి ఎక్కడివాళ్ళక్కడ దెబ్బలుతింటూ అరుస్తున్న కేకలతో పల్లె ప్రతిధ్వనిస్తోంది.

గుడిసెల్లో పడుకున్నవాళ్ళు ఎల్లమ్మలు ఎక్కుపెట్టారు. కర్రలు విసిరారు. ఎవడో పోలీసు- "సచ్చాన్రోబాబో" అని అరిచిన అరుపు విన్పించింది. అలాగే మళ్ళీ... మళ్ళీ విన్పించాయి.

ఇరుపక్షాలకీ సంకుల సమరం సాగుతున్నట్టుంది. అరుపులు కేకలతో అడవంతా ప్రతిధ్వనిస్తూంది.

ఎవరో కంక బద్దల్ని కాగడాలుగా అంటించినట్టున్నారు. అప్పటికి ఆ పల్లె యుద్ధ భూమిగా మారిపోయింది.

ఓడిపోయి చిక్కుబడ్డ యుద్ధ ఖైదీలుగా యిరవై మంది పోలీసుల్ని అరెస్టు చేశారు జనం. ఇరువై తుపాకులు కింద పడిఉన్నాయి.

పార్వతి కర్రతో ఒక్కొక్కడిని వాయగొడ్తోంది.

"మమల్ని ఎల్లా కొట్టారు.... టేషన్ తీసికెల్లి" కసిగా తిడ్తోంది. "తప్పయింది బాబా"

"ఊఁ" మమ్మల్ని మాతోనే కొట్టిస్తారు గదా... నువ్వు ఈడిని లెంప కాయెట్టు.... ఊఁ...." రూపులమ్మ వాళ్ళ బెల్టు ఊడబీకి దాంతోనే దంచుతోంది. ఒకడి నొకడు పోలీసు కొట్టుకోక తప్పిందికాదు.

రాజులబాబు వాళ్ళ బూట్లని విప్పేసి అందులో కాళ్ళు పెట్టుకొని "మమ్మల్ని ఇట్టాగేగా తన్నింది. ఊఁ...." అంటూ ఎగిరి ఎగిరి తన్నాడు.

ఆడవాళ్ళంతా పోలీసుల షర్టుల విప్పదీయించారు. "మమ్మల్ని యిలాగే గదా తొంగో బెట్టారు ఊఁ...." అంటూ బెల్టులతోనూ, చేతికి అందిన కర్రలతోనూ బాదుతున్నారు.

"ఇట్టాగే కదా నన్ను లెంపకాయెట్టింది" గాజులు ఫెళ్ళుమనేట్టు వెదురు వరికినంత కోపంగా చెంపపెట్టు వేసింది.

"అమ్మో.... ...."

"నమించు తల్లో...."

"నా గోపి పూడబీకి ఉరికిచ్చావు గందా!" మల్లుదొర పోలీసువాడి పిర్రలు వాయగొడ్తున్నాడు.

ఒక్కరేమిటి - ఆడవాళ్ళు, పిల్లలు అందరు తమని ఆంతకాలందాకా కొట్టిన దెబ్బలకి, చిత్రహింసలకి ప్రతీకారం తీర్చుకుంటున్నట్టున్నారు.

"మల్లోసారి మా ఊల్లో కొత్తారా...."

కొండ చీపురుతో ముహంమీద దంచింది రూపులమ్మ.

బస్కీలు తీయించారు. బూట్లని వాళ్ళ మీదకి విసిరుతున్నారు. ఎవరో వెదురు కర్రతో యమకసిగా బాదుతున్నారు.

అప్పుడు ఎగిరి ఎగిరి వాళ్ళ జుట్టు పట్టి పీకాడు.

"ఇట్టాగే గదా నా చెంప కొరికింది" ఎవరో స్త్రీ పోలీసువాడి చెంపల్ని గోళ్ళతో రక్కుతోంది.

ఎవరో కాండ్రకించి ముహంమీద ఉమ్మారు.

"మా అన్నల్ని సంపుతారా యింక".

"నాకు తెలియదు బాబో."

"నంజకొడుకు ఎట్లున్నడో సూడు పందినాగా. అన్నల్ని సట్టుకుందామని మల్లోసారి ఆత్తారా?"

"తప్పయింది బాబో. వామ్మో"

"మల్లెపుడైనా మా పల్లెవేపు వత్తారా ?"

"రాను.... రాను ... అమ్మో"

ఊరంతా పండుగ చేసికొంటున్నట్టు సంతోషంతో అరుపులతో నిండి పోయింది. కోళ్ళకి ఆ సంతోషం ఆగినట్టులేదు. గంపకిందనించే కొక్కొరో-కో అని కూస్తున్నాయి.

అడవిలోని పిట్టలు అదేదో వింత పండగని చూడ్డానికి ఆకాశంలో గిరి కీలు కొడుతున్నాయి. ఆ పూట వెముకలకి కొరతలేదని కుక్కలు అటూ యిటూ పరిగెడుతున్నాయి.

ఏదో వింతగా తూర్పు కొండమీంచి పొద్దు నిక్కి నిక్కి చూస్తోంది. ఇవి ఆ కాయ కష్టంచేసే చేతులేనా ? అమాయకులను కున్నానే. ఆశ్చర్యపోయాడు సూరీడు.

చెట్లకు కట్టేయబడ్డ యిరవైమంది పోలీసులు అలానే నిద్రలో జోగు తున్నారు. వాళ్ళ కాళ్ళ దగ్గరే తుపాకులు పడివున్నాయి. తప్పిపోయిన మరో పోలీసు దళం వెతుక్కుంటూ అక్కడికి చేరింది. ఆ కోలాహలం కనులారా చూశారు. వణికిపోయారు. రెండుచేతులు జోడించి దండం బెట్టారు. అక్కడక్కడ విసిరివేయబడ్డ బెల్టుల్ని, బూట్లనీ, డ్రస్సుల్నీ, రైఫిళ్ళనీ ఒక్కచోట కుప్పేశారు. ఎన్నివిధాల కోరితే అన్ని విధాల క్షమాపణ చెప్పారు. ముక్కు భూమికి రాశారు. అందరూ కలిసి తమ క్యాంపుకేసి పారిపోయారు.

రైఫిళ్ళు ఎత్తుకుపోయి దాచుకోనందుకు పోయిన ఉద్యోగం మళ్ళీ వచ్చినంత సంతోషంకూడా వాళ్ళల్లో వున్నట్టుంది.

మల్లుదొర గొడ్డలి పదును బెడుతున్నాడు. నిద్రాలేమి, నిస్సత్తువ ఎక్క డికో పారిపోయాయి. అప్పుడు మందపక్కనే విల్లమ్ము లాగి పోలీసుని కట్టేసిన ఓ చెట్టుకేసి వదులుతున్నాడు. బాలవ్వ ఉరికి ఉరికి దాన్ని ఊడబీకి మళ్ళీ అన్నకు అందిస్తోంది.

తన శక్తేమిటో మొదటిసారిగా తెల్సివచ్చింది రూపులమ్మకి. సంతోషంతో కాలు నిలువడంలేదు. తన కూతురు బాలవ్వలా ఎగరాలని వుంది. కాని పనికి వెళ్ళాలి. వేళవుతోంది. పొయ్యిమీది అంబలి కుండ దించింది.

ఉత్సాహంగా పార్వతిని కేకేస్తింది. ఇద్దరూ నిన్నకి, నేటికి తేడా తలపోస్తూ నవ్వుకుంటూ గెడ్డకేసి నీళ్ళకోసం సాగిపోయారు.

మాటల్లో రాబోయే పరిమాణాల గురించి భయంతో పార్వతి ఏదో అంది. రూపులమ్మ భయపడి అంతలోనే తేరుకుంది. కోపంతో ఈడ్చి ఒక్కటి చరిచింది. పార్వతి దిమ్మతిరిగిపోయింది.

ఇంకో గంటలో అయిదు వందలమంది పోలీసు పటాలం తమ మీదికి రాబోతోందని వారికి తెలియదు.

జేవురించిన ముఖాన్ని కూడదీసుకుని మళ్ళీ నవ్వింది పార్వతి. రూపులమ్మ శ్రుతికలిపింది. ఆ నవ్వుల్లో సంతోషమేకాదు. అమాయకత్వమూ వుంది. దాన్ని మించుతున్న కసీవుంది.

కథ యిక్కడితో అయిపోలేదు. ఇది ఇంతటితో ఆగేదికాదు. నిజమైన బతుకు పోరుకి యిది నిజమైన ప్రారంభం.

(రచనాకాలం : ఏప్రిల్ 1986)

(నిత్య నిర్బంధాల్ని వీరోచితంగా ప్రతిఘటిస్తున్న మన్యం గిరిజన అన్నలకు, అక్కలకు - వారి పోరాటాల్ని భాషని సజీవంగా పెట్టలేకపోయిన నా అశక్తతను క్షమించాలని కోరుతూ——)

★

'తులసిదళం' కాదు గంజాయి దమ్ము

అయిదున్నరేళ్ళ క్రితం రంగనాయకమ్మగారు వీరేంద్రనాథ్ "చేతబడి"ని బడితెతో బాదినట్టు విమర్శిస్తూ రాసిన వ్యాసాలను "ఆంధ్రప్రభ" దినపత్రిక ప్రచురించింది. వీరేంద్రనాథ్‌తోపాటు తననుకూడా ఆమె బాదిందని, అందువల్ల తన పరువు పోయిందని, ఆ నష్టంకట్టించమని ఆ "చేతబడి"ని బలపర్చిన ముందుమాట రచయిత డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు కోర్టుకెళ్ళాడు. అయితే ఎక్కువగా దెబ్బలుతిన్న చేతబడి రచయితమాత్రం కోర్టుకెళితే ఇంకా పరువుపోతుందనో లేక తనకు పరువుంటే కదా పోవడానికనో, ఎన్ని దెబ్బలు తింటేనేం నాలుగు డబ్బులు సంపాదించుకొన్నాక.... అనుకొనో కానీ అటువంటి టైం దండుగ పని చెయ్యలేదు.

మొత్తంమీద రంగనాయకమ్మగారి విమర్శకు సాహిత్యపరంగా బహిరంగ సమాధానం చెప్పుకోవలసిన బాధ్యత వుందని గ్రహించకుండా, అలా దులుపుకొని ఒకరు (దులుపుకోకుండానా?) కోర్టుకెళ్ళి ఒకరు తమ స్వభావాన్ని మరింత స్పష్టంగా చాటుకొన్నారు. రంగనాయకమ్మగారిపై కొమ్మూరి పెట్టిన పరువు నష్టంకేసు మేజిస్ట్రేట్, సెషన్స్ కోర్టులలో, హైకోర్టులో కూడా విచారణ జరిగి "నేరం" చేసినందుకు ఆమెపై విధించిన జరిమానా శిక్షను ధృవ పరచిన తర్వాత, అప్పటి వ్యాసాలతో సహా, కేసు విచారణ వివరాలున్న ఈ పుస్తకం కూడా పోయిన డిసెంబర్‌లోనే వెలువడింది.

రంగనాయకమ్మగారు మొదట విమర్శన వ్యాసాలను ప్రారంభించినప్పటినుంచీ, కేసు విచారణలో వున్న కాలంలో అప్పుడప్పుడూ సాహిత్య సంఘాలూ, స్వచ్ఛందసేవా సంస్థలూ, విడివిడిగా ఎందరో వ్యక్తులూ రంగనాయకమ్మగారిని సమర్థిస్తూ, వీరేంద్రనాథ్‌ను విమర్శిస్తూ, కొమ్మూరి కోర్టు కెళ్ళడాన్ని ఆక్షేపిస్తూ సభలూ నిర్వహించీ, కరపత్రాలూ వ్యాసాలూ వెలువరించీ వీలైనంత వరకూ ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తెస్తూనే వచ్చారు. ఇంత జరిగాక దీనిపై కొత్తగా సమీక్షించుకోవలసిన వేమున్నాయని పైపైన ఆలోచిస్తే అనిపిస్తుంది

కానీ, వ్యాసాలన్నిటినీ ఒక్కసారిగా చదివి, కోర్టు విచారణ సాక్ష్యాల తతంగాన్నీ గమనించి, వ్యాసాలు వెలువడిన నాటికీ ఇప్పటికీ యేమైనా మార్పు ఉందనుకొంటే దాన్ని కలుపుకొని ఆలోచిస్తే మాత్రం తప్పనిసరిగా ఆ అవసరం ఉందని అర్ధమవుతుంది. అలా నిర్లక్ష్యం వహించడం తప్పని, అది రంగనాయకమ్మగారికి, సమాజానికి అన్యాయం చేయడమేననీ తెలుస్తుంది.

విజయవాడలో "జ్యోతి" అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకోవడానికి "చేతబడి" రచయిత కారణమని పత్రికల ద్వారా తెలుసుకొన్న రంగనాయకమ్మగారు "తులసిదళం" నవలను చదివి, అందులోని దగుల్బాజీతనాన్ని బయట పెట్టేందుకు ఆ విమర్శన వ్యాసాలను రాశారు. సరిగ్గా ఆ నవలలో ఒక పాత్రకు రచయిత ఇచ్చిన సూచన ప్రభావం జ్యోతిమీద ఉందని ఆమె నిశితదృష్టి కనిపెట్టింది. మూఢనమ్మకాలకు "సైంటిఫిక్" రీజనింగ్ ఇచ్చినట్టు చెప్పడంలోని మోసం, పాత్రల స్వభావాన్ని (తద్వారా రచయిత స్వభావాన్ని), కథా వస్తువులో ఉన్న అసంబద్ధతను ఆమె చాలా కచ్చితంగా తేల్చి చెప్పారు. అసలు వీరేంద్రనాథ్‌కు రచయితకు ఉండవలసిన శిల్పజ్ఞానం కూడా లేదని స్పష్టం చేయడంద్వారా వీరేంద్రనాథ్ భావాలు అభివృద్ధికరమైనవి కాకపోయినా, అతని రచనలో చదివించే గుణం ఉందని, అదే పాఠకులను ఆకర్షిస్తున్నదనీ పరోక్షంగా సమర్థిస్తూ కొందరు చేసే దొంగవాదన కూడా దెబ్బతిన్నది.

తాను చెప్పదల్చుకొన్న విషయాలను నిర్మొహమాటంగా ఎటువంటి తటాపటాయింపులు లేకుండా చెప్పడం, భావావేశంతో ఆపని చేసినట్టుకాక, అందువల్ల ఎదురైన పరిణామాలకు భయపడక పోవడం.... పాఠకులపట్ల ఆమె నిర్వహిస్తున్న బాధ్యతను తెలియజేస్తాయేకానీ, కోర్టులో భావించినట్టూ అసూయనో, అహంకారాన్నో ప్రదర్శించవు. సమాజానికి తీవ్రమైన హాని కలిగించే భావాలను ప్రచారం చేయడంకంటే, ఆ దుర్మార్గానికి మందలింపుగా న్యాయమైన ఒక "తిట్టు" తిట్టడం (లేదా కొన్ని తిట్లే కానీ) నేరంగా కనిపించింది న్యాయస్థానాలకు. "తులసిదళం" నిషేధించవలసిన పుస్తకమంటూనే "ముందుమాట" రాసిన కొమ్మూరిని అనవసరంగా తిట్టింది కనుక ఆమెకు జరిమానా విధించడం సరైనదేనన్నారు సెషన్స్ జడ్జి.

పోనీ, కొమ్మూరి ముందు మాటలో నవలను సమర్థించలేదని జడ్జి అభిప్రాయపడుతున్నారు కనుక ఆమెకు శిక్ష సరైనదేనని తీర్పు చెప్పారను కొందాం. 'తులసిదళం' పుస్తకం చెడ్డదని, తప్పుడు భావాలను ప్రకటిస్తోందని నిర్ణయానికొచ్చారు గదా.... వీరేంద్రనాథ్‌కు ఏ శిక్షనూ ఎందుకు సిఫారసు చేయ లేదు ? ఒక్కమాట అన్నందుకు ఆమె నేరస్తురాలయితే, వీరేంద్రనాథ్ ఎంత ఘోర నేరస్తుడు కావాలి? పుస్తకాన్ని నిషేధించ మన్నాదంటే అది అతనికి శిక్షేం కాదు. లేక వీరేంద్రనాథ్ ఈ కేసులో లేడుగదా అంటే.... పుస్తకాన్ని నిషేధిం చాలని సిఫారసు చేసినప్పుడు అతన్ని శిక్షించాలని మాత్రం ఎందుకు సిఫారసు చేయకూడదు? దీన్నిబట్టి మన చట్టాలకూ, ఆ చట్టాల ఆధారంగా తీర్పులు ఇచ్చే వాళ్ళకూ సామాజిక స్వభావమే వుంటుందని, అందువల్లనే లక్షలాది పాఠకులకు కలిగే నష్టం కంటే, ఏ కొమ్మూరి లాంటి వ్యక్తులు పరువునష్టమో బరువైందిగా కనిపిస్తుందని అర్థమవుతుంది. అదలావుంచితే, రంగనాయకమ్మగారు కూడా తన వ్యాసాలలో కొంత వ్యక్తిగత ధోరణిని అనుసరించారని తెలుసుకోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. ఈ వ్యక్తిగత ధోరణివల్ల ఆమె ఒక్కోసారి తాను నిర్వహించ దల్చుకొన్న బాధ్యతకు అనుగుణం కాని మాటలను అనేసినట్టు అని పిస్తుంది. సమాజంపట్ల, పాఠకులపట్ల తనకున్న బాధ్యతను గుర్తించి విమర్శ చేస్తూనే, వీరేంద్రనాథ్‌ను ప్రశ్నిస్తూనే "ప్రశ్నించే పని యెవరికోసమో కాదు, తన కోసమే, తన మేలుకోసమే, ఇతరుల అజ్ఞానంతో పాటు కొట్టుకొని పోకుండా తనను తాను జ్ఞానవంతం చేసుకోవడం కోసమే" అంటూ పరస్పర వ్యతిరేకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

సామాజిక బాధ్యతను నిర్వహించినా అందులో 'తనమేలు' కూడా వుంది కదా అంటే ఆ అర్థంలో "ఎవరికోసమూ కాదు" అన్నమాట ఇముడు తుందా? అన్నది ప్రశ్న. "ఈ విమర్శలవల్ల పాఠకులంతా గొప్పగా మారి పోతా రనడంలేదు. మారడం మారకపోవడం వాళ్ళపని, చెప్పడం విమర్శకుల పని" ఈ మాటలవల్ల పాఠకులు ప్రశ్నించడం నేర్చుకొంటే 'తులసిదళం' లాంటి రచ నలు మరి రావడానికి వీలుండదనీ, కావలసిందల్లా పాఠకులు మారడానికి ఇష్టపడు తున్నారా, లేదా: ఇంతేనన్న భావం వ్యక్తమవుతుంది. మారడం, మారకపోవ

దంల మధ్య వుండే అనేక అంశాలను లెక్కలోకి తీసుకొన్నట్టు లేదిది. అదంతా వారి ఇష్టాయిష్టాల మీద ఆధారపడిన చిన్న విషయం అనుకొన్నట్టుగా వుంది. ఒకరకంగా ఇది ఆమె ప్రయత్నాన్ని కించపరుస్తున్నది కూడా. "మారారని కూడా అనుకోవడం లేదు" అన్నమాటలో "వీళ్ళు ఇంత సులభంగా మారతారా?" అన్న నిరాశ, నిరసన వుందేమో అనిపిస్తుంది మళ్ళీ.

"తులసిదళం"లాంటి "డైవర్షన్స్" రావడానికి కారణం లాభాపేక్ష వున్న ప్రచురణ కర్తలూ రచయితలూ వుండడమేనని భావించి, "లాభాపేక్ష పట్టిన తర్వాత దాన్ని యెవడికైవాడు వదిలించుకోలేడు. ఇతరులు దండించి వదిలించవలసిందే" నంటూ దండిస్తే వదలిపోయే అవకాశం వున్నట్టూ, వీరేంద్ర నాథ్‌ను శిక్షించే శక్తి పాఠకులకే ఉందని, శిక్షించకపోతే సమర్థిస్తున్నట్టేనని నిర్ణయించడం వ్యక్తివాద ప్రభావంనుంచీ పుట్టిన అవాస్తవిక ఆలోచనేననిపిస్తుంది. ఈ ధోరణి పాఠకులను అటు మారడానికి ఇష్టంలేని వాళ్ళుగానూ ఊహిస్తోంది. ఇటు తల్చుకుంటే వీరేంద్రనాథ్‌ను శిక్షించే శక్తిమంతులుగానూ ఊహిస్తోంది.

రంగనాయకమ్మగారు ఇలా ఊహించిన తర్వాత జరిగిందేమిటో కొంత చూద్దాం. తాను లేకుండా దినపత్రికలు కూడా కొత్త "ఎడిషన్లు" ప్రారంభించలేని స్థితికి "ఎదిగాడా" వీరేంద్రనాథ్. పాఠకులతన్ని శిక్షించనూ లేకపోయారు. కానీ అందుకు కారణం అతన్ని సమర్థిస్తుండడంవల్ల కానేకాదు. అలాగే, వీరేంద్రనాథ్ ఇకముందూ ఇలాగే ఉండడు. ఇప్పటికే అతనికంటే ముందుకొస్తున్న వాళ్ళున్నారు. సామాజిక వాస్తవికత నుంచీ పాఠకులను యెవరెక్కువ దూరం తీసుకవెళ్ళగలిగితే వాళ్ళు ముందు కొస్తుంటారు. ఈ రచయితలను చదవక తప్పని అనివార్య పరిస్థితి పాఠకులమీద వుంటుంది. ఈ పరిస్థితిని పోల్చడానికి రంగనాయకమ్మగారు చెప్పి నట్టుగా నిగ్రహంలేని వాళ్ళు కల్తీ ఆహారంకోసం యెగబడినట్టుకాక, ఫలానా ఆహారధాన్యం వాడితే భయంకరమైన రోగాలపాలవుతామని తెలిసినా వాడక తప్పని నిస్సహాయస్థితి, దుర్మార్గపు వత్తిడీ సరిపోతుంది. పాఠకులకు వీళ్ళను శిక్షించే అవకాశం కాదుకదా, వీళ్ళను తిరస్కరించే అవకాశం కూడాలేదు. దోపిడీ పాలకు లను వదుల్చుకొనే అవకాశం ప్రజలకు లేనట్టే వీళ్ళను వదుల్చుకొనే అవకాశం పాఠకులకూలేదు. రంగనాయకమ్మగారి స్వీయానుభవం కూడా ఈ సంగతినే

రుజువు చేస్తుంది. కమ్యూనిజం చెపుతున్నారని "జానకి విముక్తి"ని ఆపు చేయించిన సంపాదకుడికి బూతు ప్రేమను గురించీ, పెట్టుబడిదారు చిన్న పెట్టుబడితో పెద్ద లాభాలను సంపాదించడం గురించీ యెంత చెప్పినా యే అభ్యంతరమూ ఉండదు. "జానకి విముక్తి"ని కోరే పాఠకులకు బూతు రచయితనూ, సంపాదకుడినీ శిక్షించే అవకాశంలేదు. శిక్షించే అవకాశం లేకపోవడాన్ని శిక్షించడం ఇష్టంలేక సమర్థింపుగా భావించకూడదు.

రంగనాయకమ్మగారు అన్నట్టూ కేవలం లాభాపేక్ష లేదిందులో. బూతు ప్రేమా, లాభాల నవలా తప్పనిసరిగా లాభాలే సంపాయించి వుంటాయనేందుకు దాఖలాల్లేవు. తాత్కాలిక లాభాలను మించిన ప్రయోజనాలుండడమే ఇందుకు కారణమని, ఆమె నవలను ఆపు చేయించినా, ఆమెకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినా ఆ సంగతే రుజువవుతున్నదనీ అర్థమవుతుంది.

మొత్తం మీద ఈ పుస్తకాన్నంతా శ్రద్ధగా చదివిన తర్వాత రంగనాయకమ్మగారు ఎంత సమర్థంగా, లౌకికంగా తులసిదళాన్ని విమర్శించినా మూఢ నమ్మకాలను యెదిరించి సంస్కరణ వాదిలా, హేతువాదిలా ఆలోచించారని పిస్తుంది. హేతువాదం ప్రత్యక్షంగా వున్న అంశంపై దృష్టిని కేంద్రీకరించి, పరోక్షంగా వున్న మూలాంశాన్ని విస్మరిస్తుంది. ఈ హేతువాద దృక్పథంతోనే రంగనాయకమ్మగారు "రోగుల క్షేమం కోసం డాక్టర్ విరోచనాన్ని పరీక్షించినట్టు" తులసిదళం నవలను పరిశీలించి కూడా రోగ నిర్ధారణ చేయవలసిన అవసరాన్ని గమనించలేదు.

— రా.

తులసిదళం కాదు, గంజాయిదమ్ము

రచన : రంగనాయకమ్మ వెల : 6 రూపాయలు

ప్రతులకు : అరుణా పబ్లిషింగ్ హౌస్, కారల్ మార్క్స్ రోడ్,

విజయవాడ - 520 002

నీల

అల్లం రాజయ్య

నీలమ్మ వంగి వరి పొలంలో కలుపు తీస్తున్నది. పొద్దు వంగి పోయింది. పగలంతా కాసిన ఎండకు నీలమ్మ ముఖం వాడిపోయింది. నెత్తి నుండి చెమటకారి ఆమె జాకెట్టంతా ఉప్పుదేలింది. పైగా వంగితే ముఖమంతా వరి ఆకుల గీరుకపోయి మంటలేస్తున్నాయి. అసలే అది అందురు పొలం. నీలమ్మ భర్త తిడుగుబోతు, నాట్లప్పుడు అటోసాలు ఇటోసాలు బెట్టి నాటైతే పెట్టిండు - నాలుగు సాల్లు దున్నకపోవడంతో పొలంలో 'కోడెంగ, ఒలిపిడి' లాంటి గడ్డి మొలిచింది. ఎండకు పొలంలో నీల్లు కాగి చురుక్కుమని పిస్తున్నాయి. నీలమ్మ భర్త ఊరందరికీ కంటే - కనుక కలుపుకు నీలమ్మ ఎవరిని బతిమిలాడినా రానన్నారు. పైగా "ఊరుకు సెడువాకం సేసినోడు. నీ మొగనికి సెప్పుకో - నీలమ్మ నీ మొగుడు అపు సూనుకొని బలుపని బముసుతండు - నీ మీద మాకేమి కోతుకం లేదని" నీలమ్మ ముఖం మీదనే చెప్పేశారు.

నీలమ్మ ఎవరివి ఏమనలేదు, అట్లని 'నాకేందని' ఊకోలేదు తనకు వీలైన కాడికి కలుపు మొక్కలు పీకిపారేత్తనని నడుం కట్టింది.... అంతకన్నా నీలమ్మ ఏం చేయగలదు? ఇండ్లా ఇరువైఅయిదు నిండకుండానే పడరాని కష్టాలు పడ్డది - ఆమె ఆ కష్టాలకు దిమ్మెక్కి పోయింది. ఊఁ అనకుండా ఉప్పురాయి అనకుండా ఏదో వాక పని చేసుకపోవడమే అలవాటు చేసుకున్నది.

నీలమ్మ నడుమెత్తి నిట్ట నిలువునా నిలుచుండి పొద్దుకేసి చూసింది. 'ఎసాలాల్ల' దాటి పోయింది. పొలంకేసి చూసింది. ఎంత కలుపు తీసినా ఇంకా ఎకరం దాకా కలుప వల్సింది మిగిలే ఉన్నది.

కాలువ కింద కనుచూపుమేర దాకా వ్యాపించిన పక్క పొలాలల్లో కూలీలు కలుపులు తీస్తున్నారు. రంగు రంగుల చీరెలా, నవ్వులు, కేరింతలు, మధ్య మధ్య పాటలు.

రోడ్డుమీద బస్సాగింది. బస్సులో నుండి ఎవరెవరోదిగారు. బస్సులో

నుంచి దిగిన మతిమరుపు రాజాలు అదరబాదరగా ఒడ్ల మీది నుండి పరుగెత్తు కొస్తున్నాడు.

నీలమ్మ ఆ తత్తరపాటుకు విస్తుపోయింది.

రాజాలు నీలమ్మ పక్కనుంచి పోతున్నాడు.

"ఏందట్లా గావరపడి ఉరుకుతన్నవ్?" నీలమ్మ ఇంకా నిలబడే రాజాలు టక్కున ఆగిపోయి నెత్తిగోక్కున్నాడు.... ఆకాశంలోకి చూశాడు. "ఎందు కురుకు తన్న...." పైకే అని- "అఁ" అని మళ్ళీ నడక సాగించాడు....

"ఓరి నీ మతిమరుపు కాలిపోను." నీలమ్మ వంగి రెండు తోడెలగ గంటలు పీకింది....

రాజాలు పెద్ద గొంతుతో ఏదో అరుస్తున్నాడు, పిచ్చివాడిలాగా చేతులు తిప్పుతున్నాడు. కలుపుతీస్తున్న అద కూలీలంత రాజాలు చుట్టూ చేరిపోయారు.

నీలమ్మ లేచి నిలబడింది....

ఆ తరువాత తత్తరపాటు కేకలు, ఏడుపులు - మిగతా పొలాలలోని వాళ్ళు పరుగెత్తుకొచ్చారు....

నీలమ్మ ఒడ్డెక్కింది....

పొలాలల్లోని "కల్లాలగడ్డ మర్రి" కిందకేసి నడిచారు వాళ్ళంతా. ఆ గడ్డ నీలమ్మ నిలుచున్న దగ్గరికి కేవలం వంద గజాలే.

"ఓ నీ బాంచెన్ ఎల్లక్కా.... నా గుండె అవిసిపోయింది. నాతీర్గగ బస్టాండు కాడ సానమంది కుప్పయ్యిండ్లు- నెత్తురు. నా అన్నను టాక్టర్లనుంచి దుబ్బల పడేసిండ్లు- ఎవడో ఆసు దున్నపోతు తీర్గనోడు- నీ బాంచెనాతె-మాతోటి పెట్టుకుంటె ఎవలకైన గీగతే పడ్తదంట - మొత్తుకున్నడు-" రాజాలు బొచ్చె కొట్టుకుంటూ ఏడుస్తూ చెప్పుతున్నాడు.

వాళ్ళింట్ల పీనుగులెల్లగదరో కొడుకా! పెండ్లనక, సుకమనక నాత్రి పగలు గుడిసెలసొంట తిర్గితివిగదరా నా కొడుకా! ఆళ్ళ సేతులకు జెట్టలు బుట్ట-

అళ్ళ కండ్లు పెట్టన పేలిపోను. అళ్ళ నోళ్లె" ఓ ముసలమ్మ ఎదురుబొబ్బె కొట్టుకుంటూ కింద కూలబడి ఏడుస్తోంది...

నీలమ్మకేం అర్థంగాలేదు.

ఇలాంటి ఏడుపులు నీలమ్మకు కొత్తకాదు.... నడీసప్పుడు లేకుండ తను పీకిన గడ్డి కుప్పేస్తోంది. గడ్డి ఇంటికి తీసుకపోకపోతే అత్త తిట్టిన తిట్టు తిట్టకుండ తెల్లారేదాకా తిడుతుంది. అత్త యాదికొచ్చేసరికి ఆకలి గుర్తొచ్చింది. పొద్దున్నే పనంతా చేసి అందరికి తిండిపెట్టి తను తినాలని కంచంలో అన్నం వేసుకున్నది. భర్తింకా రాలేదు. 'వస్తే తల్లి అన్నంపెడుతుందిలే' - అనుకొని తింటున్నది.

బయట అడుగుల చప్పుడు.

నోటికాడ ముద్ద నోటికాడనే ఉన్నది "సువ్వర్‌ముండా ఉడుకు నీల్లేవే?" అరుపు.

"ఇంట్ల కూకుంది సాటుకు మేత్తంది. అది యాల్లకు తినకపోతెల్లరా? బక్కపడిపోదూ ఇంకో మొగన్ని...."

నీలమ్మ ముద్ద పళ్లెంలో పారేసింది - పొలంకేసి బయల్దేరింది.

నీలమ్మ ఆకలి కాకుండా ఉండేందుకు నడుముకు చుట్టుకున్న కొంగు విప్పుకున్నది.

తను పీకిన గడ్డి కుప్పేస్తోంది నీల.

కూలీలంత గొనుగుతూ ఊరు పేరు లేకుండా తిడుతూ నీల పక్కనుండే రోడ్డుకేసి నడుస్తున్నారు.

"ఏమయ్యింది పెద్దవ్వా" ఓ ముసలామెను నీలమ్మ అడిగింది....

"ఏ బట్టుముండా కొడుకు పున్నెం కట్టుకున్నాడో ? ఇయ్యాల్ల కాకపోతే రేపు నరుకకపోరు" ఇంకొక వడీడామె మెటికలిరిసింది.

తన భర్తనే వాళ్లు తిడుతున్నారని నీలమ్మకు అర్థమయ్యింది.

"నామంబొట్లు - గుళ్లె పూజలు - తాగుబోతు ముండకొడుకులు మంది కొంపలు కాల్సెదు ఎన్నేండ్లు బతుకుతరులే" ఇంకొకరు.

నీలమ్మ మరింక మాట్లాడలేదు. కుప్పేసిన గడ్డి మోపుకట్టింది. కూలీలంతా వెళ్లిపోయారు.

నీలమ్మకు మోపు లేవక అటిటు సొలిగింది. అతికష్టం మీద మోపు, నెత్తిమీదికి ఎత్తుకున్నది.

మోపు బరువుకు కాళ్లు కుదురుగా నేలమీద పడటంలేదు. పడమటి దిక్కు మబ్బు కుదురు కుంటోంది.... ఆకాశంలో పక్షులు ఎత్తుగా ఎగురుతూ ఎటో పోతున్నాయి.

రోడ్డు పక్కగల పెద్ద కాలువలో నీల్లు పారుతున్నాయి.

కూలీలు కొందరు అప్పటికప్పుడు తాలూకాకు ప్రయాణమయ్యారు.... దూరంగా తాడిచెట్ల మధ్యలోని చింతచెట్ల కింద "కల్లు మండువా" దగ్గర కూడా ఇందాకటి లొల్లి లాంటిదే లేచింది. చూస్తుండగానే అక్కడి మనుషులు రోడ్డుమీద అటిటు పరుగెత్తుతున్నారు. మొత్తానికి అక్కడి వాతావరణంలో దుఃఖం, అదుర్దా నిండిపోయింది. ఒక్క నీలమ్మకే వాళ్ళ బాధ తెలియదు. నీల్లల్లో రాయి వడితే అలలు చెదిరినట్లుగా మనుషులు చెదిరిపోయారు. అరా యేమిటి? నీలకు తెలియదు. ఎవరు చెప్పరు! నీల వాళ్ళ శత్రువు భార్య- అట్లని నీలమ్మ భర్త దొరకాదు. ఉన్న వాడుకాదు- కాని లేనివాళ్ళతో కలువక ఉన్నవాళ్ళ ఏజంటుగా తిరుగుతున్నాడు. భర్తకేం పోయేకాలమో? ఎవరితో తిరుగుతాడో కూడా నీలకు సరిగా తెలియదు. ఆమెకు తెలిసిందల్లా భర్త తాగుబోతు- ఇష్టమొచ్చినట్లు తిడుతాడు- కొడతాడు.

నీలకు కాలువలోని నీల్లను చూసేసరికి దప్పయ్యింది. మోపు ఒడ్డుమీద పడేసి కాలువలోకి దిగింది. చల్లగా, హాయిగా నీల్లు- ముఖం, కాల్లు చేతులు కడుక్కున్నది. అటిటుచూసి కొంగు నోట్లెకరిచి జాకెట్టు విడిచి పిండుకున్నది. వెన్నుమీద నీల్లు పోసుకున్నది. తడి జాకెట్టే తొడుక్కున్నది .... కొంత హాయిగా, ప్రశాంతంగా తోచింది.

గాలం కర్రలు ఊపుకుంటూ మంగలి నారాయణ హడావిడిగా ఊరుకేసి పరుగెత్తుతున్నాడు.

"నారన్నా జెరంత మోపెత్తవా?" నీలమ్మ పిలిచింది.

నారాయణ పోబోయినోడు అగి మోపు దగ్గరికి వచ్చాడు.

"ఏందన్నా అందరు ఉరుకుతండ్లు ఏమయ్యింది?" నీల.

"అయ్యో అక్కా- నీ కెరుకలేదా!" నారాయణ ముద్ద ముద్దగా మాట్లాడిండు.

"నా కొడుకు రోడన్నా నాకెరికలేదు... " నీల.

నారాయణ ముఖం వల్లబడి పోయింది....

"గోపన్నను సంపేసిండ్లు"

వంగిన నీల లేచి చిలుచున్నది....

"ఏ గోపన్న ?"

నారాయణ చెప్పిండు "నాకైతే ఇంటికింత 'ఎమకం' బెట్టాలని కట్టడి చేసి అన్నం బెట్టిండు" నారాయణ.

నీల తల గిర్రున తిరిగింది. శోషవచ్చింది.... మోపు మీద కూలబడి పోయింది.... ఒంట్లో నెత్తురంతా ఇంకిపోయినట్లు - మనిషి డీలా పడిపోయింది.

"ఏందక్కా- అట్లయిపోతివి!" - నారాయణ ఏదో మతికొచ్చి - కాసేపు మౌనంగా నిలుచున్నాడు.

నీల తనకు తానే తేరుకున్నది. మరేం మాట్లాడకుండా మోపు నెత్తిమీది కెత్తుకున్నది. నారాయణ పరుగెత్తాడు.

అడుగువేసి తూలింది - మొత్తం చిమ్మం చీకటి కమ్ముకున్నట్లుగా - కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కలిచినట్లుగా - అగులు బుగులుగా ఉన్నది. ఎందుకో నీలకు దుఃఖం ముంచుకొచ్చింది.

నీల నడుస్తున్నది.... మోపు కింద ఆమె ముఖంలో కన్నీళ్లు కారుతున్నాయి. పెదవులు వనుకుతున్నాయి.

నీలమ్మకు ఎన్నెన్నో గుర్తుకొచ్చాయి .. దారి సరిగాలేని చిన్న పల్లెటూరు. ఆ ఊళ్లో గుంపు చింతల కింద ఓ పెంకుటిల్లు. ఆ ఇంట్లో రెండు పాత చీరెలు తనే అంచేసుకొని కుట్టుకొని ఆ చీర కట్టుకొని పేద పేదగా తిరిగే

అంతెత్తు అడమనిషి - ఒళ్లంతా ఉలిపిరి కాయలతో రాత్రింబవళ్లు మొగ్గం ముందు కూర్చుంది "నాడె" టుటక టక విసుగు విరామం లేకుండా ఆడించే పొట్టిమనిషి - అవ్వ, అయ్య తిడుతుండగా పుస్తకాలు ముందేసుకొని చదువుకునే చిరుగుల లాగు పిల్లవాడు. ఊహ తెలిసేటప్పటికి అతనే తన భర్త అన్నారు.... ఏమయ్యిందో తను తల్లిగారింటికి ఎందుకు తీసుకరాబడిందో నీలకు ఎంత ఆలోచించినా గుర్తుకు రావడంలేదు.

తనను తీసుకపోవచ్చినతండ్రి పొట్టిమనిషి మామను ఎడాపెడా తిట్టాడు. మామ అప్పటికే నేతపని బందు చేసిండు. పూటగడవడం కష్టమే అయినా తనకు మాత్రం పెట్టేవాళ్ళు....

"నీ గూన కప్పటిల్లు సూసియియ్యలే - పొల్లగాడు నాలుగు అచ్చరం ముక్కలు సదువుతండని ఇచ్చిన- వాన్ని బర్లకు, గొర్లకు తోల్తనంటే-" తన తండ్రి కాంద్రకిచ్చి ఉమ్మేశాడు.

మామ ఏమనలేదు. ఆదేరాకడ తను మళ్ళా ఆ పూరికి పోలేదు.

తను పెద్దమనిషయ్యింది. ఆ తరువాత సంవత్సరానికి కాటోలు తప ఊళ్ళో మూడు పానాదుల దగ్గర పంచాతు జరిగింది. "పార్టీ" వాళ్ళెవరో పంచాతుకు వస్తండ్లని ఊరు ఊరంతా భయపడ్డది.

పంచాదులో ఏమి జరిగిందో కూడా తనకు తెలియదు.

నీలను ఎవరో పిలుచుక పోయారు.

మూడు పానాదుల దగ్గర మందిలో కూర్చున్న గుంగురెంటికల కోల ముఖపాయన- అతనిపక్క అప్పుడే మీసంకట్టు మొలుస్తున్న తన భర్త తలవంచు కొని కూర్చున్నారు.

"నీ పేరేందమ్మా?" గుంగురెంటికలాయన ఆప్యాయతనిండిన గొంతు.

"నీల" తను. ఎవరిని చూడకుండా తలవంచుకొని.

"చివరకు నీ ఇష్టాన్నిబట్టే నడుచుకోవడానికి అందరు ఒప్పుకున్నారు. నువ్వు యుక్తవయస్కురాలవు, నీ బతుకు నువ్వే నిర్ణయించుకోవడం మంచిది నీకు గోపయ్యతో కాపురం చేయడం ఇష్టమేనా?" గుంగురెంటికలాయన.

ఆ మాట పూర్తికాకముందే "లేదు" అని తను అక్కడినుండి బయట పడ్డది. ఈ మాట తనతో అన్పియ్యడానికి తనవాళ్ళు ఎంతో తంటాలు పడ్డారు....

నీలమ్మ ఇలాంటి ఆలోచనలతో బండ్ల బాటనుండి ఊరు దగ్గరికొచ్చింది. బాటకు రెండుపక్కలా ఈత పొదలు—పాదాలు ఇసుకలో కూరుకపోతున్నాయి.

నీలమ్మ టక్కున ఆగిపోయి తలతిప్పి అటీటు చూసింది.

"నీలా" పిలుపు.

నీల ఉలిక్కి పడింది.

చుట్టూ ఎవరు లేరు తను తప్ప....

సంవత్సరమే అయ్యిందో అంతకు ఎక్కువే అయ్యిందో?

పుండులాంటి చలికాలం. తను వరికల్లం దగ్గరికి సద్ది తీసుకపోయి మునిమాపురాత్రి తిరిగి వస్తోంది... పైన వెన్నెల. ఇంట్లో పసిబిడ్డ ఏడుస్తున్నడో ఏమో అని బిర బిర నడుస్తున్నది.

"నీలా .." ఇట్లాగే పిలుపు.

తను తత్తరపడి అటీటు చూసింది.

ముగ్గురు మనుషులు తన కెదురుగా- బహుశా కుడిపక్క ఈత పొదల్లో నుండి వచ్చినట్లున్నది. దొంగల్లాగా ఉన్నారు.

"నేను లీలా...." పైన కప్పుకున్న శద్దరు తీసేసి ఎదురుగా నిలుచున్నాడు.

తను గుర్తుపట్టింది. అప్పటికే అతని పేరుమీద రోజు చావదెబ్బలు తింటున్నది. గోపయ్యంటే తన భర్తలాంటి వాడేనని అప్పుడు ఆమెకు నమ్మకం.

"నాఎంట దయ్యంతీర్గ ఎందుకు తిర్గుతన్నవ్ - అనాడే ఒడిసిపోయింది గదా! నన్ను గిన్నె బొందిగ పిసికి సంపరాదు నీ కండ్లు సల్లబడ్తయ్ నీ మూలంగా సావదెబ్బలు తింటన్న" నీల దుఃఖంతో.

"నీలా నువ్వు నీ భర్త తీర్గనే ఉత్తగనే నామీద కోపం పెంచుకుంట న్నవ్-" గోపయ్య.

"మా వూరే దొరికిందా! ఏడవన్న నీ దొంగపనులు చేసుక బతుకలేవా?"

"మేము దొంగలంకాదు నీలా! మీ వూరేకాదు ఎక్కడ గరీబోల్లుంటే అక్కడ మేము సంఘాలు పెడుతున్నమ్. నీలా నువ్వు నాకిప్పుడు భర్తచేత దెబ్బలుతినే వేలమంది చెల్లెండ్లలో నువ్వొకదానివి. నీలా నీ భర్త నామీద అనవసరంగా కసిపెంచుకొని తను మాతో కూడవల్సినవాడు మా శత్రువులతో కూడిండు. నువ్వు చెప్పు నీలా!" శాంతంగా చెప్పుకొచ్చాడు ఇలాంటి మాటలు తను వినలేదు.

పక్కనున్నవాళ్ళు "ఔను సెల్లే" అన్నారు.

తను తల వంచుకున్నది. పెదిమలు వనికినయ్. అంతకన్నా అతను కూడా తిడితే బావుండును. తన తండ్రి దగ్గర నుండి కూడా ఇలాంటి మాటలు నీల విని ఎడుగదు. అది దుఃఖమో, కోపమో మరేదో తెలియలేదు.

తను మాటకొక్క తన్ను తిన్నదేగాని, ఇలా కోపం తెచ్చుకోకుండా తనకు జవాబు చెప్పినవాళ్లు లేరు.

నన్ను చెడ్డోనిగ సూడకునీలా! నన్ను నీ కట్టంలో మతికుంచుకో - నన్ను మతికుంచుకోవటమంటే - మేందేనికోసం కొట్లాడుతున్నామో దాన్ని తెల జేసుకోవటం, కట్టాలను సహించి ఊకోవద్దు. కొట్లాడాలే, నాకు నీమీదగాని, నీ భర్తమీదగాని కోపంలేదు నీలా! నీ వాళ్ళందరికి వీలైతే చెప్పు - నేను గరీబోన్ని నాకు గరీబోల్లంటే కోపంలేదని చెప్పు నీలా! సెలవు... "

వాళ్లు ఈతచెట్లల్లో కలిసిపోయారు.... వెన్నెల వెలుగులో తను ఒంటరిగా, నీలకు అదంతా కళ్ళముందు మెదిలి బరువుగా గాలి పీల్చింది. ఎడమచేతితో కొంగు తీసుకొని కండ్లు తుడుచుకున్నది....

గోపయ్య ఊళ్లోకి రావడంతో అందరి బతుకులు బాగుపడటం అనోట ఈనోట విన్నది నీల.

నీల ఒక్కొక్క ఇల్లే దాటుతూ నడుస్తోంది ... ఊరు ఊరంతా నిశ్శబ్దంగా ఉన్నది. ఎక్కడో గుడిసెలో చిన్నపిల్ల గుక్కపట్టి ఏడుస్తోంది. పిల్లను సముదాయించడానికి నీరసంగా తల్లి ఏదో గొనుగుతోంది.

నీలకు దుఃఖంస్థానే ఏదో బరువు మీదపడ్డట్టుగా ఉన్నది.

నీల తమ ఇంటి ముందటి మొండిగోడ లోపలికి జొరబడింది.

రెండేండ్ల కొడుకు శ్రీను తప్ప తవ్వ అడుగులేస్తూ వచ్చి నీల కాళ్ళకు చుట్టేశాడు. నీల గడ్డి మోపు కిందపడేసి కొడుకును ఎత్తుకొని గుండెల కదుము కున్నది.

నీల అత్త ఇంట్లోనుంచి బయటకొచ్చి ఉడిచెయ్యి నుదురుకడ్డం పెట్టి సూర్యున్ని చూసి ముఖం ముటముట లాడిచ్చి - "గింత పొద్దాలచ్చినవ్, అగలపోరి ఆకిలూడిత్తె బెమ్మలకు బెమ్మలే లేసినట్టున్నది సంసారం - మిండెడు మునిగి ముత మాయమై పోయిండనా ?" చేతులారుస్తూ.

నీల ముఖం వెలతెలా పోయింది.

నీల అత్త రంగమ్మ శంకిలిమనిషి - మొగుడు బతికుండగ అతన్ని తిన్న తిండి పెయివ బట్టకుంట తిట్టి తిట్టి మనిషిని మూగ మొద్దును చేసింది. తను ఎప్పుడు అదినొచ్చె ఇదినొచ్చెనని వగలుపోతూ ఎదుటి మనిషిని తిట్లతో లొంగ దీయడం అనే విద్యతో ఆమె జీవితమంతా కష్టపడకుండానే వెళ్ళిపోయింది. రంగమ్మ తిట్లకు వశపడకనే మొగడు ఉరిబెట్టుక సచ్చిండు. ఆమె నోరిప్పిందంటె ఊరు ఊరంతా గజు గజు లాడవల్సిందే. ఎక్కడ దెబ్బకొట్టాలో, మనిషి అయు పట్లు ఎక్కడుంటాయో రంగమ్మకు బాగా తెలుసు.

"నా కొడుకును అడిపోసుకున్న లంజెలు, లంజె కొడుకులు గట్లనే పోతరు. నెగులబుట్టని కోడిపిల్ల మంచం మూడుసుట్ల - ని ఆడు బతికిండా ? బతుకనిచ్చిండా ? లేమిడిగాడ్డికొడుకు లేకి బుద్దులు - నా కొడుకు జెట్ట ముండను ఏమంట కట్టుకున్నాడో కని సుట్టుకున్నది - నా కొడుకు కండ్లనిండ విదురబోలే - కడుపునిండ తినలే, గాయిగాయి తిరిగి."

నీల మాట్లాడలేదు, మాట్లాడాలనే ఆసక్తి, రోషం ఏనాడో చచ్చిపోయి నాయ్ ... మాట్లాడ్తె అత్తకు తిట్లకు ఆ మాట ఆధారమౌతుంది.

"మాట్లాడవేందే బట్టలంజె" రంగమ్మ రొండిమీద చెయ్యి వేసుకుని నిట్ట నిలువుగా నిలుచుండి అడిగింది. తనకు తిట్టడానికి కొత్తవిషయం కావాలి.

నీలకు సహ్రన కోపమొచ్చింది. "నోరిప్పుతే పురుగులు రాలుదేనాయే" నీల.

"నీ నోట్లె పోశమ్మ కూసోను, నీ నోరు పడిపోను ఊళ్లె లంజెలంత

నా నోరు మీదనే ఏడుత్తరు, మీ నోర్లు పడిపోయినయా ? మూసుక పోయినయా ? ఓసి బొడ్డికానా ! నా నోరు మంచిదిగాదే ! కవి నువ్వే - సముర్తయి అనిదగ్గర పండి, అడుసాలక ఇడుపుకాయిద మిచ్చి నా కొడుకును సేనుకున్నవ్"

"అత్తా!" నీల దాదాపుగా అరిచినట్లుగా అన్నది. ఆ మాట పాతదే గాని - నీలకు ఇప్పుడు భరించే శక్తి లేదు.

ఆ కంఠంలోని తీవ్రతకు రంగమ్మ విస్తుపోయింది, కాని తను ఓడిపో దలుచుకోలేదు.

"ఏందే? లావురేషపడ్తన్నవ్- మిందెన్నంటే పొడుసుకత్తుందా?"

"ఇంకో మాటంటె-" నీల కండ్లు ఎరుపెక్కాయి. తల్లి విచూసి సంకలో కొడుకు దద్దరిల్లి ఏడవసాగిండు.

"కొడుతవానె లంజెకాన - తెగినదానివి- లాకల్ అంటనే- అడు ఊరు ఊరంత కుప్పజేసి నా కొడుకుమీనికి ఉసిగొల్పితే పెండ్లానివైన నీకు రేషంలేదు. అడుమాదిగి మన్నేల...." రంగమ్మ కోపంతో ఊగిపోయింది.

నీల మరింక అక్కడ ఉండకుండా ఏడుస్తున్న కొడుకును నేలమీద పడేసి గడ్డిమోపు తెచ్చి "బర్రెమట్టు"కాడ పడేసింది.

బర్రెమట్టు దగ్గర దుడ్డె నీల్లకోసం గింజుకుంటోంది. బాయి దగ్గరికి తీసుక వెళ్ళి నీళ్ళు పెట్టింది. దుడ్డె నీల్లబొక్కెనమీద విరుగబడి తాగింది.

శ్రీను వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లి ఎటు తిరుగుతే అటే తిరుగు తున్నాడు....పకుతూ లేస్తున్నాడు.

"ఈ ఇంట్ల అందరు తినెటోల్లె - దుడ్డెకి నీల్లుబెట్టే దిక్కులేదు. దిక్కుమల్లె ముండకొడుకు వన్నెండుకు కన్నడు. అడిషటుక పుట్టేబదులు అడివిల మావై పుడితె మంచిది, మంచి మంచోల్లకు సావత్తదిగని నీలి ముండకు సావురాదు." చివరి మాటకు నీల గొంతు ముద్దైయిపోయింది కండ్లల్లోనుండి నీళ్ళు జలజలా కారాయి.

"నీ తల్లిగారింటి కాన్నుంచి తెచ్చిపెట్టినావె లంజె. నా ఇల్లు నా తిండి" అత్త బింకంగా అనుకుంటూ ఇంట్లోకు వెళ్ళింది.

"నా తల్లిగారు మునిగి ముతమాయమై పోయిండ్లు- నాకే తల్లిగారుంటె గీనరకం గీమాటలు బడుదునా" నీల కొడుకును ఎత్తుకొని కన్నీళ్ళు తుడిచింది- ముక్కు- చీమిడి తుడిచింది. ఉచ్చ పోసుకొని శ్రీను చెడ్డంతా తడిగాను మట్టినిండి ఉన్నది. పిల్లవాడు దుమ్మునిండి చీదర చీదరగ ఉన్నాడు. పైగా "నషీమీరి" పుండ్లు. 'ఒక్కగానొక్క- కొడుకుకు తానం టోసి తయారుజేసే పుర్సత్' లేనందుకు ఆమె మనసు విలవిల లాడింది.

పిల్లవాడు పాలకోసం తడుముతున్నాడు. అంటే అత్త కాసంత బువ్వ తినిపియ్యలేదన్నమాట- పిలగాన్ని ఒళ్ళో వేసుకొని వాకిట్లో కూర్చుంది- కొంగు కప్పి పాలిస్తోంది.

నీలకు మొదటిసారిగా తన బతుకుమీద రోత కలిగింది. ఈ బతుకు బతికేకంటె ఏ కాలువలోనో బండగట్టుకొని పడి సచ్చింది మేలు-ఎవరిని ఉద్ధరించ బతుకుతున్నట్టు?

పాలు చీకుతూ చీకుతూనే కొడుకు నిదురలోకి జారుకున్నాడు - కొడుకు పెదిమలు తుడిచి- లేచి నిలబడి కొంగు భుజం మీదేసుకొని వెళ్ళి పాతచీరతెచ్చి, చీర పందిరి కింద నులక మంచంలో కొడుకును పడుకోబెట్టింది.

ఈగలు "జిబ్బు జిబ్బు"మని తిరుగుతున్నాయి. కొడుకుమీద చీర పెగల కప్పింది....

రంగమ్మ ఇంట్లో మూలుగుతోంది. కొడుకొచ్చేదాకా అట్లాగే అపసోపాలు పడి రాగానే ఉన్నయి లేనియి కల్పించి చెప్పడం, ఆ కొడుకు ఈ కల్పనలు నమ్మి తన్నడం నీల పొద్దుగ్గా గాలి విడిచి కొంగు బొడ్లో దోపుకున్నది.

ఇల్లు దొంగలు దోసినట్టుగా ఉన్నది. శ్రీను ఆడుకున్న చాట, సోల, రాళ్ళు, రప్పలు, కట్టెసిలుక, గంగెద్దు ఎక్కడియక్కడే పారేశాడు. ఒక్కొక్కటే తీసి పక్కకు పెట్టింది నీల. వంట చెయ్యాలి. "సందగడు (సాయంత్రం సంధ్యా వాకిలి వూడ్చడం) తియ్యాలె - బర్రెకు కుడితి కలుపాలె - పొయిలకు కొట్టిన కట్టెలులేవు- సెరిగిన బియ్యంలేవు- కూరేమి వండాలో తెలియదు ..? పప్పు మొగనికి సొర్రుడుపోదు.

ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కట్టెలమండె దగ్గర నిలుచున్నది - చేతిలోకి గొడ్డలి తీసుకున్నది. మొట్టును అడ్డం జరుపుదామని వంగేసరికే చీరమీద 'మైల' కనిపించింది. నీలకు చెప్పరాని దుఃఖం కలిగింది. అసలే మనసు మొద్దు బారున్న సమయంలో ఇదొకటి - ఇప్పుడు అన్ని పనులట్లాబెట్టి జరూఫగ నీళ్లు కాగ బెట్టుకొని స్నానం చేయాలె.

నీళ్లకుండ తను ముట్టుకోకూడదు - అత్తను బిలుత్తే 'అంకచండాలం' కడిగిపోత్తది. మొండిగోడ మీది నుండి అవలింటికేసి నిక్కి చూసింది. చక్కగా పాకిన బీర పందిరికింద సావిత్రి బియ్యం కోడుతోంది. "సావిత్రక్కా" అన్న పిలుపు నోటిదాకా వొచ్చింది. అత్తచూస్తే మళ్ళీ అదోగొడువ ఇద్దరుకలిసి ఏవో గుసగుసలు పెడ్తండ్లవి.

"సన్నీళ్లు పోసుకుంటె సత్తనా?" బాయి దగ్గరికి నడిచింది. బాయి ముట్టుకోవద్దు - అందుకైనా పిలువాలె.

"అఁ ఏవున్నది, దిక్కులేనోల్లు ఏంజేత్తరు." గబగబా బాయిలోకి చేద వేసి నాలుగు బొక్కెండ్ల నీల్లు నెత్తిమీద కుమ్మరిచ్చుకున్నది. అప్పుడు యాదొచ్చింది ఛీరెరయికె తెచ్చుకోలేదని, అత్తను పిలిచేదిలేదు.

నీలమ్మ నీల్లు కారుతున్న ఒళ్లతో ఇంట్లో కొచ్చేసరికి రంగమ్మ నోట మాట రాక దయ్యాన్ని చూసినట్లుగా గుడ్లు తేలేసి చూసింది.

"వీలీ - అన్నంత పని చేసినావే?" అన్నది.

నీల ఆ మాటను ఖాతరు చెయ్యకుండా చీరజాకెట్టు అందుకున్నది.

"మిండెడు సచ్చిండని తలార తానంజేసినావే రంకుముండా?" రంగమ్మ కూడదీసుకొని ఓడిపోయిన గొంతుతో.

"ఔ - నా మొదటి మొగుడు సచ్చిండని" అన్నది.

ముసలి రంగమ్మ తొలిసారిగా దెబ్బతిన్నది. ఆ మాట కోడలు అనగల దని ఊహించలేదు. మరింక రంగమ్మకు మాటలు రాలేదు ఏడుపు వొచ్చింది - పెద్దగా శోకాలు పెట్టడం సాగించింది.

నీలకు తన విజయం తెలిసింది. తన బతుకులో మొదటిసారిగా ఇలాగా ఇంకొకరు ఏడుస్తుంటే చూస్తున్నది.

పొడిబట్టలు కట్టుకొని తడి బట్టలు మూటకట్టి బాయికి దూరంగా ఓ కర్ర మీద పెట్టింది.... గొడ్డలి తీసుకొని పొయ్యిల చెక్కలు పగులవేసింది. ఇంటెనుక పందిరికింద పొయ్యి శుభ్రంచేసి మంట రాజేసింది - బుగ్గంది గంజులో ఎసరు పడేసి, బియ్యం చెరిగి గంజులో వేసింది. చీపురు తీసుకుని ఇల్లంతా ఊడ్చింది. తలగోల్ల కొట్టుకొని - కూరేంవండాలా అని ఆలోచించింది.

కూరనార రుచిపచి అనకుండా తినే లేత ముఖం సిల్లవాడు గోపయ్య కన్పించాడు. గొడ్డుకారం - ఊదుకుంటూ తను తినలేకపోతే తల్లితో పోట్లాట పెట్టుకోవడం గుర్తొచ్చింది.

నీల ఇంటి బయట కొచ్చింది. అప్పటికి ఎండపొడ ఇండ్ల కప్పులమీద పారాడుతోంది - గోడలనీడలు వాకిల్లను, బజార్లను కప్పేశాయి. దిగాలుపడ్డ మొఖాలతో, బురద చిల్లిన ఒళ్ళతో - వాడిపోయి, వొడలిపోయి జనం ఇండ్లకు పల్లుతున్నారు.

బండారు పోశాని ముసలవ్వ నడిబజాట్ల నిలబడి దారినపొయ్యే వాళ్ళ వల్లా "ఏమయ్యిందని" అడుగుతుంది.

ఎవలు సడీసప్పుడు చెయ్యటంలేదు. ఆ మునలమ్మకు జవాబు చెప్పడంలేదు.

"ఏంబుట్టిందర్రా? నోళ్ళల్ల బెల్లంగడ్డలు బెట్టుకున్నార్రా - ముసలి ముండకు కూసంత సెవులేత్తే అరిగిపోతరా? కరిగిపోతరా? పొద్దాల 'బంటకు' కంకెడంత తినిపోయిండ్లు కొడుకులు. దినాలు మంచియిరాలే - పాడు మనుసు అగదాయె - ఇంక రాకపాయిరి. బొరా! నువ్వు దొమ్మటోల్ల సాంబయ్య వేనా? మా మధునయ్యను జూస్తివా? ఇంక రాక పెయిరి మా వోళ్లు" పోశాని ముసలవ్వ.

"నేను ఎంబడోల్ల సత్యయ్యను పోశవ్వ" అన్నాడు నిలబడి.

"నీ బాంచెన్ బిడ్డ - సచ్చి నీ కదుపునబుడత"

"నీ కొడుకుల కడుపుల్నే పుట్టేవ్ తియ్యే"

"అట్లనే కానియ్యి బిడ్డా! ఏం జరిగింది బిడ్డా! అందరు మన్నుదిన్న మంజేరు గున్నలతీర్గ వోతండ్లు - నా కేందో అగులు బుగులుగున్నది బిడ్డా!"

"మంచి మంచోల్లు మన్నయివోంగ దూదేకులమియ్య దుడ్డుబట్టిండట - ఇనేంజేత్తవే ?" సత్తయ్య ఎడ్లనదిలించుకొని వెళ్ళిపోయాడు...

"నీ కాడుగాల నువ్వు వోవద్దివిపిలడా ?" ముసల్ది పుతుకులాడుకుంట ముందుకు నడువబోయింది.

నీలకు ఆ సంగతి చెప్పాలనే ఉన్నది. కాని అడుగు ముందుకు పడ లేదు. నోరు పెకులలేదు. ఏమని చెప్తుతుంది. అతనిగురించి తనకేం తెలుసు ?

నర్సొక్కల గాలిగాడు "గుమ్మినింద పందికొక్కు - గుమ్మి కింద కందిపప్పు - దెసెఁనీతల్లి - గుమ్మినింద కందిపప్పు - గుమ్మికింద కందికొక్కు - ద్దుతెరి కందిపప్పు" అనుకుంటూ ఉరికొచ్చాడు. ఆ మాట అనడానికి ఎన్ని తంటాలు పడినా నాలుక తిరగడంలేదు.

"నీ సంబురం పాడుగాను గాలిగా జెర ఆగురా !" వోశాని ఆగబట్టింది.

గాలిగాడు తను ఇందాక అనే మాట మరిచివోయాడు.

"ఏమయ్యిందిర - సడకుపక్క కొట్లాటగిన అయ్యిందా ? పోలీసోల్ల మోటరొచ్చిందా ? ఎందుకనో పిల్లివట్టిన కోడిపిల్లలతీర్గయి వోయిండ్లు"

"కందికొక్కు" - నెత్తిగోక్కుంటూ గాలిగాడు.

"నీ ఇంట్ల పీన్గెల్ల - ఎనుకదెవడో 'సెలిమకాడ' పజ్జెం మర్సిపోయి మా అత్తగారిచ్చిన 'అర్నం అవు'గిన్నే వోయిందంట ఉసికంతా గెలికిండంట - పెండ్లా మచ్చి తన్ను తందునా ? అన్నదంట - అఁ తానే తందానా ! అన్నడట" వోశాని మాతులు వొదిచి "ఏమయ్యిందిరా ?" అన్నది.

బిత్తరిచూపులు చూశాడు గాలిగాడు, నెత్తి గోక్కున్నాడు.

"ఓ అదా! గోపన్నను సంపేసిండ్లట" గాలిగాడు.

"ఓర్నీ నోరు పడిపోను, నిచ్చమా ! అవద్దమురా? ఎవడు పున్నోంకట్టు కున్నడురా?" పోశాని కంఠంలో వొనుకు.

"నాకేమెరుక - మేకమరుక" గాలిగాడు ఆ మాటనే పాటలాగా పాడుతూ పరుగెత్తాడు.

ముసల్ది నవనాడులు కుంగిపోయినట్లుగా చేతికట్టె నేలమీద పడేసి బజాట్లో కూలబడిపోయింది. ముఖాన కొంగుబెట్టుకొని ఆ నిరుపేద ముసల్ది తన కొడుకే చనిపోయినట్లుగా ఏడ్చింది. దాని మనసులో గోపయ్య పాడే పదం "కక్కుదేర్గుడు బెట్టి లచ్చుమమ్మో" మెదిలింది, తమ ఇంట్లో మనిషిగా మెదిలిన సంగతులు గుర్తుకొచ్చాయి.

నీలకు ముసల్దాని దుఃఖానికి, గోపయ్య చావుకు ఉన్న బాంధవ్యం తెలియదు.... ఊరి వాళ్ళంతా అతని గురించి అంత కలవెల ఎందుకు పడుతున్నారో?

నీల బీరతీగ వెంట వెతికి మూడు బీరకాయలు తెంపింది. బీరపువ్వులు పసుపుపచ్చగా, పసిపాప నవ్వుల్లా విచ్చుకుంటున్నాయి. ఇంటివెనుక చింత చెట్టు మీదికి కవ్వర, కవ్వర మంటూ పక్షులు చేరుకుంటున్నాయి. మామూలు రోజుల్లో నైతే వీధిలో నడిచే మనుషుల మాటలే ఆ పక్షుల అరుపులను మించి విన్పించేవి - ఊరపిచ్చుకలు పిచ్చర పిచ్చరమంటూ అటుదునికి ఇటుదునికి చూరుకిందికి చేరు కుంటున్నాయి.... ఇండ్ల కప్పులమీది ఎండపొడ మటుమాయమైన గోపయ్య ప్రశాంతమైన ముఖంలాగే విష్కృతి మిస్తోంది. దుఃఖంలా నల్లబారే ఊరు.

నీలకు అనంత కోటి మాటలు పోసెత్తాయి.

*　　*　　*

బ్రాందిషాపు వెనుకాల అందంగా కత్తిరించిన చెమన్ అరమధ్య అయిదు గుడు కూర్చుండి తాగుతున్నారు. వాళ్ళముందు టేబిల్ మీద కోడి ఎముకలు చిందర వందరంగా పడివున్నాయి.

అక్కడ కూర్చున్న అయిదుగురు ఇంచుమించు ముప్పయి సంవత్సరాల వాళ్లే - అంతా ఒకేకత్తు అయినా తలోరకంగా ఉన్నారు. టేబుల్‌కు ఆపక్క, ఈపక్క ఇద్దరిద్దరు కూర్చున్నారు. ఎదురుగా కూర్చున్న తను హుందాగా ఠీవిగా ఉన్నాడు. అక్కడ కూర్చుండి తాగడం అతనికి చిరాకుగాను కోపంగాను ఉన్నది.

బ్రాండిషాపు కౌంటర్‌మీద విసుగు నిండిన గొంతుతో పొడుగ్గా ఉన్న తను "వీళ్ల ఈ రాత్రంతా తాగేటట్టుగానే ఉన్నది" పైకే అనుకుంటూ బ్రాండి షాపు ముందు మూడు మోటారు సైకిళ్ళను దిగాలుగా చూశాడు- అతనికి ఈ కస్టమర్లు షాపులోకి రావడం కొత్తే.

పెట్రోలింగుకోసం వచ్చిన పోలీసులు రోడ్డుమీద నిలుచున్నారు.

అందులో ఒకతనువొచ్చి. "ఈ సైకిల్ మోటర్లు ఎవలయని మా హెడ్ కానిస్టేబుల్ అడుగుతండు సార్-" అన్నాడు.

"ఒకటి గోవయ్యేది...." అసహనంగా-

పోలీసు ఢంగైపోయాడు.

"లేకపోతే ఏందయ్యా- బ్రాండిషాపులకెవరొస్తరు? నీ దగ్గర టార్చున్నదా? వీధి లైటుల బండి నంబర్లుచూసి చెప్పుపోరాదు" అన్నాడు కౌంటర్‌మీది మనిషి-

పోలీసు ఎగాదిగాచూసి మోటారుసైకిల్ల చుట్టూ తిరిగి నిలబడిన పోలీసుల దగ్గరికిపోయి ఏదో చెప్పాడు....

హెడ్ కానిస్టేబుల్ పోలీసు తీవితో "షాపు మూసేయవయ్యా" అన్నాడు కరుకుగా....

"లోపల కూర్చున్న వాళ్ళకు చెప్పరాదు" అన్నాడు కౌంటర్‌వాలా-

ఇందాకటి పోలీసొచ్చి నిలుచున్నాడు మిగతావాళ్లు వెళ్ళిపోయారు. కౌంటర్ మీదివ్యక్తి ఓ క్వార్టర్ బాటల్‌తీసి యిచ్చిండు.

చమన్ లోపల నల్లగా కుదిమట్టంగా ఉన్నతను "మనం విలేజిలెవల్లకు పోవాలా" అన్నాడు ఖాళీప్లేట్లో పునుకుతూ....

ఎడంపక్క కూర్చున్న తను. "నాకైతే సావుకచ్చింది" అన్నాడు తడబడుతూ... అదే అదవని.

"వీనమ్మ అన్నీ బొక్కలే" ఇందాకటి నల్లటి అతను.

"మాంసపు ముద్దలుంటయనుకున్నావా?" ఇందాకా భయపడినతని పక్కతను....అందరు నవ్వారు. ఎదుటివ్యక్తి. భయపడిన వ్యక్తి తప్ప....

ఎదురుగా కూర్చున్నతను మొఖ్కుబడిగా వాళ్ళకోసమే కూర్చున్నట్లుగా కూర్చున్నాడు.

మెల్లెగాలేచి షాపు బయటకొచ్చారు.... కౌంటర్ మీది వ్యక్తి హమ్మయ్య అనుకున్నాడు.

ఇందాక భయపడిన వ్యక్తి తూలుతూ అతనిదగ్గరి కొచ్చాడు.

"రావ్ సాబ్ మీ పొలాలు మల్ల నాట్లుబెట్టిచ్చినం... వాడుసచ్చిండు, నేనే చెప్పిన్నని-పట్టిచ్చిన్నవి మా వూరోల్లు నామీదికస్తరు."

నీకు అంత ధైర్యమున్నదని మీ వూరోల్లు నమ్మతరనుకుంటున్నావా? పోనీ నీకు నువ్వైనా! నమ్ముతున్నావా? ఖైర్."

"నువ్వు నాకోసం రాలే- నా సేవలు జెయ్యలే-సచ్చినవాడు నీ పెండ్లాం మాజీ మొగడు- అదీ నీమంట- నువ్వు మా పార్టీల జేరింది నీ బలానికే విన్నవా? తిరుగుబోతువు-పైసకు గొరగానివానివి-ఈ బ్రాండిషాపులో నా పక్కన కూర్చుండి తాగేదన్క- ఎదిగినవ్ చాలదా?" అతను సైకిల్ మోటర్ స్టార్టు చేసిండు.

భయపడే అతను- దగ్గరికిపోయి-" మీరు తలుచుకుంటె కొంతకాలం ఎక్కడవన్న వంపియ్యగలరు."

అతను బలంగా నెట్టాడు- భయపడే అతను కిందబడిపోయాడు- బట్టలు- తెల్లటిఖద్దరు బట్టలు దుమ్ముకొట్టుక పోయాయి....

ఇందాకటి నల్లటి మనిషివచ్చి లేపి "రావుసాబ్ కోపంలున్నడు. మనం రావుసాబ్ కోసం చేస్తిమా? దేశభక్తి ఉండిగని- పాం నువ్వేం భయపడకు నేను మీ వూళ్ళో దించివస్త ..." అన్నాడు అనునయంగా-

సైకిలు మోటరమీద వెనుక కూర్చున్నాడు- నల్లనతను కౌంటర్ మీదికి వెళ్ళి అఫ్ బాటిల్ తెచ్చి చేతికిచ్చాడు.

సైకిలు మోటరు ఊళ్ళోనుంచివచ్చి నీలమ్మ ఇంటి ముందాగింది.

ఆ శబ్దానికి నీల ఉలిక్కిపడి లేచి తనభర్తే అయివుంటాడని తలుపు తీసింది. ఎదురుగా తనభర్త సత్యనారాయణ- ఇంకెవరో తనకు తెలియని మనిషి- తనకేసి అదోలా చూస్తున్నాడు.

భర్త లోపలికొచ్చాడు. బైట సైకిల్‌మోటరు మోత అంతకంతకు దూరమయ్యింది.

సత్యనారాయణ సొలుగుతూ పోయి మంచంమీద కూలబడ్డాడు. తెచ్చుకున్న సీసామూత తీసి గటగటా తాగాడు.

"అవలతాగింది సాలలేదా?" నీలమ్మ కొడుకును తీసి నేలమీద సాపేసి పడుకోబెట్టింది....

సత్యనారాయణ మాట్లాడకుండా తాగుతున్నాడు.

"అన్నం తింటావా?" నీల.

సత్యనారాయణ కండ్లు ఎఱ్ఱగా జ్యోతుల్లా ఉన్నాయి! ముఖం ఉబ్బి ఉన్నది. లోపలెక్కడో దగాపడ్డ మంట - పరోపక్క శాశ్వత శత్రువు చనిపోయినందుకు సంతోషం - అతని అనుచరులు పగబడతారేమోనని భయం....

నీల భర్తదుమ్ముకొట్టుకపోయిన బట్టలు, ఉబ్బిన ముఖం, ఎరుపెక్కిన కండ్లు చూస్తున్నది. కొత్తగా, వింతగా అసహ్యంగా ఉన్నాడు. ఈ మనిషితో తను ఇన్నేండ్లు కాపురం చేసింది, తన్నులు తిన్నది....

"నీ మాజీ మొగన్ని.... సంపేసింద్లే లంజెకాన" సత్యనారాయణ బొంగురుగా.

నీలకు చెప్పరానంత అసహ్యం కలిగింది. మాజీ మొగుడు, మాజీ మొగుడు - అందరిది ఒక్కటే మాట - తల్లిది, కొడుక్కది - నీల చివ్వున లేచిపోయింది, కాసేపాగి కంచంలో అన్నం తెచ్చింది.

సత్యనారాయణ ఊగుతూ లేచినిలబడి కంచం తీసి విసిరికొట్టిండు.... అది బొకబొక లాడింది. అన్నమంతా చెల్లాచెదురుగ పడిపోయింది, కూర నీల ముఖం మీద పడ్డది.

"నీకు దుఃఖంగున్నదా?" సత్యనారాయణ నీల చెయ్యిపట్టి మీదికి గుంజుకున్నాడు. భర్త కళ్లల్లో పశువు కామం.

"నువ్వు సత్తె ఏడవననుకుంటన్నావా?" నీలకు ఏం మాట్లాడాల్నో తోచలేదు. కోపంలో ఏదో అన్నది విడిపించుకొని దూరం జరిగి.

"లంజె " సత్యనారాయణ నీల వెంట్రుకలు పట్టి పెడీపెడిన గుద్దిండు, కాకెట్టు పర్రున చింపిండు, తన్నిండు.

"పో లంజా, నువ్వు నా పెండ్లానివి కాదు" వెంట్రుకలు బట్టి బయటకు ఈడ్చిండు....

పిల్లవాడు శ్రీను లేచి మొత్తుకున్నాడు.

"వీడు నాకు పుట్టలేదు" సత్యనారాయణ పిల్లవాన్ని బయట పడేశాడు. తలుపులు బిగించుకొని తాగసాగిండు.

అత్త రంగమ్మ "లంజెకాన నా కొడుకునేమన్నవే- నీకేం బుట్టిందే మార్నగాలం." అంటూ మంచాలనుంచి లేవకుండానే తిడుతున్నది.

నీల ఏడ్వలేదు... కొడుకు నెత్తుకొని ఇంటిముందర గుడిసెలో బర్రె మట్టు దగ్గర కూర్చున్నది. పెదవిపగిలి నెత్తురు కారుతున్నది. వీపులో పొంగి పోయింది....చేతి మట్టలమీద పాతదెబ్బల మచ్చలున్నాయి.

పైన మబ్బులు కమ్మిన అకాశం - ఒళ్ళో ఏడిచే కొడుకు. ఆ దెబ్బలు నీలను బాధించలేదు.... కొడుకు నోట్లో రొమ్ము పెట్టింది .... ఎక్కడో నీలకు మనగ్గా, సన్నగా ఉన్న దారంలాంటి బంధమేదో తెగిపోయినట్లుగా అన్పించింది.

ఎప్పటినుంచి ఉరుముతున్నదో తెలియదు. కాని ఇప్పుడు తన మనసులో పిడుగులు పడుతున్నాయి. ఉండీ ఉండీ మెరుస్తున్నది. బర్రె తన బిడ్డను నాకుతున్నది.

నీలకు ఎండా, వాన, చలి, చిన్నతనం లేగదూడలా పరుగులు తీసిన రోజులు గుర్తొచ్చినయ్. తండ్రి బట్టల దుకాణం. మొదటి పెండ్లి, ఆ తరువాత సత్యనారాయణతో కాపురం- తను ఎక్కడ మొద్దుబారి పోయిందో గుర్తుకురాలేదు. భర్తచేత తన్నులు తినడం నీలకు ఇది ఎన్నోసారో? ఈసారి బయటకు గెంటేశాడు ...సత్యనారాయణ మొదటిరాత్రి - తలుపులు బిడాయించి తనను అడిగిన మాటకు బెదిరిపోయింది. ఎదురితిరిగింది. సత్యనారాయణ మొదటిరాత్రే మీదబడి కొట్టిండు. అప్పుడు తను బయటకు పరుగెత్తి పదహారుమైళ్ళు ఆ చీకటిరాత్రి తల్లి గారింటికి పరుగెత్తింది. మరింక మొగోడనే వాని మొఖం చూడననుకున్నది- "కాపురం జేసినంక వాడే మారుతడని" తండ్రి మళ్ళీ దిగవిడిచిపోయాడు.

భర్త మారలేదు. తను చెప్పినా నమ్మకుండా బయట భజనలు. పూజలు మొదలు పెట్టింది. అందరికి శత్రువు అయిన మనిషి వంచలో చేరిపోయాడు. రోజు రోజు దిగజారాడు.

తను మరింక తండ్రికి చెప్పుకోలేక పోయింది.... రాను రాను తండ్రి తనను పట్టించుకోవడమే మానేశాడు. అన్నలు వేర్లు పడిపోయి ఎవల బతుకు వాళ్ళదయ్యింది. బట్టల దుకాణం పోయింది. తండ్రిని కొడుకులు చూడరు. తన తండ్రే పొట్ట గడవటంకోసం బట్టల మూటలు మోసుకొని ఊళ్ళవెంట తిర్గు తున్నాడు....అంతటితో తల్లిగారింటి బాంధవ్యం తెగిపోయింది. ఊళ్ళో తన బాధలు వినే వాళ్ళెవరన్నా ఉన్నారో లేదో కూడా తెలియదు - తను - ఇల్లు - తన ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా అందరు తనను బాధపెట్టారు.

ఒళ్ళో కొడుకు నిదురబోయాడు వాడికి ఈ బాధలు తెలుస్తున్నాయా? ఎప్పుడో చిన్నప్పుడు చిందు మాదిగివాళ్ళు ఆడిన భాగోతంలో బాలనాగమ్మ మతి కచ్చింది....మాయలపక్కీరు గుహలో కుక్క తీర్గపడుంటుంది బాలనాగమ్మ- నీలా మొగ కుక్కవుకాదు - ఆడి కుక్కవు - పిరికెడు మెతుకుల కోసం ఈ ఇంట్లో పడిఉంటున్నావు. బైట దిక్కులేదు. ఆ కుక్క బతుకు కూడా మరింక సాగేటట్లు లేదు- బాలవద్దిరాజులాగా తన కొడుకు తనకు సుఖం కలిగిస్తాడా? ఆ రెండు సంవత్సరాల నషిమీరు పుళ్ళ కొడుకును గుండెల కదుముకున్నది. వెచ్చని కన్నీళ్లు కొడుకు ముఖంమీద పడుతుండగా ముద్దులాడింది. 'నా కొడుకా బాలవద్దిరాజా! నీవి లేతపాదాలు- నువ్వు పెరిగి పెద్ద గెప్పుడైతావ్- నీతల్లి ఏడ కుక్కయిపోయిందో ఎప్పుడు తెలుసుకుంటవ్ - ఏడేడు సముద్రాలు ఎప్పుడు దాటేవ్? అప్పటిదాకా నీతల్లి బతుకుతే కదా: నాయిన్న నువ్వు దిక్కనుల్లె నీలమ్మ కొడుకువేగావి-బాల వద్దిరాజువుకాదు నా తండ్రీ-నా తండ్రీ బాలవద్దిరాజులను పక్కీరోల్లు బతుకనిస్తరా?'

ఉరుములు హెచ్చాయి.... మరింక తనెక్కడికి పోగలదు: తను ఎవరి అంటు సొంటుకు బోయినా అళ్ళకు అజన్మ బాధలు సుట్టుకుంటయ్ - తన పుటుకే మంచిదిగాదు. "దేవునిగుళ్ళె రాయివడ నా అసొంటిదాన్ని కొంటబోడు" 'అయినె- తన బతుకును సూసుకోక గరీబోల్ల బతుకులు సూసిన అయినెను బతుకనిచ్చిండ్లా:'

గోపయ్య మతికొచ్చేసిరికి నీల మనుసు చెకువై పోయింది.

సన్నగా వర్షం ప్రారంభమయ్యింది.

తనిక ఈ తన్నులు తినలేదు.... ఎవలకు మాత్రం పనికిరాని తను బతికెంత ? బతుకకపోతే ఎంత ? ఈ పసిగుడ్డో - వాన్ని నేను మనుండగనే బుక్కెడంత బువ్వ దినిపిచ్చే దిక్కులేదు. నేను పోయినంక నా దినవారాలు గాక ముందే ఇంకోదాన్ని తెచ్చుకుంటడు - నా మీద కోపాన్ని అత్త, భర్త పిల్లగాని మీద చూపెడుతరు. కనుక నా అంశ ఈ భూమ్మీద బతుకద్దు.

నీల లేచి నిలబడింది. చీకట్లో - దెబ్బలుతిని, జుట్టు ఊడిపోయి, బట్టలు చిరిగి నీల పిచ్చిదానిలాగున్నది. చేతుల్లో కొడుకు చలికి వణుకుతున్నాడు. మెరిసిన మెరుపులో కొడుకు అమాయకమైన ముఖం - నీల వాకిట్లో నుండి మొండిగోడ దాటి బజార్లోకొచ్చింది. నీల మెదడులో ఆలోచనలన్నీ ముద్దయిపోయాయి.

చిమ్మంచీకటి - చిమ్మెట్ల రొద - ఉండీ ఉండీ గుడగుడలాడే ఆకాశం. కాంతి విహీనమైన మెరుపులు, బలహీనంగా కురిసే సన్నటి తుంపర - నీల దక్షిణ వేపు నుండి ఉత్తరవేపుకు వడివడిగా నడుస్తోంది.

హన్మంతుని గుడి, రైతుల గూనిండ్లు, వడ్లధాతి, కమ్మరి కొలిమి, గుడిసెల వరుస - చివరన ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. రాత్రి ఎంతయ్యిందో తెలియదు.

భుజంమీద ఎత్తుకున్న కొడుకుకు కొంగు కప్పింది - తడిసిపోయి గజ గజ వణుకుతున్నాడు. తల్లి భుజాన్ని బిగ్గరగా కరిచి పట్టుకున్నాడు. నీలంగా ఏడిచాడు - నీల ఎవరైనా అడ్డగిస్తారేమోనని గుడిసెల్లో నుండి వడివడిగా నడిచింది - గుడిసెలు ఆఖరైన చోట బండ్లబాటకు అపక్క ఈపక్క 'నీల్ల బొదరు'లో ఎత్తుగా పెరిగిన తుంగమీద వాన చినుకులు శబ్దం చేస్తున్నాయి.... అప్పుడప్పుడు 'సప్పున' గాలితెర వీస్తోంది. నీళ్ళ బొదరులో చిన్న కప్పలు తప్పెట్లు కొట్టి నట్టుగా అరుస్తున్నాయి. ఎక్కడో 'నీరుకట్టెపాము' కప్పను మింగినట్లున్నది. కప్ప చిత్రంగా అరుస్తోంది.... ఆ తుంగ దాటిన తరువాత పెద్దకాలువ వొచ్చింది. ఆ దారి పీదా గుట్టకేసి పోతుంది - కాలువ మీద మోరి - ఎడంకేసి నడుస్తోంది.

అట్లా కొంతదూరం నడిచింది. 'ఈడుగు పొదల' పక్క పెద్ద పరుపుబండ - పరుపు బండనానుకొని 'నక్కలబోరు' నక్కల బోరు పై భాగంలో 'చిన్నయ్య పెద్దయ్య దేవుడి' పందిరి....

నీలమ్మ ఈడుగు పొద పక్కనే పెద్ద బండసాటుకు కూర్చున్నది - మోకాళ్ల మీద కూర్చుండి కొడుకుకు పాలు పట్టింది అఖరిసారిగా ముద్దులాడింది ... ఒళ్ళంతా తడిమి తడిమి చూసింది. ఎక్కడో తల్లి పేగు తిరుగబడుతోంది.... ఏ ఆలోచనకు చోటివ్వకుండా లేచి నిలబడి - గుట్టబోరును - చీకట్లో పాములా మెలికలు తిరిగిన కనిపించని ఊరును చూసింది.... కన్నతండ్రిని, కట్టుకున్నవాన్ని కసితీరా తిట్టింది ... తనను మనిషిగా చూసిన మనిషి - తను నడిమందిలో అవ మాన పరిచినాకూడా అది మనసులో ఉంచుకోని మనిషి గోపయ్యకు సజల నేత్రా లతో మనసులో మొక్కింది.... కాలువకేసి నడిచింది. నీల అనే ఇరవై అయి దేండ్ల స్త్రీ కోట్ల స్త్రీలలాగే తన బతుకు, తన కొడుకు బతుకు అంతటితో అంతం చేసుకోవాలని నడిచింది.

* * *

చుట్టూ విస్తరించుకున్న పొలాల మధ్య ఎప్పుడో కట్టిన గుడి ఒక టున్నది. దానిచుట్టూ, సీతాఫలాల చెట్లు, ఈడుగు చెట్లు పెరిగి అడోపచ్చటి ముద్దలాగున్నది - అక్కడ పాములుంటాయని ఎవరుపోరు - 'కాముని భూతం' అక్కడ మంటలు వేస్తుందని కూడా ప్రచారం. అలాంటి గుడి పాడుబడ్డ మెట్ల మీది నుంచి అయిదుగురు మనుషులు లేచారు.

కురచగా ఉన్న మధునయ్య కాయిదపు సుట్టల్ని వరుకు కాయిదంలో సుట్టుకొని ధోవతిలో చెక్కుకొని మళ్ళీ ఏర్పడకుండా కట్టుకున్నాడు. పై నుండి యూరియా బస్తాలు అంచేసికుట్టిన "కోలాటం" వేసుకున్నాడు.

అఖరి పందనాలు తెలుపుకొని ఎటువాళ్లటు లేచిపోయారు. ఊరి వాళ్ళి ద్దరు కొంచెం తిరుగుడు దారిమీద వెళ్ళిపోయారు.

మధునయ్య చినుకులు "కోలాటంమీద వట్టర వట్టర పడుతుండగా బరుకు బరుకున శబ్దం నడుస్తుండగా కోలాటం చేస్తుండగా పొలాలగట్లమీది నుండి కాలువ గట్టెక్కాడు. వడి వడిగా నడుస్తున్నాడు.

ఎదురుగా చీకట్లో అడుగుల చప్పుడు. మధునయ్య హఠాత్తుగా ఆగిపోయి ఈవేళప్పుడు ఎవరిక్కడున్నది? ఆలోచించాడు.

నీడలాగా చీకట్లో ఆకారం వడి వడిగా వడుస్తోంది .... ఓ మెరుపు మెరిసింది.

మధునయ్య ఆ మెరుపులో ఆ ఆకారం ఒక స్త్రీదని గుర్తించాడు.

ఆ ఆకారం కాలువకేసి పరుగెత్తుతోంది. కాలువలో చేతిలోది ఏదో విసరడానికి ప్రయత్నం చేసింది. మధునయ్య మరింత ఆలస్యం చేయకుండా పరుగెత్తి ఆ ఆకారంమీద కలెబడి చేతిలో అబ్బాయిని గుంజుకున్నాడు.

"వన్నిడువు. నన్ను బతుకనియ్యకు - నీకు పున్నెముంటది - నన్ను వొదులు." ఆ ఆకారం పెనుగులాడింది.

మధునయ్య ఆ ఆకారాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

ఆ ఆకారం కాళ్ళమీదపడి ఏడుస్తోంది. మధునయ్య చేతుల్లో పిల్లవాడు ఏడుస్తున్నాడు.

మళ్ళీ మెరిసింది. ఈసారి మధునయ్య ఆ ఆకారాన్ని గుర్తించాడు.

"నువ్వా అక్కా!" మధునయ్య నీలమ్మ ఆకారాన్ని చూసి విస్తుపోయాడు.

"వన్నిడువుతమ్మీ." నీల.

"అక్కా! సచ్చేం సాధిత్తవ్ - నా బొందిలో పానముండంగ మిమ్మల సావనియ్య" మధునయ్య బలవంతంగా నీల చేయి దొరకబుచ్చుకొని ఊళ్ళోకి నడిపించాడు.

నీలమ్మ గింజుకుంటూ, ఏడుస్తూ పిచ్చిదానిలా మధునయ్య వెంట నడిచింది.

పందిరికిందికి రాగానే "ఇగో నిన్నే వన్నవా? జెరంత దీపం ముట్టియ్య" కేకేశాడు.

దీపం వెలిగింది- మధునయ్య భార్య, తల్లి పోశాని లేచివొచ్చారు.

"గిప్పుడు ఏమడుగకుండ్లి- నీరయికె ఉంటె తెచ్చియ్యి" మధునయ్య- పోశాని కోడలును అడిగి ఎవరో తెలుసుకున్నది.

"అయ్యో నీలవ్వ తల్లీ నువ్వా!" అన్నది.

నీల వోశాని మీదపడి వెక్కి వెక్కి ఏడ్చింది - కుమిలికుమిలి ఏడ్చింది- పొర్లిపొర్లి ఏడ్చింది.

"నీలవ్వా! నీ బాంచెన్ బిడ్డా! కట్టాలకు అదురుతారు తల్లీ - పుట్టెడు దెబ్బలుతిన్న భూదేవరవు తల్లీ - అందరికి, అన్నిటికి ఉదరున్నదిగానీ ఆడిదాని దుఃఖానికి ఉదరులేదు నీలా!" పోశాని ఒళ్ళంతా పునుకుతూ నీలమ్మను కడుపుల దాచుకున్నది. నీలమ్మ తను పుట్టిన దగ్గరినుండి, పుట్టి బుద్దెరిగిన కాన్నుండి అలాంటి ఆదరణ ఎరుగదు.

"కట్టాలు మనందరి బతుకుల్లో ఎప్పుడు ఉంటయి. అటిని ఎదురించాలె నమ్మా...." అన్నాడు మధునయ్య.

నీలకు గోవయ్య అన్నమాట గుర్తొచ్చింది....

ఆ తరువాత మధునయ్య, అతని భార్య వెంటరాగా నీలమ్మ మళ్ళీ ఇంటి కొచ్చింది.

మధునయ్య జబర్దస్తీగా తలుపు తట్టాడు. తలుపు తెరుచుకున్నది.

సత్యనారాయణ కక్కుకొని నేలమీద అదే కక్కులో అసహ్యంగా పడున్నాడు. అళబ్దానికి ముసలి రంగమ్మ లేచివొచ్చింది.

"ఇగో - అమాసచ్చిందని సంబర పడకుండ్లి - ఇకనుంచి నీలవ్వ సెల్లెనేమన్నా అంటే పులుసులకు బొక్క లేకుంట ఊళ్ళోల్లంత దంచుతరు. నీ దొరలే అత్తరో దాతలే అడ్డమత్తరో సూత్తం - ఏ ముసలి రంగమ్మా ? - ఈ ఊళ్లె పెండ్లాలను - మొగల్లు కొట్టే కాలంబోయింది - నీ కొడుక్కు చెప్పు" మధునయ్య.

ఆ లొల్లికి ఎన్నడూ ఆ ఇల్లు సొచ్చుకరాని ఊళ్లో వాళ్లంతా వచ్చారు.

అందరు రెచ్చిపోయి తలా ఓ తిట్టు తిట్టాడు.

"కాలో సెయ్యో ఇర్సి పారేత్తె పీడబోతది - గవాయెవడొత్తడో సూత్తం" ఎవడో మందిని తొలిగించుకొని సత్యనారాయణమీది కురికాడు. ఎవరో అతన్ని ఆపారు.

సత్యనారాయణ మత్తుగా కండ్లు విప్పిండు. అందర్ని చూసి ఉచ్చ బోసుకున్నాడు. పరుగెత్తబోయి పడిపోయాడు.

"జెర పెయిల భయముంచుకో - నిన్ను ఏ దొరలు కాపాడలేరు." మధునయ్య సత్యనారాయణ జబ్బపట్టి లేపి అన్నాడు ... సత్యనారాయణ గజ గజ లాడి పోయాడు.

"సూడుసెల్లే ఇకనుంచి నువ్వు ఊళ్ళె అందర్ల మనిషివి. ఈడు ఏకతలు సేసినా ఊరందరికి తెలుత్తది- అప్పుడు సూసుకో."

తిట్లు, దీవెనలు అయిపోయినయ్. ఎటువాళ్ళటు పోయారు.... మధునయ్య కూడా వెళ్ళిపోయాడు.

నడిరూమురాత్రి - చీకటి విండినరాత్రి - చిల్లం కల్లం అయిన ఇల్లు- తాగుబోతు, తిరుగుబోతు భర్త- నీల పందిరికింద ఖిన్నురాలై కూర్చున్నది.

నెత్తురు చెరువులోనుండి - మబ్బుల్లోని మెరుపు తునకలా ఎవరో పైకి లేస్తున్నారు.... ఆ ఆకారం నీలకు తెలియడంలేదు. ఆ ఆకారానికి కాళ్ళు, తల, ముక్కు, చెవులు లేవు. మెరుపు తీగలాగున్నది.

"నన్ను చెడ్డోనిగ చూడకు నీలా! నన్ను నీ కష్టంలో మతికుంచుకో! నన్ను మతికుంచుకోవడమంటే - మేం దేనికోసం కొట్లాడుతున్నామో దాన్ని తెలుసుకోవటం- కష్టాలను సహించి ఊకోవద్దు - కొట్లాడాలె. నాకు నీ మీదగాని, నీ భర్తమీదగాని కోపంలేదు నీలా! నువ్వు ఒంటరి దానివికాదు నీలా!"

ఆ మెరుపు తన ఒకప్పటి భర్త గోపయ్యదికాదు. గోపయ్య తనకు భర్త ఎప్పుడూకాదు. భర్తలాగా ఎప్పుడు హింసించలేదు. అతన్ని చంపేశారా?

మరేమిటి ?

తనలాంటి వాళ్ళందరిలో నిరంతరం పారే నెత్తురు .... కళ్ళకు వెలుతురు.

★

సమీక్షా వ్యాసం :

'పోరాటనవల' అంటే ఏమిటి?

ఎన్. వేణుగోపాల్

అది నిజాం పాలనలోని తెలంగాణలో ఒక దేశముఖ్ గ్రామం. పేరు ఎర్రజాలెం. అక్కడే పుట్టి పెరిగిన రామారావు బ్రిటిష్ పాలనా ప్రాంతంలో బి. ఎ. చదువుకొని స్వగ్రామం చేరుతాడు. చదువుకునే రోజుల్లో అతను 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొన్నాడు. "ప్రపంచమంతటా సాగే విముక్తి పోరాటాలను అధ్యయనం" చేశాడు. గ్రామం చేరిన వెంటనే కొందరు యువకులతో సంబంధం పెట్టుకొని వారితో పుస్తకాలు చదివిస్తుంటాడు. కొన్నాళ్ళకే ఊళ్ళోకి తహసీల్దార్ రాక సందర్భంగా జరిగిన పటాటోపం, దౌర్జన్యం అతనిలో ఆవేశాన్ని రగిలిస్తాయి. ఆ రోజే మరొకచోట అమాయకులమీద దొర గూండాల దౌర్జన్యాన్ని ఎదిరించి, దొరను నిలదీసేందుకు కదలమని ప్రజలకు పిలుపిచ్చి భంగపడతాడు.

పటేలు దౌర్జన్యాన్ని కొంతవరకు చవి చూసిన సత్యంతో రామారావుకు పరిచయమవుతుంది. అప్పటికే ప్రజాశక్తి పాఠకుడిగా, కమ్యూనిస్టు రాజకీయాల అభిమానిగా ఉన్న సత్యం, రామారావు కలిసి గ్రామ ప్రజలను ఐక్యం చేస్తారు. ఈలోగా దొరవారి కూతుర్ని అత్తవారింటికి పంపేందుకు జనం పన్నులు చెల్లించాలని ఆదేశాలందుతాయి. సంఘం నిర్ణయంతో గ్రామంలో సభ జరుగుతుంది. సభను చెడగొట్టడానికి ప్రయత్నించి విఫలమైన దొర గూండాలు రామారావును గాయ పరుస్తారు. సభ మాత్రం విజయవంతంగా జరిగి ప్రజలలో ఉత్తేజాన్ని నింపుతుంది.

సంఘం గ్రామంలో క్రమ క్రమంగా ప్రబల శక్తిగా రూపొందడం మొదలవుతుంది. సంఘాన్ని, నాయకులను అణచివేయడానికి దొర, తాబేదార్ల మంతనాలు మొదలెడతారు. సంఘ నిర్మాణ క్రమంలో సాంఘిక అసమానతలు కూడ తుడిచి పెట్టుకుపోతుంటాయి. యువజన పాఠశాల నడుస్తుంటుంది. రామారావు, సత్యం అధ్యక్ష, కార్యదర్శులుగా ఆంధ్ర మహాసభ గ్రామ కమిటీ ఏర్పాటవుతుంది.

ముస్లిం మతస్థుడైన చట్టుబండ జాగీర్దార్‌ను పిలిపించి, ముస్లింలలో మత భావనలు రెచ్చగొట్టి వారిని సంఘం నుంచి దూరం చేయాలనుకున్న దొర ప్రయత్నాలు విఫలమవుతాయి.

ప్రజలకు ప్రభుత్వ శిస్తుల గురించి వివరిస్తూ, దొర, పటేల్, పట్వారీల అక్రమ వసూళ్ళకు సంగం గండి కొడుతుంది. ఆ దశలో పోలీసులు గ్రామంలో ప్రవేశించి రామారావును అరెస్టు చేసి పట్టుకుపోతారు. ఆయనకు బెయిల్ ప్రయత్నించేందుకు వెళ్ళిన సత్యాన్నీ, అజాద్‌నూ కూడ అరెస్టు చేసి పోలీసులు భయంకరమైన చిత్రహింసలకు గురిచేస్తారు. ఈ ముగ్గురినీ పోలీసుస్టేషన్ నుంచి తప్పించి, పెద్ద ఎత్తున చికిత్స ఇప్పించడంతో ఎర్రబాలెం ఘటనలు విస్తృత ప్రచారం పొందుతాయి.

నాయకుల అరెస్టుతో గ్రామంలో ఏర్పడ్డ స్తబ్దతను తొలగించడానికి జిల్లా నాయకుడు ప్రతాప్ స్వయంగా గ్రామానికి చేరతాడు. గ్రామంలో మళ్ళీ ఊరేగింపు, సభ జరిగి జనంలో ఉత్సాహం నింపుతాయి. దొర అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని ప్రజలు దున్నడం మొదలెడతారు. వారి మీద దొర గూండాలు దాడిచేసి వారి ధాటికి తట్టుకోలేక వెనుదిరుగుతారు. గ్రామం మీద పోలీసులు దాడి చేసి రామారావు ఇంటినీ, సత్యం ఇంటినీ చిందర వందర జేస్తారు. ఆ రోజే జరిగిన మరొక ఘర్షణలో దొర తుపాకి సంగం చేజిక్కుతుంది గ్రామంలో మహిళా సంఘం, రక్షణ దళం, బాల దళం నిర్మాణమవుతాయి.

కమ్యూనిస్టు పార్టీ రామారావునూ, సత్యంనూ సభ్యులుగా చేర్చుకుంటుంది. అరెస్టు వారెంట్లు జారీ కావడంతో వాళ్ళిద్దరూ అస్పత్రి నుంచే అజ్ఞాతవాసానికి వెళతారు. అజాద్‌ను మరొకచోటికి చికిత్సకు పంపుతారు. రామారావు, సత్యం రహస్యంగా గ్రామం చేరుకుని సంగానికి ధైర్యాన్నందిస్తారు.

నాయకులు ఆస్పత్రి నుంచి తప్పించుకున్నారని తెలిసి, వాళ్ళు ఎర్రబాలెమే చేరి ఉంటారని ఊహించి, పోలీసులు గ్రామం మీద మళ్ళీ విరుచుకు పడతారు. రామారావు, సత్యం రహస్యంగానే ప్రజలకు అందగా ఉంటారు.

మళ్ళీ ఒకసారి శత్రువు పెద్ద ఎత్తున గ్రామం మీద దాడి చేయబోతున్నా

డని తెలిసి సంగం సిద్ధపడుతుంది. గడీకీ గ్రామానికీ మధ్యన పోలీసులూ రజా కార్లూ ఒకవైపునా, సంగం మరో వైపునా నిలిచి ఎదురు బొదురు కాల్పులు జరుగు తాయి. ఇటువైపు కొమురయ్య, అలివేలు, అటువైపు ఒక పోలీసు చనిపోతారు. గ్రామంలో యుద్ధ వాతావరణం నెలకొంటుంది. మొదటి దాడివల్ల రెట్టించిన కసితో పోలీసులు, రజాకార్లు మళ్ళీ దాడి చేసి ఇద్దరు కాపలా కామ్రేడ్స్‌ను కాల్చి చంపి గ్రామంలోకి ప్రవేశిస్తారు. ప్రజలందరినీ గడీకి తోలుకుపోయి కట్టేస్తారు. అక్కడ జరిగిన క్రూర దమనకాండలో రామారావు తల్లి శాంతమ్మ, సత్యం అత్త సీతమ్మ, పెంటయ్య, రామస్వామి చనిపోతారు.

ఈ దశలో బ్రిటిష్ ఇండియా నుంచి బ్రిటిష్‌వాడు వెళ్ళిపోతాడు. పోరాటం కొత్త దశలోకి మారవలసిన అవసరాన్ని నాయకత్వం గుర్తిస్తుంది. ఈ క్రమంలోనే చట్టుబండ జాగీర్దార్ గడీమీద ప్రజా ప్రభంజనం దండెత్తి గడీని నేలమట్టం చేస్తుంది. దళాన్ని మోసంతో పోలీసులకు పట్టించజూసిన సింగారం దొర పన్నాగం విఫలమవుతుంది. దాడిచేసి గడీలో తల దాచుకున్న పోలీసుల మీద, గడీమీద దళం విరుచుకుపడి మంటలతో ఊదర పెడుతుంది. చివరికి ఎర్రబాలెం గడీమీద కూడ ప్రజలు దాడి చేస్తారు. పోరాటం ఇంకా ముమ్ముందుకు సాగుతుం టుంది. రామారావు తన మేనమామ కూతురు పద్మను, సామ్రాజ్యం జిల్లా నాయకుడు ప్రతాప్‌ను, ఆజాద్ తన మేవత్త కూతురు జాన్‌బీని, అలివేలు కూతురు శత్తాలు వీరయ్యను పెళ్ళి చేసుకుంటారు. పెళ్ళిళ్ళు జరుగుతుండగానే హైదరాబాద్ సంస్థానం మీదికి కాంగ్రెస్ సైన్యాలు తరలి వస్తుంటాయి. ప్రమాదం మరో రూపంలో వస్తున్నదనీ, దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలనీ నాయకులు పిలుపిస్తారు....

తిరునగరి రామాంజనేయులు నవల 'సంగం' కథ ఇది. నిజానికి అంతగా చెప్పుకోవడానికేమీ లేని నవలగా ఈ నవలను విస్మరించవచ్చు. కాని, మూడు కారణాలవల్ల దీన్ని వివరంగా చర్చించవలసి ఉంది. ఒకటి, దీన్ని అనుభ వజ్ఞుడు, తెలంగాణ పోరాట, సాంస్కృతిక సైనికుడు తిరునగరి రాశారు. రెండు, దీన్ని జన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ప్రచురించింది. మూడు, ఇది "తెలం గాణా పోరాట నవల" అనే కితాబు తగిలించుకుని వచ్చింది. ఈ కారణాల వల్ల అసలు పోరాట నవల అంటే ఏమిటో చర్చించవలసిన అవసరం ముందుకొచ్చింది.

చైతన్యవంతమైన సాహిత్యం అంటే ఏ సమాజంలోనైనా ఆ సమాజ జీవనాన్నీ, జీవన సంఘర్షణను ప్రతిఫలించేదే. సమాజ జీవనం అప్పుడప్పుడు గుణాత్మకమైన మార్పులు లేకుండా ఉంటుంది. సంచలనం, కల్లోలం లేకుండా ఉన్నట్టనిపిస్తుంది. దీన్ని సాపేక్షిక నిశ్చలస్థితి అంటారు. ఇలాంటి సమయంలో వెలువడే సాహిత్యం ఆ సమాజ చలనాన్ని పెద్దగా పట్టుకోలేక పోవచ్చును. కాని పోరాట కాలంలో, జనజీవన సంఘర్షణా కాలంలో వచ్చే సాహిత్యం ఆ సమాజ చలనాన్ని నిశితంగా పట్టుకుంటుంది. సమగ్రంగా చిత్రించడానికి ప్రయత్నిస్తుంది. అందులో వైవిధ్యం ఉంటుంది. ఉద్వేగపూరిత ప్రతిఫలనం ఉంటుంది.

ఐతే చైతన్యవంతులు కాని రచయితల సాహిత్యంలో కూడ, చైతన్యవంత మైనదని చెప్పడానికి వీలులేని సాహిత్యంలో కూడ సమాజ చలనం ఎంతో కొంత చిత్రణ పొందుతుంది. ఇందుకు కారణమేమంటే, ఆ రచయితల మీద, వాళ్ళు ఎంచుకునే విషయాల మీద అప్రయత్నంగా, అనుద్దేశ్య పూరితంగా సమాజ చలనం ప్రభావం వేస్తుంది.

అట్లాగే సమాజ చలనం వేగంగా సాగుతున్న సమయంలో దానికి విలువ, గౌరవం వస్తాయి. అది కూడ అమ్మకపు సరుకుగా మారుతుంది. ఈ సరుకునూ అమ్ముకునే వ్యాపార సాహిత్యం కూడ అంతకంతకూ ఎక్కువగానే వస్తుంది.

మరోరకం సాహిత్యంలో అన్ని మంచి గుణాలూ ఉన్న నాయకుడు, నాయిక, అన్ని చెడు గుణాలూ ఉన్న ప్రతినాయకుడు చట్రంలోనే కథంతా నడుస్తుంది. అక్కడక్కడ మాత్రం పోరాటాన్ని చిత్రిస్తున్నారేమో అని భ్రమ కలిగించే కొన్ని సంభాషణలుంటాయి. దీన్ని అవకాశవాద సాహిత్యం అనవచ్చు.

ఇక్కడ చెప్పిన నాలుగు రకాల సాహిత్యాలూ - చైతన్యవంతమైన సాహిత్యం, అప్రయత్నంగా చైతన్యాన్ని ప్రతిఫలించే సాహిత్యం, వ్యాపార సాహిత్యం, అవకాశవాద సాహిత్యం - కూడ తరతమ భేదాలతో సమాజ చలనాన్నే పట్టుకుంటున్నాయి. ఈ ప్రతిఫలనం వాస్తవికమా, వక్రీకరణా, అది ఏ ప్రయోజనాల కోసం అనే ప్రశ్నను పక్కన పెడితే, ఈ నాలుగు రకాల సాహిత్యాలకూ వస్తువు సమాజ చలనమే, పోరాటమే. మరి వీటన్నిటినీ "పోరాట

సాహిత్యం" అనవచ్చునా ? అనడానికి వీల్లేదని ఎవరైనా చెప్పగలరు. అందు వల్లనే పోరాట సాహిత్యమంటే ఏమిటో, ప్రస్తుత సందర్భంలో పోరాట నవలంటే ఏమిటో నిర్వచించుకోవలసి ఉన్నది.

ఈ ప్రయత్నంలో, మొదట పోరాట నవల స్వరూపాన్నీ, స్వభావాన్నీ అర్థం చేసుకోవాలి. తద్వారా మనం పోరాట నవలకు గల కొన్ని సాధారణ, సార్వత్రిక లక్షణాలను కనిపెట్ట గలుగుతాం. అప్పుడు 'సంగం'ను విశ్లేషించి దాని ప్రత్యేక, విశిష్ట లక్షణాల్ని గుర్తించాలి. 'పోరాటనవల' సాధారణ, సార్వత్రిక లక్షణాలకూ, 'సంగం' ప్రత్యేక, విశిష్ట లక్షణాలకూ పోలికనూ, తేడానూ అంచనా కట్టాలి. అప్పుడు మాత్రమే సంగంను పోరాట నవల అని పిలువడం సరైనదో కాదో తేలుతుంది.

పోరాట నవల అనే మాటలోనే అది పోరాటాన్ని చిత్రించాలనీ, నవలగా ఉండాలనీ అర్థమవుతున్నది. ఈ రెండు పనులూ దాని మౌలిక లక్ష్యాలు.

పోరాటాన్ని చిత్రించడమంటే ఏమిటి ?

సమాజం కొన్ని నిర్దిష్ట నియమాల ప్రకారం పురోగమిస్తున్నది. సమాజాన్ని ఒక దశ నుంచి మరో దశకు అభివృద్ధిచేసే నియమాలలో పోరాటం ఒకటి. మళ్ళీ ఈ పోరాటం కూడ కొన్ని నిర్దిష్టమైన నియమాల ప్రకారమే సాగుతుంది. ఈ చలన నియమాలు, చలనం చైతన్య రూపాలద్వారా - అంటే భాష, ఆలోచన, కళలు, సాహిత్యం, సిద్ధాంతంవంటి వాటిద్వారా - వెలికి వస్తాయి. ప్రతిభావంతులైన రచయితలు - అంటే ప్రజా జీవనాన్ని నిశితంగా పరిశీలించే రచయితలు - అసంకల్పితంగా కూడ ఈ చలన నియమాలను చిత్రించ గలుగుతారు. శాస్త్రీయ దృక్పథం గల రచయితలు తమ చైతన్యం వల్ల, నిబద్ధత వల్ల ఉద్దేశ్యపూర్వకంగానే ఆ చలన నియమాలను వెతికి పట్టుకుంటారు. వాటిని సాహిత్యంలో వ్యక్తీకరించే ప్రయత్నంచేస్తారు.

సమాజ చలనానికిగల నియమాలలో పోరాటం ఒకటి అని పైననే చెప్పుతున్నాం. పోరాటం అంటే స్పష్టమైన, నిశితమైన సాయుధ సంఘర్షణ మాత్రమే కానక్కరలేదు. ప్రజానీకంలో అతి స్వల్ప కదలిక నుంచి, రాజ్యాధి

కారాన్ని హస్తగతం చేసుకునే లక్ష్యంతో సాగే సంఘటిత ఉద్యమం వరకు అన్ని రకాల పోరాట రూపాలూ సమాజ చలనానికి దోహదం చేసేవే.

పోరాటానికి ఉన్న ఈ విస్తృత అర్థంలో గమనిస్తే, సమాజానికి గల అనేక చలన నియమాలు పోరాటంలో వ్యక్తీకరణ పొందుతాయి. ప్రతి ఫలిస్తుంటాయి. పోరాటాన్ని ఇంత విశాల అర్థంలో చైతన్య యుతంగా గుర్తించి, అక్షరీకరించగలిగిన రచయిత సమాజ సారాంశాన్ని సరిగా అర్థం చేసుకుంటాడు. తద్వారా సమాజ పురోగతికి తోడ్పడతాడు. ఇలా సమాజ సారాంశాన్ని గ్రహించిన రచయితకు కేవలం "సాయుధ ఘర్షణలే" వస్తువులు కావు. సమాజ సముద్రంలోని ఏ చిన్న పురోగామి కెరటమయినా ఆ రచయిత చేతిలో అద్భుతంగా, కళాత్మకంగా, చైతన్య ప్రేరకంగా మారుతుంది. ఇందుకు ప్రేమ్‌చంద్ సాహిత్యం నుంచి ఎన్నో ఉదాహరణలు చూపవచ్చు.

ఇక, సంఘటిత ఉద్యమ రూపం ధరించే పోరాట రూపానికొస్తే పైననే చెప్పినట్టు దానికి ప్రత్యేకంగా కొన్ని చలన నియమాలుంటాయి. పోరాటం అనేది నిర్దిష్ట భౌతిక పరిస్థితిలో జరుగుతుంది. దానికి కొన్ని ఖచ్చితమైన ప్రేరణలుంటాయి. దానిలో కొన్ని స్పష్టంగా గుర్తించగలిగిన శక్తుల ఆచరణ ఉంటుంది. దాని చలనం విశిష్టంగా ఉంటుంది. కనుక ఈ అర్థంలో పోరాటాన్ని అర్థం చేసుకోవడమంటే, దానికి గల చలనాన్నీ, నిర్దిష్టతనూ అర్థం చేసుకోవడమే. ఇదే సమయంలో పోరాటం అనేది విశ్వ వ్యాప్తమయిన, సాధారణమైన అంశమని కూడ గుర్తించాలి. ఒక భావనగా చూసినప్పుడు అది అమూర్తమైన అంశం కూడ. కనుక పోరాటాన్ని అర్థం చేసుకోవాలన్నా, చిత్రించాలన్నా ఏక కాలంలో దాని సాధారణత్వాన్ని- ప్రత్యేకత్వాన్ని, విశ్వ వ్యాప్తతను-విశిష్టతను, అమూర్తతను-నిర్దిష్టతను అర్థం చేసుకోవాలి. ఈ తాత్విక పరిభాషను మామూలు మాటల్లో చెప్పాలంటే ప్రపంచమంతటా సాగే వర్గ పోరాటాన్ని మనం ఒక కచ్చితమైన స్థలంలో, కాలంలో చూస్తున్నామని అర్థం చేసుకోవాలి. ఆ పోరాటానికి ప్రత్యేకమైన ఆర్థిక సంబంధాలున్నాయని, భూగోళం ఉందని, చరిత్ర ఉందని, రాజకీయాలున్నాయని, సంస్కృతి ఉందని గుర్తించాలి. మరో మాటల్లో చెప్పాలంటే పోరాటం అన్ని చోట్లా జరిగేదే గాని, ప్రతి పోరాటానికి కూడ సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, పరిస

రాలు, కాలక్రమం, పోరాటంలో వివిధ శక్తుల భాగస్వామ్యం, వాటి ప్రయోజనాలు, పోరాట నాయకత్వం, నాయకత్వపు చిత్తశుద్ధి, జ్ఞానం, పోరాటాన్ని వ్యతిరేకించే శక్తులు, పోరాట ప్రాంతపు భాషా సంస్కృతులు వేరు వేరుగా ఉంటాయి.

ఇవన్నీ ఎప్పటికప్పుడు అసంకల్పిత ప్రభావంగా గాని, చైతన్యయుత జ్ఞానంగా గాని మారుతుంటాయి. పోరాట ప్రాంతంలోని ప్రజానీకంమీద, పోరాటంలో పాల్గొంటున్న వాళ్ళమీద పోరాట నాయకత్వం మీద, శత్రువర్గాల మీద వీటి ప్రభావం ఉంటుంది. దాని ఫలితంగా వీళ్ళందరి ఆచరణలోనూ కలిగే మార్పులు మళ్ళీ పైన చెప్పిన అన్ని అంశాలనూ ప్రభావితం చేస్తుంటాయి.

పోరాటాన్ని అర్థం చేసుకోవడమంటే ఈ అన్ని అంశాలను గతితార్కిక సంబంధంలో అర్థం చేసుకోవడం. అంటే ఆయా అంశాలను విడివిడిగా అర్థం చేసుకోగూడదు. యాంత్రికంగా కార్య కారణ సంబంధాన్ని వెతకగూడదు. ఏకేశ్వరోపాసనలాగ ఏదో ఒక అంశాన్నే పట్టుకుని వేలాడగూడదు. అట్లని ఆ అంశాలన్నిటినీ ప్రాధాన్యతలూ, అప్రాధాన్యతలూ లేని ఏకశిలా సదృశమైన ముద్దగా చూడగూడదు. వాటిలో ఏది ప్రధానమైనది, ఏది ప్రధానమైనదికాదు అనే దృష్టితో గుర్తించాలి, విశ్లేషణలో సులువు కోసం వాటిని విడి విడిగా పరిశీలించ వచ్చును. కాని మళ్ళీ వాటన్నిటినీ కలిపి, వాటి అన్యోన్య సంబంధంలో, సజీవ సంబంధంలో, చలనంలో అర్థం చేసుకోవాలి. ఆయా అంశాలు విడివిడిగా లేవు అంటున్నామంటేనే వాటి గతం, వర్తమానం, భవిష్యత్తుల మధ్య సరిగ్గా గీతగీసి వేరు చేయలేమని అర్థం. వాటి గతంలో, వర్తమానంలో, భవిష్యత్తులో ప్రతిఒక్క చర్యకూ ఒక ప్రత్యేక లక్ష్యం ఉంటుంది. ఆ చర్యలన్నీ ఒక ఎడతెగని ప్రవాహంలో భాగంగా ఉంటాయి. గతి తార్కిక దృక్పథంలో ఈ ప్రత్యేక లక్ష్యాన్ని వెతికి పట్టుకోవాలి. విశ్లేషణ, నిర్ధారణల క్రమం మనను ఎంతదూరం తీసుకుపోయి నప్పటికీ ఈ లక్ష్యాన్ని, అది ఒక ప్రవాహంలో భాగమనే విషయాన్ని మరిచిపోగూడదు.

ఈ దృక్పథాన్ని అలవరచుకున్నప్పుడు మాత్రమే పోరాటాన్ని దాని రక్త మాంసాలతో చిత్రించగలం. ఆ చిత్రణ ఏ ప్రక్రియ కిందికైనా రావచ్చు. కాని ఆ ప్రక్రియకు "పోరాట" అనే విశేషణం చేర్చాలంటే మాత్రం ఆ చిత్రీకరణ పైన చెప్పిన పోరాట చలన నియమాల్ని గుర్తించాలి. ఆ గుర్తింపును

గతి తార్కిక దృక్పథంతో సాన పెట్టుకోవాలి. అది కళారూపంలో ఆవిష్కరణ పొంది ఉండాలి.

కళా రూపంలో, ముఖ్యంగా నవలా రూపంలో ఆవిష్కరణ అనగానే నాయకుడు - నాయిక - ప్రతినాయకుడు చట్రం ఉండాలా లేదా అని సమస్య వస్తుంది. నిజానికిది అనవసరమైన చర్చ. కాని "మార్క్సిస్టు సాహిత్యంలో మనుషులు ఉండరని, ఉన్నా వాళ్ళు మరబొమ్మల్లాగ ఉంటారని, మొత్తం మీద మార్క్సిజం మనుషుల్ని అనుభూతులు లేని యంత్రాల స్థాయికి దిగజారుస్తుంద"ని విమర్శించే వాళ్ళకు ఇదే ప్రధానమైన చర్చ అవుతుంది. ఈ విమర్శకు లొంగి గానీ, సాధారణ నవలా సాంప్రదాయాన్ని ధిక్కరించలేక గానీ "మార్క్సిస్టు" నవలా కారులు కూడ తమ నవలలను నాయకుడు - నాయిక - ప్రతి నాయకుడు చట్రంలో రాస్తున్నారు.

మనం పోరాటాన్ని నిర్దిష్టంగా చూస్తున్నాం అన్నప్పుడే మన చిత్రణలో రక్తమాంసాల సజీవ మానవులుంటారని, ఉండాలని మనం ఒప్పుకుంటున్నాం. అప్పుడు వాళ్ళు నాయికా నాయకులే కానక్కరలేదు, కానూ వచ్చును. అది అంత ముఖ్యమైన విషయం కాదు. పోరాట సారాంశాన్ని, సమాజ సారాంశాన్ని అవగాహన చేసుకుని, ఆ సారాంశం వివిధ వ్యక్తుల జీవితాలలో ఏయే రూపాలలో వెలువడుతున్నదో చిత్రించడమే ముఖ్యమైన విషయం. ఆ సారాంశం నాయికా నాయకుల చట్రంలోనే వెలువడుతుందనే నిబంధన ఏమీలేదు. ఐతే నవలా ప్రక్రియ అవసరం కోసం కొందరు వ్యక్తులనే ఎంచుకుంటాం. వాళ్ళ జీవితాలలో ఆ సారాంశం పొందే వ్యక్తీకరణనే ప్రధానంగా చిత్రిస్తాం. అట్లాంటప్పుడు ఆ వ్యక్తులు సాంప్రదాయిక అర్థంలో నాయికా నాయకులు కారు. (పావెల్‌ను నాయకుడు అని అననూవచ్చు, అనకుండానూ ఉండవచ్చు! అట్లాగే కన్యాశుల్కంలో నాయికా నాయకులెవరు?)

ఇక నవల రూపం విషయానికొస్తే, అది అనేక మార్పులకు గురైనా, దాన్ని ఇతర ప్రక్రియల నుంచి వేరు చేసే ప్రధాన లక్షణాలు కొన్నున్నాయి. కొన్ని సంఘటనల కూడికే నవల కాదు. కేవలం సాగదీయడం వల్ల కథను నవలగా మార్చలేం. నవల ముఖ్యంగా జీవిత భాగాన్ని, జీవిత పరిణామాన్ని

చిత్రిస్తుంది. తద్వారా అది సమాజ పరిణామాన్ని కూడ చిత్రిస్తుంది. నవలలో సంఘపు వాతావరణం పటిష్టంగా ఉంటుంది. నవలలో యథార్థ జీవిత వాతావరణాన్ని చిత్రించడం అవసరం, మారుమూల, ఏకాకి సంఘటనలు చిత్రించడం ఉపయోగకరం కాదు.

పోరాటం గురించి, నవల గురించి ఈ అవగాహనల దృష్ట్యా 'సంగం'ను పరిశీలించాలి. మొట్టమొదట, తెలంగాణ విమోచనోద్యమ చలన నియమాలను పట్టుకోవడంలో, చిత్రించడంలో 'సంగం' అతి తక్కువ చోట్ల విజయం సాధించింది.

'సంగం'లో ఎర్రబాలెం, చట్టుబండ, సింగారం అనే మూడు ఊళ్ళ పేర్లు, మునేరు ప్రస్తావన తప్ప స్థలం గురించి ఇతర వివరాలేమీ లేవు. కథా స్థలాన్ని స్పష్టంగా చెప్పినా చెప్పకపోయినా దృష్టిలో ఉంచుకోవడం రచయితకు చాలా అవసరం. ఎందువల్లనంటే తాను రాస్తున్న నవల వాస్తవంతో సంబంధం లేని ఊహ కాదు. ఒక నిర్దిష్ట సామాజిక చరిత్రకు నవలా రూపం. అటువంటప్పుడు ఆ చరిత్రకు భూమికలైన స్థల కాలాలు, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, సంస్కృతి సరిపోయేలా ఉండాలి. సామాజిక, ఆర్థిక పరిస్థితులలోను, సంస్కృతిలోను, పోరాట దశలలోను ఒక తాలూకాకు, మరో తాలూకాకు కూడ మార్పులుండే అవకాశం ఉంది. అంతేగాక తెలంగాణ విమోచనోద్యమ క్రమంలో కూడ పోరాటం అన్ని చోట్లా ఎప్పుడూ ఒకే రకంగా లేదు. 1922లో హైదరాబాద్‌లో ఆంధ్రజన సంఘం ఏర్పడ్డ నాటినుంచి, 1948-51 మధ్య అటు అమరాబాద్ అరణ్యాలలోకి, ఇటు పాల్వంచ ప్రాంతానికి దళాలు విస్తరించే దాకా ఏ స్థలానికి ఆ స్థలానికే ప్రత్యేకమైన కాలక్రమం (క్రానాలజీ) ఉంది. స్థలాన్ని దృష్టిలో పెట్టుకోవడం ఇందుకే అవసరం.

ఇక కాలం విషయానికొస్తే క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్యం, యూనియన్ సైన్యాల రాక వంటి కచ్చితమైన కాలం ఉన్న సంఘటనల ద్వారా కాలాన్ని గుర్తించవలసిందే తప్ప రచయిత స్పష్టంగా ఎక్కడా చెప్పలేదు. నవల మొదలైన కొద్దిరోజులకే రాబోయే శ్రావణమాసం ప్రస్తావన, పోరాటం మీద పెద్ద ఎత్తున దాడి వంటి ఆధారాల ద్వారా నవలాకాలాన్ని కనిపెట్టవలసి వస్తున్నది.

(ఐనా ఈ ఆధారాలే ఒకటి రెండుచోట్ల ఖండించుకుంటున్నాయి గాని దాన్ని పట్టించు కోనక్కరలేదు) బహుశా నవల ఆషాఢంలో మొదలై ఉండాలి. ఇది 1945 ఆషాఢం గానీ, 1946 ఆషాఢంగానీ అయి ఉండాలి. అంటే నవల 1945 జూన్-జూలై లోనో, 1946 జూన్-జూలై లోనో మొదలై 1948 సెప్టెంబర్ 13న ముగుస్తుంది (నవల ప్రారంభం 1946 జూన్-జూలై కావడానికే ఎక్కువ అవకాశాలున్నాయి.) ఈ రెండున్నర సంవత్సరాల పోరాట క్రమంలోని ప్రధాన ఘటనలు గానీ, దశలు గానీ, ముఖ్యమైన మలుపులు గానీ నవలలోకి రాకపోవడం ఒక లోపం. 1942-43 నుంచి 1948 సెప్టెంబర్ దాకా పోరాట ప్రాంతమంతటా జరిగిన అన్ని దశలూ ఒక్క గ్రామంలోనే ఈ రెండున్నరేళ్ళలోనే చూపాలనుకోవడం మరో లోపం. స్థలం చెప్పి ప్రస్తావించిన ఒక్క ఘటనా తప్పుగా చిత్రణ పొందింది. 27వ పేజీలో "జనగామ తాలూకాలో కడివెంది లంబాడీ రైతుల పోరాటం జనానికి బాట జూపుతుంది" అని సత్యం చెప్పిన వాక్యం ఉంది. కడివెందిలో జరిగింది ప్రధానంగా లంబాడీ రైతుల పోరాటం కాదు. లంబాడీ రైతుల పోరాటాలు జరిగింది మొండ్రాయి, ధర్మాపురంలలో. ఈ రెండు సంఘటనలు కూడ 1946 జూలై 4కు ముందువి.

నవల ప్రధానంగా నడిచిన ఎర్రబాలెం గ్రామంలో ఆర్థిక వ్యవస్థ గురించి, భూ సంబంధాల గురించి నవల ద్వారా మనకేమీ అర్థంకాదు. దేశముఖ్ కూడా అయిన దొర అక్రమంగా ఆక్రమించుకున్న ఒక ఆరెకరాల భూమి గురించి మాత్రమే ప్రస్తావన ఉంది, కాని అప్పుడు దొరలు ఆక్రమించుకున్న భూమి వేలాది ఎకరాలు. ఒక్క గ్రామం పరకే తీసుకున్నా వందల ఎకరాలు. మొత్తం పోరాటానికే భూ సమస్య కేంద్రంగా ఉండింది.

మొత్తంమీద నవల సమర్థవంతంగానూ, వివరంగానూ చిత్రించినది ఒక్క వెట్టి చాకిరీ మాత్రమే. పన్నుల గురించి కూడ వివరమైన చిత్రణే ఉంది. కాని దండుగలు, పంచాయతులు వంటి సామాజిక పీడనా రూపాలుగాని, కౌల్దారీ సమస్యగానీ నవలలోకి రానేలేదు.

ఇక నవలలో పోరాటం పొందిన గుణాత్మక మార్పులు చాల నాటకీయంగా, అసంబద్ధంగా కనబడతాయి, గుణాత్మక మార్పు ఆకస్మికమైనదనే మాట

నిజమే గాని అది చాల సహజమైనది, అనివార్యమైనది. సర్వ సాధారణంగా వ్యాఖ్యాతకు ఈ సహజత్వం, అనివార్యత అర్థం కానప్పుడే ఆ మార్పు నాటకీయంగా చిత్రణ పొందుతుంది.

పోరాటంలో వివిధ శక్తుల భాగస్వామ్యాన్ని చిత్రించేటప్పుడు రచయితకు, మతం, కులం వంటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వర్గీకరణలు వేసే ప్రభావం దృష్టిలో ఉండాలి. ఆయా శక్తుల ప్రయోజనాలు, ఆ ప్రయోజనాల పట్ల జాగ్రత్తగా వ్యవహరిస్తూ, ఐక్యతను పటిష్టం చేస్తూ, పోరాటాన్ని ముందుకు తీసుకు పోగల నాయకత్వం వంటి అంశాలను రచయిత గుర్తించ గలగాలి. ఏ పోరాటంలోనైనా ఆ పోరాటపు బలానికీ, బలహీనతకూ కారణమయ్యే అంశాలలో ఇవి ముఖ్యమైనవి. నిజానికి తెలంగాణ విమోచనోద్యమం ఎదుర్కొన్న సమస్యలలో ఈ అంశం చాల ముఖ్యమైనది. 'సంగం' రచయిత ఈ అంశాన్ని అత్యంత అజాగ్రత్తగా, ఐతే మూస పద్ధతిలోనో, కాకపోతే ఏ పట్టూ లేకుండానో రాశారు.

తెలంగాణ విమోచనోద్యమ కాలంలో ఆచరణలో అద్భుతంగా ప్రదర్శితమైన హిందూ-ముస్లిం పీడితుల ఐక్యత పట్ల అది "మత సామరస్యం" అనే తప్పుడు అవగాహన చాలమందిలో ఉంది. ఆ కాలంలో పీడితులు ఏ మతానికి చెందిన వారయినా, ఐక్యంగా, సంఘటితంగా పీడకుల మీదికి తిరగబడ్డారు. ఈ మత రహిత పీడిత ఐక్యతకూ, మత సామరస్యానికీ ఏ సంబంధమూ లేదు. అంతేగాక అవి రెండూ విభిన్న దృక్పథాలు కూడ. మతరహిత పీడిత ఐక్యతలో మతానికి ఏ స్థానమూ ఉండదు. ప్రతికూల ప్రభావం ఉండదు. మత సామరస్యంలో మత భావన, మత స్పృహ, మత చైతన్యం ఉండడానికి అభ్యంతరం లేదు. అవి ఉంచుకుంటూనే, "పరాయి మతం" అనే అవగాహన కూడ ఉంటూనే ఆ "పరాయి మతం"తో సామరస్యం ఉంటుంది. అంటే మతరహిత పీడిత ఐక్యత మతం పట్ల పోరాట శక్తుల దృక్పథం, అభివృద్ధికర దృక్పథం. కాగా మత సామరస్యం భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న పచ్చి అభివృద్ధి నిరోధక, దోపిడీ పాలక వర్గాల మత దృక్పథం. ఇది మతాలన్నిటినీ గుర్తించి, వాటికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలనే దృక్పథమే తప్ప, మతాన్ని రద్దు చేయాలనే దృక్పథం కాదు. ఈ పద్ధతిలో ఏ విషయానికయినా ఒక హిందూ, ఒక ముస్లిం, ఒక క్రైస్తవ

(ఇప్పుడిప్పుడు ఒక సిక్కు!) దృక్పథాన్ని అమరుస్తారు. సరిగ్గా ఇదే పద్ధతిలో రామాంజనేయులు "సంగం"లో హిందూ-ముస్లిం-క్రైస్తవ ఐక్యతను అమర్చారు. (ఇప్పుడు నేను కచ్చితంగా వివరాలివ్వలేనుగాని, 1940 దశకంలో తెలంగాణలో ఇంత మారుమూల గ్రామాలలో క్రైస్తవులున్నారనేది అనుమానమే. నిజాం పాలనలో ఎక్కువగా జరిగిన మతాంతరీకరణ హిందువుల నుంచి ముస్లింలకేగాని, క్రైస్తవులకు కాదు. పట్టణ ప్రాంతాలలో తప్ప. గ్రామాలలో క్రైస్తవులున్నారనేది నమ్మ శక్యంగా లేదు.)

అట్లాగే నవల 1980 లలో రాస్తున్న ప్రభావం మరొకచోట కూడ కనబడుతుంది. రామారావు "బాబాలు, అమ్మల" ప్రస్తావన తెస్తాడు. (పే. 25) 1940లలో అమ్మలు (గ్రామ దేవతలయిన అవ్వలు వేరు) అసలు లేరు. బహుశా షిర్డి సాయిబాబా మాత్రం ఉన్నాడనుకుంటాను. 1940ల సామాజిక చరిత్రకు నవలా రూపం ఇవ్వదలచుకున్న రచయిత ఈ మాత్రం జాగ్రత్త వహించకపోతే ఎలా?

పోరాటాన్ని వ్యతిరేకించే శక్తులను చిత్రించడంలో కూడ రచయిత అజాగ్రత్త కనబడుతుంది. దొరకూ ప్రజలకూ మధ్య, యజమానులకూ కార్మికులకూ మధ్య దళారులుగా ఉండే వారిని బఫూన్‌లుగా చిత్రించడం, లేదా వారినే ప్రధాన దోపిడీ దారులుగా చిత్రించడం విప్లవేతర సాహిత్యానికీ, సినిమాకూ చాల అలవాటయింది. 'సంగం'లో పటేల్, పట్వారీల చిత్రణలో కూడ ఈ రెండు ప్రభావాలు కనబడుతున్నాయి. పోరాటాన్ని వ్యతిరేకించే శక్తులు కూడ ఉబుసు పోకకో, సరదాకో, ఆ పని చేస్తూ ఉండవు. అవి బుద్ధిపూర్వకంగానే, తమ ప్రయోజనాల రక్షణకోసం, కొనసాగింపు కోసం పోరాటాన్ని వ్యతిరేకిస్తుంటాయి. వర్గ పోరాటం పీడిత వర్గాల శ్రేయస్సు కోసం ఎంత అవసరమో, అనివార్యమో, పీడక వర్గాలకు కూడ తమ ప్రయోజనాలు కాపాడుకునే నిరుత్సాహ పూరితమైన చివరి ప్రయత్నంగా అంతే అవసరం. వర్గ పోరాటం ఇరుపక్షాలకూ చావో బతుకో తేల్చే పోరాటమే. వర్గ పోరాటంలో విదూషకులకు స్థానంలేదు. విదూషకుల్ని చిత్రించడం వర్గపోరాట స్వభావాన్ని నీరుగార్చడానికే.

అట్లాగే రౌడీలు, పోలీసులు, రజాకార్లు వంటి దొరల మనుషులను చిత్రించేటప్పుడు వాళ్ళ చర్యల ద్వారా కన్న వాళ్ళ వేషభాషల ద్వారా, మేకప్ ద్వారా వాళ్ళను క్రూరంగా చూపెట్టే పద్ధతి ఒకటి నాటకాల్లోనూ, సాహిత్యంలోనూ ఉంది. ఈ పుస్తకం కూడ ఆ సాంప్రదాయాన్ని పాటించింది. కాని క్రౌర్యానికీ, వేష భాషలకూ ఏమీ సంబంధం ఉండనవసరంలేదు. ఇలా వేషభాషల ద్వారా స్వభావాన్ని చూపెట్టే పద్ధతి దృశ్యరూపాలకు అవసరం కావచ్చుగాని, లిఖిత సాహిత్యానికి అనవసరం. అందువల్ల ఆ చిత్రణ చాలా చౌకబారుగా కనబడు తుంది కూడ.

భాషా సంస్కృతులలో మాండలిక భాష పెట్టడం తనవల్ల కాలేదని రచయితే చెప్పుకున్నారు. అటువంటప్పుడు అక్కడక్కడనైనా తాను మాండలికం అని అనుకున్నదాన్ని పెట్టకుండా ఉంటే బావుండేది. ముఖ్యంగా క్రియాపదాల చివరల్లో తెలంగాణ మాండలికమనుకొని ఆయన చేసిన ప్రయోగాలు చాలా ఘోరంగా ఉన్నాయి. చేయుట, చూచుట అనే క్రియా పదాలు చెయ్యండి, చెయ్యండ్రి, చెయ్యిండ్రి, చెయ్యిన్రి, చెయ్యిరి, చెయ్యండ్లి, చెయ్యుండ్లి, చెయ్యున్రి, చెయ్యురి, చెయ్యిర్రి, చూడండి, చూడండ్రి, చూడుండ్రి; చూడున్రి, చూడురి, చూడుండ్లి, చూడండ్లి, చూడురి వంటి రూపాలు పొందుతాయి గాని చెయ్యురీ, చూడురీ వంటి రూపాలు పొందవు. రచయిత వాడిన ఈ రూపాలు పంటికింద రాళ్ళలా ఉన్నాయి.

ఇక ప్రక్రియా పరంగా చూస్తే "సంగం" నవల కాదు. ఎక్కువలో ఎక్కువ దాన్ని కొన్ని పరిమితులతో రిపోర్టు అని అనవచ్చును. దీనికంటె బాగున్న రిపోర్టులు కూడ ఉన్నాయి.

ముందు మాటలో జన సాహితీ సాంస్కృతిక సమాఖ్యవారు తెలంగాణ పోరాటం ఇప్పటికి అందించిన నవలలు ఆరు అని అంటూ దీన్ని మరొకటిగా చేర్చారు. బహుశా వరవరరావు విశ్లేషించిన ఆరు నవలలనే వీళ్ళు దృష్టిలో పెట్టుకొని ఉంటారు. ఆ నవలలకు అప్పటికి అమలులో ఉన్న "చారిత్రిక నవల" "రాజకీయ నవల" అనే పేర్లు సమగ్రమైనవి కావని, వాటిని "ప్రజా రాజకీయ నవలలు" అని పిలవాలని వరవరరావు ప్రతిపాదించారు. ఇప్పుడు ప్రచురణ

కర్తలు ఈ అరింటినీ పోరాట నవలలుగా గుర్తిస్తూ ఏడవ నవలను ప్రచురిస్తున్నా మన్నారు. మరి "సంగం" పోరాట నవలయినప్పుడు దాశరధి రంగాచార్య మోదుగు పూలు, జనపదం, మాయ జలతారు, గొల్లపూడి నారాయణరావు తెలుగు గడ్డ, సరిపల్లి కృష్ణారెడ్డి ఉప్పెనలు కూడ పోరాట నవలలు కాగూడదా? కిషన్ చందర్ జైత్రయాత్ర స్థానం ఎక్కడ? నిజానికి "సంగం"కు మోదుగుపూలు, తెలుగుగడ్డ, ఉప్పెనలతోనే ఎక్కువ పోలికలున్నాయి. అవి కచ్చితంగా పోరాట నవలలు కావు.

కనుక పోరాట నవల స్వరూప స్వభావాలను గురించి పైన ఇచ్చిన వివరణ ప్రకారం గాని, తెలంగాణ పోరాటం ఇప్పటికి అందించిన నవలల సాంప్రదాయం ప్రకారం గాని "సంగం" పోరాట నవల కాజాలదు. అందువల్ల ఈ పుస్తకం తనకు తాను అపాదించుకున్న గౌరవాన్ని పక్కనపెట్టి చూస్తే ఈ పుస్తకాన్ని ఎలా చూడాలి? ఇది కేవలం "పోరాటంలో నిలబడి పనిచేసిన ఒక కామ్రేడ్ అనుభవాల రాశి." ఆ అనుభవాలను యథాతథంగా గ్రహించేందుకే మనమీ పుస్తకం చదవాలి. ఇటువంటి అనుభవాల రాశు లెన్నయినా వాటికవిగా నవలలు కాలేవని, పోరాటాన్ని అవగాహన చేయించలేవని గుర్తించాలి. ఆచరణ క్రమంలో పొందిన ఇంద్రియ జ్ఞానాన్ని కొంచెం అటూ ఇటూగా యథాతథంగా ఈ పుస్తకం చిత్రించింది. ఎప్పుడైనా ఇటువంటి ఇంద్రియ జ్ఞానాన్ని హేతుబద్ధ జ్ఞానంగా అభివృద్ధి చేసుకోవాలి. దాన్ని మళ్ళీ మళ్ళీ ఆచరణ ద్వారా పదనెక్కించు కోవాలి. ఎప్పటికప్పుడు ఆచరణకు మార్గదర్శిగా మలచుకోవాలి. సరైన భావాలు ఏర్పడే క్రమం అదే. ఆ భావాల్ని కళారూపానికి ఎక్కించడానికి మరెన్ని జాగ్రత్తలు తీసుకోవాలో నేర్చుకోవడానికి ఈ పుస్తకం మంచి గుణపాఠం.

సంగం - తెలంగాణా పోరాట నవల - తిరునగరి రామాంజనేయులు
జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య ప్రచురణ, 1986 జులై, వెల రు. 12/-
ప్రతులకు : మైత్రీ బుక్ హౌస్, మసీదు వీధి, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ - 520 002.

విరసం విశేషాలు

విశాఖపట్నం యూనిట్

జూన్ 15న విరసం, నాస్తిక సమాజం, దళిత మహాసభ సంయుక్తంగా జరిపిన శ్రీశ్రీ సంస్మరణ సభలో కాళీపట్నం రామారావుగారు, విరసం తరపున శివరామప్రసాద్ శ్రీశ్రీ రాజకీయ చైతన్యాన్ని, సమాజం పట్ల ఆయన పెంపొందించుకున్న అవగాహనను కవితాపరంగా ఎలా మల్చుకున్నదీ వివరించారు. కె. ఎస్. చలం, చందు సుబ్బారావు, ప్రజ్ఞానంద్‌గార్లు కూడా మాట్లాడారు. శ్రీరామ్మూర్తిగారు అధ్యక్షత వహించారు.

జులై 10న విరసం చెరబండరాజు సంస్మరణ సభ జరిపింది. అధ్యక్షత వహించిన చలసాని ప్రసాద్ పీడిత ప్రజా పోరాటాలను గానం చేసిన విప్లవకవి చెరబండరాజుని ఈ ప్రభుత్వం బలి తీసుకుందని చెప్పారు. భారత నాస్తిక సమాజం తరపున శ్రీరామ్మూర్తిగారు మాట్లాడుతూ సామాజిక పురోభివృద్ధికి పనికొచ్చే భావాలను కవిత్వం ద్వారా ప్రచారంచేసిన చెరబండరాజుకి జోహార్లర్పించారు.

చెర కవితలు, పాటలు విన్పించడంతో చెరబండరాజు తమ ముందు కొచ్చినట్టుగా సభ్యులు ఉత్తేజితులయ్యారు.

హైదరాబాద్ యూనిట్

జులై 12న కామ్రేడ్ విమల అధ్యక్షతన శ్రీశ్రీ, చెరబండరాజుల సంస్మరణ సభ జరిగింది.

పునాదిని ప్రభావితం చేయడంలో విరసం నిర్వహించిన పాత్రను ప్రొ॥ హరగోపాల్ విశ్లేషించి వివరించారు.

"స్తబ్దతను బద్దలు కొడుతూ విరసం ఏర్పడింది. పీడిత ప్రజా పోరాటాలకి స్పందిస్తూ, నిజమైన ప్రజాసంస్కృతిని పెంపొందించింది. శ్రీశ్రీ, చెరల కృషి ప్రత్యేకించి పేర్కొనదగింది. నిర్బంధాలకు వెరవకుండా విరసం ముందుకే సాగుతుంది" అన్నారు కార్యదర్శి చలసాని ప్రసాద్.

17 ఏళ్ళనాడు ఏర్పడిన విరసం ఇవేళ్టి యువ రచయితలకు ఉత్తేజం కలిగిస్తూందనీ, సాహిత్య బాటలను తీర్చి దిద్దే శక్తిగల సంస్థ విరసం మాత్రమేననీ కా॥ నారాయణస్వామి అన్నారు.

తర్వాత కవి శివారెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ఆంధ్ర దేశంలోని వివిధ శకుల కవితలు ఈ సమ్మేళనంలో చోటు చేసుకున్నాయి.

కృష్ణాజిల్లా యూనిట్

జూన్ 14న విరసం ఆధ్వర్యంలో విజయవాడలో మహాకవి శ్రీశ్రీ సంస్మరణ సభ జరిగింది. కామ్రేడ్స్ కాకరాల, సి ఎస్ ఆర్ ప్రసాద్ ప్రసంగించిన ఈ సభకు కామ్రేడ్ ఆలూరి భుజంగరావు అధ్యక్షత వహించారు. శ్రీశ్రీ వ్యక్తిత్వం టాంక్ బండ్‌మీది శిలా విగ్రహంలో లేదని, విప్లవోద్యమ, విప్లవ సాహిత్యోద్యమ పురోగమనంలోనే శ్రీశ్రీ ఆవిష్కరణ పొందుతాడని వక్తలు అన్నారు.

జులై 2న విజయవాడలో కామ్రేడ్ చెరబండరాజు సంస్మరణ సభ జరిగింది. సభకు ముందు ముత్యాలంపాడులోని కామ్రేడ్ చెర స్థూపం దగ్గర కామ్రేడ్ కృష్ణాబాయి జెండా ఎగురవేశారు. రాడికల్ యువజనులు, జననాట్య మండలి సభ్యులు, విరసం సభ్యులు స్థూపం దగ్గర పాటలు పాడారు. సభకు కామ్రేడ్ కృష్ణాబాయి అధ్యక్షత వహించగా కామ్రేడ్ సి ఎస్ ఆర్ ప్రసాద్, వేణుగోపాల్ మాట్లాడారు.

జులై 5న గుడివాడలో తెలంగాణ సాయుధ పోరాట ప్రారంభ, విరసం పుట్టుక చెర సంస్మరణల సందర్భంగా బహిరంగ సభ జరిపేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఉదయం నుంచి పుస్తక ప్రదర్శన జరిపేందుకు, సాయంత్రం సభ జరిపేందుకు స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు హైస్కూల్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవడం జరిగింది. కాని స్థానిక డి. ఎస్. పి. ప్రోద్బలంపై మునిసిపల్ కమీషనర్ అనుమతిని వెనక్కి తీసుకున్నాడు. పుస్తక ప్రదర్శన ప్రారంభమైన తర్వాత పుస్తకాలను తీసివేయమని ఆదేశించి, స్కూలుకు తాళం వేయించాడు. ఒక సాహిత్యాభిమాని కోరికపై ఆయన ఇంటి మేడపైన సాయంత్రం సభ మాత్రం జరిగింది. కామ్రేడ్ భుజంగరావు అధ్యక్షత వహించగా కామ్రేడ్ వి. చెంచయ్య, వేణుగోపాల్ మాట్లాడారు. ఈ మూడు సభలలోనూ జననాట్యమండలి పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.

విరసం స్వయంగా ఏర్పాటు చేసిన పై కార్యక్రమాలతోపాటు కృష్ణా జిల్లాలో వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన అనేక కార్యక్రమాలలో సభ్యులు చురుకుగా

[తరువాయి 4 పేజీలో]

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	**KLVA106M101**
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	**07 February 2025**
ముందు అట్ట	yes
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	95
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	CT / BCT,
లేని పేజీలు	no
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Jayamma
స్కాన్ చేసినది	Priyanka
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good